
ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
4 అణాలు

విషయానుక్రమణిక

9 మే 1951

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును

Founder : K. NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 34
9-5-51

ఖర సంవత్సర వైశాఖ శుద్ధ తదియ బుధవారము

కాంగ్రెస్ డెమోక్రటిక్ ఫ్రంట్ ★ [illegible]

★

కాంగ్రెస్ సంస్థలో చీలికలు తెచ్చి బలహీన పరచడం ప్రస్తుత క్లిష్ట కాలంలో కూడదని నెహ్రూ ఆజాద్‌గార్లు ఇచ్చిన సలహా ప్రకారం ఆచార్య కృపలానీగారి కాంగ్రెస్ డెమోక్రటిక్ ఫ్రంట్ అంతమొందించబడింది. కాంగ్రెస్ సంస్థలో ఇటువంటి ప్రత్యేక వర్గాన్ని నిర్మించడం నియమవిరుద్ధం కాకపోయినప్పటికీ, ఒక వంక అధికార కాంగ్రెస్ కార్యవర్గం ఒత్తిడివల్లనూ, మరొకవంక కాంగ్రెస్‌నుంచి విడిపోవాలని ఫ్రంట్‌కు చెందిన వివిధవర్గాల ఒత్తిడివల్లనూ ఈ విధంగా తీర్మానించవలసి వచ్చిందని ఆచార్య కృపాలనీ పత్రికా ప్రతినిధులతో చెప్పారు.

సోషలిస్టులను, కమ్యూనిస్టులను కాంగ్రెస్‌లోనుంచి వెడగొట్టినది మొదలు కాంగ్రెస్‌లో అధికారవర్గానికి తప్ప అన్యవర్గాలకు అట్టే తావులేకపోయిందనే చెప్పాలి. ఈ తత్వాన్ని ప్రతిఘటించి, పరిపాలనలో దోషాలను కప్పుకోడానికి ప్రయత్నిస్తున్న అధికారవర్గాన్ని నిరోధించాలనే ఉద్దేశంతో కృపలానీ డెమోక్రటిక్ ఫ్రంట్‌ను స్థాపించారు. కాంగ్రెస్ సంస్థలోని మలినాన్ని కడిగివేసి, పరిపాలనా వ్యాసంగాన్ని క్రమబద్ధం చెయ్యాలని ఉద్దేశించినట్లు వారు చెప్పుచున్నారు. కాని పాలనాధికారం చేతికందని ఒకే ఒక కారణంవల్ల, అధికారవర్గాన్ని ప్రతిఘటించి, అధికారాన్ని చేపట్టాలని యత్నించే వర్గాలన్నీ ఈ ఫ్రంట్‌లో చేరాయి. కృపలానీగారు తమ ఆశయాల్ని సాధించడానికి, అనగా సంస్థలోనూ, పరిపాలనలోనూ దుష్టాంగాలను ఖండించడానికి కూడా అధికారం హస్తగతం చేసుకోడం ఒక్కటే మార్గమని తలిచారు. ఇప్పుడు ఫ్రంట్ విఫలం కావడానికిదే కారణం. అధికారవర్గంలో ఉన్నవారు తమబలాన్ని పెంపొందించుకున్నారు. ప్రత్యర్థివర్గాన్ని అణిచివెయ్యడం వారికి సులువయింది.

నెహ్రూ, ఆజాద్‌గార్లు కాంగ్రెస్ సంస్థలోనే ఉండి, సంస్థను బలపరిచి ఈ ఆశయాలను సాధించాలని కృపలానీగారితో వాదించారు. కాని ఇంతకాలం పరిపాలనాధికారంలో ఉండి, కాంగ్రెస్‌లోని అధికారవర్గాన్ని సక్రమపథంలో పెట్టలేకపోయిన నెహ్రూ ప్రభృతులు, ఫ్రంట్ రద్దయినంత మాత్రంచేత ఇకముందు తమ ఆశయాల నెలా సాధించదలిచారో తెలియదు. అది అసంభవమని పరిస్థితులే నిరూపిస్తున్నాయి.

అన్ని వర్గాలవారూ కాంగ్రెస్ ఆదర్శాలనే చాటుకుంటూ, అన్యవర్గాలవారు కాంగ్రెస్ ఆదర్శాలను విస్మరించారని ప్రచారం చేసుకుంటున్నారు. కాని ప్రజలకుకాని, రాజకీయవాదులకు కాని వారివారి అభిప్రాయభేదాలేవో తెలియడం లేదు. అధికార పదవులే వారి ఆశయాలని భావిస్తున్నారు. నేటి పరిపాలనా విధానం, నేటి ప్రభుత్వాల కార్యకలాపాలు కార్యక్రమాలు, కాంగ్రెస్ ఆశయాలతో ఎలా భేదిస్తున్నాయో వివరించవలసిన అగత్యం ఉంది. తామనుసరిస్తున్నది కాంగ్రెస్ కార్యక్రమ విధానమేనని, ఆచరణ యోగ్యతమ బట్టి మాత్రమే హద్దులుకాని లోపాలు కాని తప్పడంలేదనీ అధికారవర్గం చెప్పుకుంటోంది. ఇది సత్యంకాదని వారికీ తెలుసును; అన్యవర్గాలకూ తెలుసును; ప్రజలకూ తెలుసును. ఆచరణలోనూ అనుభవంలోనూ ఇదెలా సంభవిస్తోందో విశదపరచవలసిన అవసరంఉంది. కాంగ్రెస్ ఆదర్శాలంటేనూ, కాంగ్రెస్ ఆశయాలంటేనూ అనేకార్థాలు, అనేక నిర్వచనలు, పరస్పర విరుద్ధభావాలు ప్రచారంలో ఉన్నాయి. ఈ పరిస్థితిని విశదపరచవలసిన బాధ్యత అధికారేతరవర్గాలపై ఉంది. అదింతవరకూ నెరవేరలేదు. నిజానికి ఈ రోజున అధికారవర్గం కాని ఇతర వర్గాలు కాని కాంగ్రెస్ సంస్థ పేరు చెప్పుకుని చాటుకునే హక్కు కోలుపోయినాయని చెప్పాలి. అహింసాత్మక జాతీయోద్యమం నడిపిన కాంగ్రెస్‌నీ నేటి కాంగ్రెస్‌కీ పోలికలేదు. గాంధీమహాత్ముని కాంగ్రెస్ సంస్థ పేరు నుపయోగించుకోగల అర్హత ఏ వర్గానికీ లేదు. ఆ పేరును అందరూ విసర్జించి, ఎవరి రాజకీయాశయాలకు తగిన పేరు వారు పెట్టుకుని భిన్న రాజకీయపక్షాలుగా వ్యవహరించడం మేలు. కాంగ్రెస్‌సంస్థకు పాలనాధికారంతో కాని, పార్లమెంటరీ రాజకీయాలతో కాని సంబంధంలేకుండా, గాంధీమహాత్ముని లోకసేవాలక్ష్యంకల సేవాసంస్థగా మన్నించడం మేలు. అప్పుడే మన దేశంలో రాజకీయాలు స్పష్టపడగలవు. ★

★ జపాన్‌కు మకార్థర్‌పెట్టిన భిక్ష ★

మకార్థర్‌ను ట్రూమన్ బర్తరఫ్ చెయ్యడంచేత అయోమయంలో ఉండిపోయిన సమస్యల్లో ముఖ్యమైనది జాన్‌ఫోస్టర్ డలెస్ స్థానమూ, డలెస్ విధానమూనూ. జపానుతో చైనావ్యతిరేక శాంతి ఒడంబడిక ఏకపక్షంగా చేసుకోవడమే డలెస్ విధానం. ఈ విధానాన్ని బ్రిటన్‌చేతా, పెసిఫిక్ రాజ్యాలచేతా ఆమోదింపజేయడం సుకరమవుతుందని మకార్థగ్‌ను బర్తరఫ్‌చేసిఉన్నట్టయితే, ఈ బర్తరఫ్ దూరప్రాచ్యశాంతికి ఏమీ తోడ్పడజాలదు. ట్రూమన్ మకార్థర్‌ను బర్తరఫ్ చేసినప్పటికీ డలెస్‌విధానంపట్ల ఆయన వైఖరి మారినట్టు నిదర్శనం లేదు.

డలెస్ కూడా మకార్థర్‌లాగే జపానులోనూ, పరిసరాలలోనూ స్థావారాలుంచుకోవాలనీ, ఫోర్మోజా చైనాకు చెందరాదనీ కోరుతున్నాడు. ఆయన దృష్టిలో జపాను, ఫోర్మోజాలు కూడా అమెరికా రక్షణ శ్రేణికి చెందినవే. ఈ రక్షణపథకాన్ని పెంపొందించడానికే ఆయన జపానుతో ప్రత్యేక శాంతిఒడంబడిక జరగాలనీ, అందులో చైనా రష్యా లుండరాదనీ, చైనా తీరసముద్రంలో అమెరికాకు సైనిక పెత్తనం ఉండాలనీ అంటున్నాడు. ఈ విధానంవల్ల జపానులోని జాతీయ, సమర శక్తులు తిరిగి విజృంభిస్తాయన్నది మకార్థర్ జపానులో సాగించిన పరిపాలన యొక్క సాంఘిక, రాజకీయ పరిణామాల వల్ల స్పష్టమవుతున్నది.

ముందుగా తెలుసుకోవలసిన దేమంటే జపాను తిరిగి ఆయుధాలు చేపట్ట నారంభించింది. జపానులోని "జాతీయ పోలీసు రిజర్వు"లో 75 వేలమంది యుద్ధసన్నద్ధులై ఉన్నారు. (ఈ బలం 4 డివిజనులవుతుంది.) వారికి ఫిరంగిశిక్షణ కూడా ఇవ్వబడనున్నది - నూతన జపాను బలాలకు ఈ బలాలే ప్రాతిపదిక అని రెండు నెలల క్రితమే టోక్యోలోని టైమ్సు పత్రిక విలేఖరి వ్రాశాడు. ఒకప్పుడు మకార్థర్ చేత బర్తరఫ్ చేయబడిన మాజీ సైనికోద్యోగులు చాలామంది తిరిగి ఉద్యోగాలివ్వబడుతున్నారు, లేదా స్థానికనాయకులుగా తిరిగి వస్తున్నారు. ప్రస్తుతానికి అమెరికన్ బలాలు జపానులోనే ఉండాలనీ, వాటి చాటున జపాను ఆత్మరక్షణశక్తులను పెంపొందించుకొంటుందనీ డలెస్ అన్నాడు.

రెండవ విషయమేమంటే, మకార్థర్ ఆక్రమణతో గొప్ప సాంఘికవిప్లవం జరుగుతుందని బాజా వాయించినప్పటికీ ఈ ఆక్రమణవల్ల జపానులోని సాంఘికవ్యవస్థలో ప్రాథమిక మార్పులేమీ కలగలేదు. ఈ సంగతి 1948 నాటికే తేలిపోయింది. జపాను శీఘ్రంగా కోలుకోగలందులకై పరిహారం విషయంలోనూ, పరిశ్రమల కేంద్రీకరణవిషయంలోనూ, నిస్సైనిక విధానం విషయంలోనూ పట్టు సడలించవలసి ఉంటుందని 1948 ఆరంభంలోనే అమెరికా సైనికశాఖ ఉపకార్యదర్శి రాయల్ అనే ఆయన అన్నాడు. అమలు జరిగినది కూడా ఇదే. యుద్ధానికి పూర్వం జపాను ఆర్థికబలం యావత్తూ "జాయిబట్సు" గుత్తవ్యాపారసంస్థచేతిలో ఉండేది. భారీ పరిశ్రమలన్నీ వీరి చేతిలో ఉండటంచేత ఈ సంస్థలవారికి ప్రభుత్వంమీద అంతులేని ప్రభావం ఉండేది. యుద్ధనేరాలకు రాజకీయవేత్తలూ, సేనానాయకులూ ఎంత బాధ్యులో వీరూ అంతే బాధ్యులు. జపాను లొంగుబాటు అనంతరం ఈ గుత్తసంస్థలను రద్దుచేయాలని మిత్రరాజ్యాలు నిర్ణయించాయి. అమెరికనులకు ఈ సంస్థలంటే మంటగా ఉండేది. కొద్దిమంది వ్యక్తులమధ్య సోషలిజమని డగ్లస్ మకార్థర్ కూడా ఈ సంస్థలను నిందించాడు. అయితే దురదృష్టవశాత్తూ ఈ గుత్తవ్యాపారపు గుట్టు మట్లు జాయిబట్సుకుతప్ప పైవారికెవరికీ తెలియవు. అందుచేత జాయిబట్సు తనను తాను రద్దుచేసుకోగలందులకై 1945

గూక్స్!

అమెరికన్ ధాన్యాల్లో 'డి' విటమిన్లు
(చైనా ధాన్యాల్లో 'సి' విటమిన్లూ)
ఉన్నట్టు కొందరు నిపుణులు కనిపెట్టారట;
మన క్కావలసింది కూడా 'డి' విటమిన్లేనట.

అందుకే ఆహార శాఖామంత్రి మున్షీగారు
అమెరికా వేపుకే మొగ్గుతున్నారు—
మనకు సరియైన ప్రజాస్వామ్య సంస్కారం
నేర్పేందుకు వాళ్లిస్తారట తమ ఆహారం.

ఐతే మనలో అనమెరికన్లు ఎక్కువౌతున్నట్టు
యాంకీ లెలాగో పసికట్టారు మనగుట్టు.
అందులో ప్రధాని నెహ్రూను ముఖ్యంగా
జమకట్టారు అనమెరికన్ నంబర్ వన్‌గా.

కనుకనే జరుగుతోంది ధాన్య సహాయం బిల్లుపైని
అమెరికాలో పార్టీ రాజకీయాల మేజువాణి.
ఈలోగా పత్రికల్లో యాంకీ ఔదార్యపు వార్తలు
తిని బతుకుతున్నారు బీహారుక్షుధార్తులు.

పాశ్చాత్యుల దృష్టిలో మనం
"రెండో తరగతి" కి చెందిన మనుషులం.
ఎప్పుడో చెప్పాడు చెప్పనే జనరల్ స్మట్సు:
మనంత ఓర్పుగల మృగాలు గాడిదలు తప్ప లేనట్టు.

—సవ్యసాచి—

డైరీ

సోమవారం, ఏప్రిల్ 30:

—కొరియాలో యుద్ధాన్ని అంతమొందించడానికి మూడు అంశాల కార్యక్రమాన్ని అమెరికన్ విదేశాంగ మంత్రి డీన్ ఎచిసన్ సూచించాడు.

—1951-52 లో 6100 కోట్ల డాలర్లు దేశరక్షణ ఖర్చుకి ప్రత్యేకించాలని ట్రూమన్ అమెరికన్ కాంగ్రెస్‌ని కోరాడు.

—చీనాలో బ్రిటిష్ వారికి చెందిన ఏషియాటిక్ పెట్రోలియమ్ కంపెనీని చీనా ప్రభుత్వం స్వాధీన పరుచుకుంది.

—ఆంగ్లో - ఇరానియన్ ఆయిల్ కంపెనీ మాసవాయిదా రాయల్టీ రెండు కోట్ల పౌనుల చెల్లింపు నిలిపి వేసింది.

—కాశ్మీర్ వివాద విషయమై ఐక్యరాజ్యసమితి ప్రతినిధిగా డా॥ ఫ్రాంక్ గ్రాహాంను భద్రతామండలి నియమించింది. అమెరికన్ దేశస్థుని కాశ్మీర్ మధ్యవర్తిగా నియమించినందుకు రష్యన్ ప్రతినిధి ఆక్షేపణ తెలిపాడు.

—రాజ్యాంగ సవరణ చేసే హక్కు ప్రస్తుత పార్లమెంట్‌కి లేదని భారత వాణిజ్య సభా సమితి ప్రకటించింది.

—ప్రజాపార్టీ విజయవాడ సమావేశంలో ప్రకాశంగారు నాయకుడుగాను, రంగాగారు వారికి సహాయ కారిగాను ఎన్నుకొనబడ్డారు.

—కాంగ్రెస్ సంస్థనుండి విడివడిపోయిన ప్రకాశం, రంగా ప్రభృతులను నిరసిస్తూ, పండిట్ నెహ్రూను వారు నిందిస్తున్నారని ఆంధ్ర కాంగ్రెస్ కార్యవర్గం ఆరోపించింది.

—రంగాగారి హయాంలో ఆంధ్ర కాంగ్రెస్ జమా ఖర్చుల్ని పరిశీలించడానికి ఎవరికైనా నియమించవలసిందని ఆంధ్ర కాంగ్రెస్ కార్యవర్గం కాంగ్రెస్ అధ్యక్షుని కోరింది.

మంగళవారం, మే 1:

—రష్యా, చీనా, అమెరికా, బ్రిటన్.

లో మకార్థర్ కార్యాలయం ఒక పథకం తయారుచేసింది. 1946 లో సుసయామా అనే జాయిబట్సూ అధికారి అధ్యక్షత కింద గుత్తదారీ రద్దు కమిషను పని ప్రారంభించింది.

కాని ఈ పని ఎట్లా జరుగుచున్నదో, జాయిబట్సూ వాటలు జాయిబట్సూ విజెంట్లకే పోతున్నవో; మరొకరికి పోతున్నవో ఎవరికీ తెలియదు. పెద్ద సాంఘిక విప్లవం జరిగితేనేగాని జాయిబట్సూను కదిలించడం సాధ్యం కాదన్న విషయం కాలక్రమాన విదితం కాసాగింది. ఈ భావం కలిగిన అనంతరం జాయిబట్సూ శత్రుత్వం కంటె మిత్రత్వమే ఎక్కువ లాభసాటిగా ఉంటుందన్న భావం చాలా సులభంగానే అంకురించింది. జపానును సైనికంగానూ పారిశ్రామికంగానూ ఒకనాడు నిర్మించిన వారే, అంటే జాయిబట్సూ గుత్తదారులే, జపాను పునర్నిర్మాణం చేయడంలో కూడా సమర్థులని రాయల్ అనేవాడే అన్నాడు. అంతటితో జాయిబట్సూ కూడా రథమెక్కింది. డగ్లస్ మకార్థర్ ఈ రథానికి సారథ్యం వహించి ఉండనే ఉన్నాడు.

అమెరికాలో సంఘ పెద్దలుగా గణించబడే మోర్గన్‌లూ, డ్యూపాంట్‌లూ, హెన్రీ ఫోర్డ్‌లూ ఎటువంటివారో జపానుకు జాయిబట్సూ ధనికులూ అటువంటివారే నని ఒక అమెరికన్ విలేఖరి ఇటీవలనే స్వగతం ఆలపించాడు. అదీ కాక గడచిన రెండేళ్ళ కాలంలో మకార్థర్ ఆక్రమణ ప్రభుత్వంవారికి జాయిబట్సూ వారు చాలావిధాల తోడ్పడ్డారు. వారి విశ్వాసానికి మెచ్చి మకార్థర్ జపానులోని పరిశ్రమపై ఉండిన ఆంక్షలనూ, నిర్బంధాలనూ తొలగించాడు. మిగిలిన నిర్బంధాలతోబాటు 40 లక్షుల మరకదుళ్ళ నిర్బంధం కూడా పోయింది. దాని ఫలితంగా విచిత్ర పరిణామాలు కలిగాయి. 1949 లో 7,440 లక్షుల చదరపు గజాలబట్ట ఎగుమతిచేసిన జపాను 1950 లో 11,000 లక్షుల చదరపు గజాల బట్ట ఎగుమతిచేసింది. (బ్రిటను 1949 లో 9,030 లక్షుల చ.గ., 1950 లో 8,220 లక్షుల చ. గ. ఎగుమతి చేసింది) 1950 లో జపాను ఎగుమతి చేసినంతబట్ట మరే దేశమూ ఎగుమతి చేయలేదు.

1945 వ సంవత్సరపు చీకటిరోజుల్లో జపాను రాజకీయవేత్తలు ముందుముందు తమ కింత అదృష్టం పడుతుందని కలలోనైనా ఊహించివుండరు. మిత్రరాజ్యాల ఆక్రమణ తొలిరోజుల్లో కొందరు ఫాసిస్టు సైనికాధికార్లు ఉరితీయబడినమాట నిజమే. కాని జర్మనీలోవలెనే జపానులో కూడా పునరాయుధీకరణ విధానం మూలంగా హతశేషులైన మిలిటరిస్టుల అదృష్టం మారింది. నిరుడు మార్చిలో జనరల్ మెకార్థర్ ఖైదులో ఉన్న యుద్ధనేరస్థులను శిక్షాకాలం ముగియకపోయినాసరే విడుదలచేయాలని ఆజ్ఞ జారీచేశాడు. దీనివల్ల మానవజాతిపట్ల పైశాచిక నేరాలు జరిపిన 16 గురు యుద్ధనేరస్థులు విడుదల అయ్యారు ...వీరిని తిరిగి మరో దురాక్రమణకోసం ఉపయోగించుకోవాలని మెకార్థర్ ఆశయం...దూరప్రాచ్యంలో శాంతిసాధనకు మొదటి మెట్టుగా మెకార్థర్‌ను తొలగించిన ట్రూమన్..అమెరికన్ విధానాన్ని పూర్తిగా మార్చి వేయాలి.

అనగా అమెరికాకు మిత్రులైనవారి కోర్కెలను మన్నించాలి. జపాన్‌తో సంధి చేసుకొనేటప్పుడు చైనా, రష్యాలకు వాటి ఉచితస్థానాలను వాటికివ్వటం, చైనాను ఐక్యరాజ్యసమితిలో చేర్చుకొనటం, ఫార్మోజాను చైనాకిచ్చివేయటం ఇందుకు మార్గాలు. ఈ మార్గాల్లో జపాన్ సంధి జరిగితే, అటు పశ్చిమరాజ్యాల ఆశయాలకూ, ఇటు చైనావారి ఆశయాలకూ భంగం లేకుండా కొరియాలో శాంతిని స్థాపించడం సాధ్యమౌతుంది. ★

(న్యూస్టేట్స్‌మన్—ఏప్రిల్ 21)

మొదలైన అన్ని దేశాలలోనూ కార్మికులు మేదినోత్సవం జరిపారు.

—పర్షియన్ నూనె పరిశ్రమ తగాదాలో బెదిరింపులకు లోబడి రాయబారాలు జరపబోరని బ్రిటిష్ విదేశాంగ మంత్రి మారిసన్ బ్రిటిష్ పార్లమెంటులో ప్రకటించాడు.

—బెదిరించి ఒప్పించిన 1933 ఒడంబడికను పర్షియా మన్నించ నవసరం లేదని క్రొత్తప్రధాని డా॥ముసాదిక్ ప్రకటించాడు.

—జపాన్‌లో ప్రభుత్వంపై నిర్బంధాలను క్రమంగా తొలగించి సంపూర్ణ స్వాతంత్ర్య మివ్వడం తన ఉద్దేశమని జనరల్ రిడ్జ్‌వే ప్రకటించాడు.

—భారతదేశాన్నంతనీ మహమ్మదీయుల పాలనలోకి తేవాలనే లక్ష్యంతో పాకిస్తాన్‌లో 'హిందూస్తాన్ హమారా' అనే రాజకీయపక్షం ఒకటి స్థాపించబడింది.

—దిగుమతుల సలహాసంఘం ఆరవ సమావేశం ఢిల్లీలో మంత్రి హరికృష్ణ మెహతాబ్ గారిచే ప్రారంభించబడింది.

—నియోజక వర్గాల విభజన గురించిన ఫిర్యాదులను పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వ మంత్రివర్గ ఉపసంఘం నియమించ బడింది.

బుధవారం, మే 2 :

—అల్ప వ్యవధిలో విజయం సాధించాలని తలపెట్టి కొరియాలో కమ్యూనిస్టులు ప్రారంభించిన కొత్తదాడి విఫలమయిందనీ, సమితి సైన్యాలకు అఖండ విజయం లభించిందనీ అమెరికన్ అష్టమసైన్యాధిపతి జనరల్ వాన్ ఫ్లీట్ ప్రకటించాడు.

—అట్లాంటిక్ పాక్ట్ దేశాలన్నీ ఆయుధాలను ఒకే తరహాలో తయారు చెయ్యడానికి నిశ్చయించాయి.

—పర్షియా నూనెపరిశ్రమను ప్రభుత్వపరం చేసుకోడానికి పార్లమెంట్ ఆమోదించిన శాసనానికి షా అనుమతి నిచ్చాడు. బ్రిటిష్ ప్రభుత్వం అసమ్మతి తెలియపరిచింది.

—బ్రిటిష్ కమీషనర్ జనరల్ మాల్కం మాక్డొనాల్డ్, బావోదాయ్‌తో ప్రాచ్యదేశ రక్షణ గురించి చర్చించడానికి ఇండోచీనా వెళ్లాడు.

—భారతదేశానికి ఆహారం పంపే విషయమై అమెరికన్ రిప్రజెంటెటివ్ హౌస్ శాసనాన్ని వాయిదా వేసింది. దీనికి నెహ్రూ బులంద్ షహర్ ఉపన్యాసం కారణమని జేమ్స్ రిచర్డ్ చెప్పాడు.

—బెంగుళూరు హిందూస్తాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఫాక్టరీలో అన్నిరకాల విమానాల్ని తయారు చెయించడానికి భారతప్రభుత్వం నిశ్చయించినట్లు సర్దార్ బల్దేవ్ సింగ్ పార్లమెంట్‌లో చెప్పారు.

గురువారం, మే 3 :

—చీనా కొరియా యుద్ధంలో జోక్యం చేసుకోబోదని చెప్తూ జనరల్ మెకార్థర్ వేక్ ద్వీప సమావేశంలో చెప్పిన వృత్తాంతమంతా ట్రూమన్ పత్రికా సమావేశంలో బయటపెట్టాడు. తను చెప్పిన దానిని లిపిబద్ధం చేసిన సంగతి తనకి తెలియదని జనరల్ మెకార్థర్ అన్నాడు.

—చీనాదేశానికి ఎగుమతులను (ముఖ్యంగా యుద్ధపరికరాల కవసరమైన సామగ్రిని) అమెరికన్ ప్రభుత్వం నిషేధాలకు, నిర్బంధాలకు లోను చేసిన పద్ధతిని బ్రిటన్ కూడా ఇకనుంచి అనుసరించగలదని అట్లీ పార్లమెంట్‌లో చెప్పాడు.

—బ్రిటిష్ జాతీయ మహోత్సవం జార్జి రాజు చేత ప్రారంభించబడింది.

—హవానాలో బ్రిటిష్‌వారికి చెందిన రైల్వేలను ప్రభుత్వపరం చెయ్యాలని క్యూబా ప్రెసిడెంట్ కాంగ్రెస్‌కి ఆదేశమిచ్చాడు.

—గెలిలీ ద్వీపంవద్ద మళ్ళీ సిరియా, ఇజ్రాయిల్ సైనికులమధ్య చెలరేగిన పోరాటాన్ని వెంటనే మానాలని ఐక్యరాజ్య సమితి ప్రతినిధి ఆజ్ఞయిచ్చాడు.

—1949 లో భారతదేశంలో ఆస్తులమ్ముకున్న ముస్లిం శరణార్థులు 30 మంది అనీ, పాకిస్తాన్‌లో ఒక్క హిందువు మాత్రమే ఆస్తి అమ్ముకోగలిగాడనీ స్టేట్ మంత్రి ఏ. పి. జైన్ పార్లమెంట్‌లో చెప్పారు.

—పండిట్ నెహ్రూ సలహాననుసరించి ఆచార్య కృపలానీగారి డెమోక్రటిక్ ఫ్రంట్ రద్దుపరచబడింది. ఫ్రంట్ సభ్యులు కాంగ్రెస్‌లో ఉండడమో, విడిపోవడమో నిర్ణయించుకునే అవకాశం ఇవ్వబడినట్లు కృపలానీ ప్రకటించారు.

—కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం న్యూఢిల్లీలో ప్రారంభమైనప్పుడు శ్రీ యస్. కె. పాటిల్ ఆంధ్రదేశంలో కాంగ్రెస్ ఎన్నికల్ని గురించి నివేదించారు.

—భారత రిపబ్లిక్ అధ్యక్ష పదవినుండి విరమించుకునేవారికి సాలీనా రు 15,000 పెన్షన్ ఇవ్వడానికి ఒక శాసనాన్ని పార్లమెంట్ ఆమోదించింది.

—రవీంద్రనాథఠాకూర్‌చే స్థాపించబడిన విశ్వభారతిని ప్రభుత్వ నిర్వహణలోకి తీసుకోడానికి పార్లమెంట్ ఒక శాసనాన్ని ఆమోదించింది.

—హిందూస్త్రీలకు ఆస్తులలో వారసత్వపు హక్కుల నిచ్చే శాసనం చెల్లుతుందని సుప్రీంకోర్టు ఒక కలకత్తా కేసులో తీర్పు నిచ్చింది.

—దక్షిణాదిని బొగ్గు సరఫరా సౌకర్యాలు లోపమైనందువల్ల ఉక్కు పరిశ్రమను స్థాపించడం సాధ్యంకాదని భారత ప్రభుత్వం దక్షిణ భారత వాణిజ్యసభకు తెలియపరిచింది.

శుక్రవారం, మే 4 :

—గత జనవరిలో యాలూనదివద్దకుదాడి చెయ్యాలని అమెరికన్ సైనికాధిపతులు కూడా సూచించినట్లు మెకార్థర్ కాంగ్రెస్ కమిటీలో చెప్పాడు.

—ఐర్ రిపబ్లిక్ పార్లమెంట్‌ను అధ్యక్షుడు రద్దుచేసి, ఎన్నికలు జరపాలని ఆజ్ఞ ఇచ్చాడు.

—డెమోక్రటిక్ ఫ్రంట్‌ను రద్దుపరిచినందుకు కృపలానీ ప్రభృతులను కేంద్ర కాంగ్రెస్ కార్యవర్గం - అభినందించింది.

—బీహార్ డెమోక్రటిక్ ఫ్రంట్ సభ్యులు కాంగ్రెస్‌నుంచి విడిపోయి ఒక పార్టీ స్థాపించడానికి నిర్ణయించారు.

—రాష్ట్రప్రభుత్వాలకూ, కేంద్ర ప్రభుత్వానికీ మధ్య రాబడిధనాన్ని పంచే పద్ధతిని సమీక్షచేసి, అనుకూలమైన పద్ధతిని సూచించడానికిగాను ఫైనాన్స్ కమిషన్ నియమించే శాసనం పార్లమెంట్ ఆమోదం పొందింది.

—ఈస్టిండియా కాటన్ ఎసోసియేషన్, సెంట్రల్ కాటన్ ఎడ్వైజరీ బోర్డులు పత్తిధరలను పెంచాలని సూచించాయి.

—కులవిచక్షణ నిషిద్ధమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పువల్ల, ప్రస్తుతానికి అన్ని ప్రభుత్వశాఖలూ ఉద్యోగ నియామకం నిలిపివేయాలని మద్రాసుప్రభుత్వం ఆజ్ఞ ఇచ్చినట్లు తెలియవచ్చింది.

—డెల్టాజిల్లాలలో ఆహారవస్తూత్పత్తి వృద్ధికిగాను ఎరువుల కొనుబడి మొదలైన అవసరాలకు రైతులకు వడ్డీలేకుండా ఋణాలివ్వడానికి కోటిరూపాయ లివ్వాలని మద్రాసుప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి సూచించింది.

శనివారం, మే 5 :

—కొరియాలో అమెరికన్లు వ్యాధిక్రిములను ప్రయోగిస్తున్నారని పెకింగ్ రేడియో ఆరోపించింది.

—రెండున్నర లక్షల టన్నులు బియ్యం సప్లైకి బర్మా భారతదేశాలమధ్య వాణిజ్యపు టొడంబడిక కుదిరింది.

(47-వ పేజీ చూడండి)

సీరియల్ నవల:

కౌంట్ ఆఫ్ మాంటెక్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

31

1838 సంవత్సరారంభంలో యువకులిద్దరు ఫ్లారెన్స్ నగరాన్ని (ఇటలీ) సందర్శిస్తున్నారు. వారిద్దరూ పారిస్‌లో ఉన్నతవంశాలకు చెందినవారు. ఒకడు కౌంట్ మార్సెర్ఫ్ (ఫెర్నాండో) కుమారుడు ఆల్బర్ట్. రెండోవాడు బారన్ ఫ్రాంజ్ డి ఎపినే. రోమ్ ఉత్సవాలకు వెళ్లాలని ఇద్దరూ అనుకున్నారు. అయితే ఆ ఉత్సవాలు చూడాలంటే మాటలు కాదు. అందువల్ల సదుపాయమైన కొన్ని గదులు సిద్ధంగా ఉంచవలసిందని లండ్రా హోటల్ యజమాని పస్త్రీనికి ఉత్తరం వ్రాశారు. ఉత్సవాలలోగా కులాసాగా గడపాలనే కోరికతో ఫ్రాంజ్‌ని ఫ్లారెన్స్‌లోనే ఉండనిచ్చి, ఆల్బర్ట్ నేపుల్స్ నగరం వెళ్ళాడు. ఫ్లారెన్స్‌లో ధనాఢ్యులైన కొందరితో కొన్నిరోజులు గడిపి, ఫ్రాంజ్ ఎల్బాద్వీపం చూడ్డానికి బయలుదేరాడు.

ఒకనాటి సాయంకాలం ఫ్రాంజ్ లెగ్‌హారన్ రేవులో ఒక బోటు అద్దెకి తీసుకుని, ఎల్బాద్వీపానికి పోనిమ్మని నావికులికి ఆజ్ఞ ఇచ్చాడు. బోటు సాగరవిహంగంలాగ సముద్రంమీదికి బయలుదేరింది. మరునాడు ఉదయం అది ఫెరాజో రేవు (ఎల్బాద్వీపం) చేరింది. చరిత్రప్రసిద్ధుడైన మహావీరుడు నెపోలియన్ ఈ ద్వీపంలో ఎక్కడెక్కడ నివసించాడో, అన్నిచోట్లూ ఫ్రాంజ్ దర్శించాడు. రెండుగంటల అనంతరం పియనోజావద్ద దిగి తుపాకి తీసుకుని పక్షుల్ని కొడుతూ కొంతసేపు గడిపాడు. ఇక్కడ చాలా పక్షులుంటాయని చెప్పగా విన్నాడు. కాని తీరా వేటకి వెడితే అట్టే కనపడలేదు. ఏవో కొన్ని చిన్నపిట్టల్ని కొట్టి విసుగెత్తి తిరిగి బోటెక్కాడు. కొట్టింది కొద్దయినా ఎక్కువ అలసట పడిపోవడం అలవాటయిన వేటగాళ్లమాదిరిగానే అతనూ వచ్చాడు. అతని విసుగుదల చూసి బోటు కెప్టెన్ ఇలా అన్నాడు: "తమకి కావాలంటే వేటకి బలే చోటొకటుందండి."

"ఎక్కడో?"

"అదుగో అటు చూశారా?" అన్నాడు కెప్టెన్ వేలితో దక్షిణదిక్కుగా చూపుతూ. అక్కడ నీలిసముద్రంలోనుంచి కోణాకారంగా లేచి నిలబడినట్టున్న గుట్టలు కనపడ్డాయి.

"అవును. అదే ద్వీపం?" అన్నాడు ఫ్రాంజ్.

"అది మాంట్‌క్రిస్టో ద్వీపం."

"కాని ఆ ద్వీపంలో వేటకి వెళ్లడానికి నేను అనుమతి పొందలేదే?"

"తమకి అనుమతి అవసరం లేదండి. అది నిర్జనమైన ద్వీపం."

"ఈ ద్వీపం ఎవరిది?"

"టస్కనీ రాజ్యానికి చెందినది."

"అక్కడ వేటాడ్డానికి ఏముంటాయి?"

"వేలకివేలు కొండగొర్రెలున్నాయి."

"మరి రాత్రికి నిద్ర?"

"అక్కడ గుహల్లోనైనాసరే, లేదా బోటుడెక్ మీదనైనాసరే పడుకోవచ్చును."

తన మిత్రుణ్ని కలుసుకోడానికి ఇంకా వ్యవధి చాలా ఉన్నందువల్ల, ఫ్రాంజ్ వెంటనే ఒప్పుకున్నాడు. రోమ్ నగరంలో బస గురించి కూడా అతని కిప్పుడు బెంగలేదు.

అతను ఒప్పుకోగానే నావికులు అందరూ ఒకచోట చేరి గుసగుసలారంభించారు.

"ఏం? ఏదైనా చిక్కుందా?" అని అడిగాడు ఫ్రాంజ్.

"లేదండి." అన్నాడు కెప్టెన్. "కాని ముందుగానే తమకి చెప్పాలి, ఆ ద్వీపంలో దుండగులభయం ఉంటుందండి."

"అదేమిటి?"

"మాంట్‌క్రిస్టో ద్వీపం నిర్జనమైనదే అయినప్పటికీ, అప్పుడప్పుడు సముద్రపు దొంగలూ, అక్రమ వ్యాపారులూ అక్కడ దిగుతూ ఉంటారు. వాళ్లు కార్సికానించీ, సార్డినియానించీ, ఆఫ్రికానించీ వస్తారు. అందువల్ల మీరీ ద్వీపంలో దిగినట్లు తెలిసిందంటే, మా బోటు లెగ్‌హారన్ చేరగానే అక్కడ వారం రోజులు క్వారంటీన్‌లో ఉంచుతారు."

"అంటే చాల రోజులు ఆలస్యమౌతుందన్నమాట."

"తమరు మాంట్‌క్రిస్టో ద్వీపంలో దిగినట్లు తెలిస్తే అంతేనండి."

"నామట్టుకు నేను తెలియనివ్వను" అన్నాడు ఫ్రాంజ్.

"మేమూ చెప్పం" అన్నారు నావికులు.

"అలాగైతే సరే. మాంట్‌క్రిస్టో ద్వీపానికి పోదాం."

కెప్టెన్ నావికులకు ఆజ్ఞ ఇచ్చాడు. బోటు ఆ ద్వీపం దిక్కుగా బయలుదేరింది. ఫ్రాంజ్ కెప్టెన్‌తో సంభాషణ సాగించాడు. కెప్టెన్‌తో ఇలా అన్నాడు. "గేతానో, ఈ ద్వీపంలో సముద్రపు దొంగలు చేరుతూఉంటారని కాదూ అన్నావ్? ఆల్జియర్స్‌ని జయించి, అక్కడ రాజుతరఫున మన (ఫ్రెంచి) పరిపాలన స్థాపించినతరవాత సముద్రపుదొంగల బాధ పూర్తిగా పోయిందనుకున్నానే?"

"లేదండి. రోమ్‌నగరద్వారాలవద్ద ఈనాటికీ గజదొంగలున్నారుకదా! అలాగే సముద్రపుదొంగలూ ఇంకా తిరుగుతున్నారు. ఆరుమాసాల కిందట రోమ్‌నగరందగ్గర ఫ్రెంచి రాయబారిని దోచుకున్న సంగతి మీరు వినలేదా?"

"అవునవును."

"మీరు లెగ్‌హారన్‌లో ఉండిఉంటే, ఎప్పుడూ కొన్ని ఓడల్నిగురించి చెప్పుకోడం వినిఉంటారు. ఏదో ఒక సరుకు బోటునిగురించో, లేక ఒక చిన్న ఇంగ్లీషుబోటుగురించో అక్కడ నిత్యం చెప్పుకుంటూఉంటారు. ఇంగ్లీషుబోటు బాస్టియా, ఫెరాజో, సివిటావిఖియా రేవుల్లో నిత్యం తిరుగుతూఉంటుంది.

అనువాదం: సీతారామ్

అవెప్పుడూ అనుకున్న రోజుకి రావు. అనుకోనప్పుడు వస్తాయి. కొన్ని ఓడలు ఎక్కడో కొండలకి కొట్టుకుని మునిగిపోయుంటాయనుకుంటారు. కాని అవి నిజంగా అలా మునిగిపోవు. ఆరేడుగురు నావికులు నడిపే చురుకైన బోటొకటుంది. అది వాటికి ఎదురౌతూ ఉంటుంది. ఎదురై ఆ ఓడల్ని దోచుకుంటుంది. చీకటిరాత్రుల్లో అడవులదగ్గిర బళ్ళని దారిదొంగలు కొట్టినట్లే."

"అయితే వాళ్లందరూ సముద్రపు దొంగల్ని శిక్షించాలని ఫ్రెంచి ప్రభుత్వాన్ని గాని, సార్డినియన్, టస్కనీ ప్రభుత్వాల్ని గాని అడగలేదా?"

"లేదు. ఎందువల్లనంటే ముందుగా ఆ ఓడల్లో దోచుకునేదంతా దోచుకున్న తరవాత, ఓడల్లో వాళ్లనందర్నీ కట్టిపడేసి, ఒక్కొక్కడికి ఇనపగుళ్లు తగిలించి, ఓడలకి రంధ్రాలు పొడుస్తారు. ఓడల్ని మునిగిపోనిచ్చి దొంగలు తమ బోటులో పారిపోతారు. ఇంక ఆ ఓడ లెన్నడూ రేవు చేరవు. ఫిర్యాదు చెయ్యడానికెవరూ మిగలరు."

గేతానో ఈ సమాచారం ముందే చెప్పిఉంటే, ఆ ద్వీపానికి వెళ్లడానికి ఫ్రాంజ్ వెనకాడేవాడే. కాని తీరా ఒకసారి నిశ్చయించుకున్న తరవాత ఇప్పుడు మానుకోడం అతనికి పిరికితనమనిపించింది. సామాన్యంగా కోరి ముప్పు తెచ్చుకునే తరహా కాదు అతనిది. అయినా ముప్పు వచ్చినప్పుడు జంకడు.

"అబ్బే! నే ననేకసార్లు సిసిలీ, కెలాబ్రియాల మధ్య తిరిగాను. ద్వీప సమూహం మధ్య రెండు మాసాలు తిరిగాను. నాకు మచ్చుకేనా ఒక్క దోపిడిదొంగ కనబడలేదు."

"మిమ్మల్ని వేటకి వెళ్ళకుండా చెయ్యాలని నేను చెప్పడం లేదండి. మీ రడిగినదానికి సమాధానం చెప్పాను. అంతేనండి."

"అవున్లే. నువ్వు సమాచారం చెప్పావు. మంచిదే, వీలైనంతవరకూ చక్కగా కాలక్షేపం చెయ్యాలనుంది. ఆ ద్వీపానికి తప్పకుండా వెడదాం."

బోటు అతివేగంగా ప్రయాణం చేస్తోంది. గాలి వీలుగా వీస్తోంది. గంటకి ఆ రేడు మైళ్ళ వేగంతో బోటు నడుస్తోంది. సమీపిస్తున్నకొద్దీ ద్వీపం సముద్రంలోనుంచి పైపైకి లేస్తున్నట్లు కనపడుతోంది. ఒకదానిపై ఒకటి పేర్చినట్లు కొండల శిఖరాలు కనపడుతున్నాయి. మధ్యమధ్య పొదలూ, చెట్లూ పచ్చగా కనపడుతున్నాయి.

ద్వీపానికి పదిహేను మైళ్ళలో ఉండగా, సూర్యుడు కార్సికన్ పర్వతాల వెనక అస్తమిస్తున్నాడు. అరగంటలో చీకటి కమ్ముకువచ్చింది.

నావికులకు 'ఆ ప్రాంతమంతా కొట్టినపిండే. టస్కనీద్వీప సమూహంలో ఎక్కడే కొండ ఉందో వారికి తెలుసును. లేకపోతే అంత చీకటిలో ఫ్రాంజ్ ఆందోళన చెందవలసిందే.

మరొక గంట ప్రయాణంచేసిన తరవాత ఎడమవైపున రెండు ఫర్లాంగులదూరంలో అకస్మాత్తుగా నల్లని ఆకారం ఒకటి ఫ్రాంజ్ కళ్ళపడింది. ఉన్నట్టుండి ఒక వెలుగు తళుక్కుమంది. అది ఉల్కం కాదని ఫ్రాంజ్‌కి తెలుసును. ఆ పక్క నేలమబ్బులాగుంది.

"ఆ వెలు గేమిటి?" అన్నాడు ఫ్రాంజ్.

"ఉష్! మాట్లాడకండి. అది చలిమంట" అన్నాడు కెప్టెన్ మెల్లిగా.

"ద్వీపంలో జనం ఎవ్వరూ ఉండరని చెప్పావ్?"

"అక్రమవ్యాపారు లిక్కడ దిగుతూ ఉంటారనికూడా చెప్పానండి."

"దోపిడిదొంగల మాట?"

"ఆ భయంవల్లనే ద్వీపానికి పక్కగా బోటు పోనిస్తున్నానండి. ఇప్పుడా మంట మనకి వెనక ఉంది."

"అయితే నాకొకటి తట్టుతోంది. ఈ మంట చూసి భయపడవలసింది కాదు. ఫరవాలేదనుకోవచ్చనుకుంటాను. బైటపడ్డానికి భయపడేవారైతే మంటవెయ్యరు."

"అలా కాదండి" అన్నాడు కెప్టెన్ గేతానో. "ద్వీపం ఉనికి తమరు సరిగ్గా చూసినట్లయితే, ఈ మంట తీరానికికాని, పియనోజాలోకాని కనపడదండి. సముద్రంలోనుంచి చూస్తేనే కనపడుతుంది."

"అంటే ఇప్పుడిక్కడ దుండగులున్నారని నీ ఉద్దేశమా?"

"అదేదో కనుక్కోవాలండి."

ఇలా చెప్పి గేతానో నావికులవద్దకు వెళ్లి సంప్రదించాడు. అయిదునిమిషాలతరవాత బోటు మెల్లిగా వెనక్కి తిరిగింది. ముందు వచ్చినదారినే వెనక్కి కొంత దూరం వెళ్ళేసరికి మంట కనపడకుండా గుట్టలచాటున మాయమయింది. తరవాత చుక్కాని తిప్పి బోటు ద్వీపందగ్గిరికి నడిపారు. ఏభై అడుగుల్లో ఉండగా తెరచాప దింపారు. బోటు ఆగింది. అంతా మౌనంగా ఉన్నారు. బాధ్యతంతా గేతానో తనపైన వేసుకున్నాడు.

ఫ్రాంజ్ తన తుపాకుల్ని శ్రద్ధగా పరిశీలించాడు. తుపాకులు నింపి ఏం జరుగుతుందోనని చూస్తూ నిరీక్షిస్తున్నాడు. కెప్టెన్ ఈలోగా కోటూ, చొక్కా విప్పి, నడుముదగ్గర పంట్లాం గట్టిగా బిగించాడు. ఎవ్వరూ ఒక్కమాట పలకరాదని వేలితో సంజ్ఞచేస్తూ సముద్రంలోకి దుమికాడు. ఆట్టే శబ్దం కానివ్వకుండా తీరానికి ఈదుకువెళ్లాడు. అరగంటలో అలాగే నిశ్శబ్దంగా బోటుకి తిరిగి వచ్చాడు.

"వాళ్లు అక్రమవ్యాపారులు, స్పానిష్ జాతి. వాళ్లలో ఇద్దరు కార్సికన్ దొంగలున్నారు." అని చెప్పాడు.

"ఈ దొంగలకి వీళ్లతో ఏం పని?"

గేతానో అదోకతరహా ఉదారభావం ఉట్టిపడేలాగు "మనుష్యులైనతరవాత ఒకళ్లకొకళ్లు సహాయపడాలి కాదండి!" అన్నాడు.

"ఓహో!" అన్నాడు ఫ్రాంజ్. "అయితే నువ్వుకూడా అక్రమవ్యాపారుల్లో ఒకడివే నన్నమాట?"

కెప్టెన్ విరసంగా నవ్వి అన్నాడు. "ఏం చేస్తాం తమరే చెప్పండి. అదీ ఇదీ కూడా చేస్తేగాని మాకు పొట్ట గడవదండి."

"అయితే ఇప్పుడు ఈ ద్వీపంలో ఉన్నవాళ్లని నీకు తెలుసన్నమాట?"

"ఏదో తెలుసులెండి. మాకూ రకరకాల సంకేతాలుంటాయండి."

"అయితే ఇక్కడ దిగితే ఇప్పుడు భయం లేదంటావా?"

"లేదండి. అక్రమవ్యాపారం చేసేవాళ్ళు దొంగలు కారండి."

"మరి ఆ యిద్దరు కార్సికన్ దొంగల మాటేమిటి?" అన్నాడు ఫ్రాంజ్; ముప్పేదో ముందే పూర్తిగా తేల్చుకోడం ఎందుకైనా మంచిదని.

"మీరు చెప్పేది మరీ బాగుందండి. వాళ్లు దొంగలైనారంటే వాళ్ళదా తప్పు? అది అధికారుల తప్పు!"

"ఎలా గేమిటి?"

"ఏదో ఒక్కణ్ని మాటుబెట్టారని వాళ్ళని వెంటాడి ప్రాణాలు తోడుతున్నారు అధికారులు—అక్కడికి పగతీర్చుకునే హక్కు కార్సికన్లకి లేనట్లు!"

"మాటు పెట్టడం అంటే? ఒక మనిషిని చంపడం అనా?"

"అంటే శత్రువుని చంపడం. హత్యకీ దీనికీ చాలా తేడా ఉందండి."

"అక్కడెంతమంది దుంటారు?"

"వాళ్లు నలుగురు, దొంగ లిద్దరు, మొత్తం ఆరుగురు."

"సరే, మనంకూడా ఆరుగురం ఉన్నాం. వాళ్లేమైనా మన దగ్గిర ఒకాట ఆడబోతే మనందరం కలిసి వాళ్ల ఆట కట్టించవచ్చు. ఏమంటావ్? పదు, ద్వీపంలో దిగుదాం"

"అయితే సరే, అందరూ నిశ్శబ్దంగా ఉండండి" అన్నాడు గేతానో.

ఫ్రాంజ్ దృష్టిలో పరిస్థితి మరీ ప్రమాదంగా కనపడలేదు, బొత్తిగాచిక్కు లేదనడానికి వీల్లేకపోయినా. రాత్రి వేళ కటికి చీకటిలో సముద్రమధ్యంలో, పరిచయంలేని నావికుల మధ్య ఉన్నాడు. అతనిపట్ల వారికి భక్తి ఉండవలసిన అవసరంలేదు. అతనిదగ్గర కొన్ని వేల ఫ్రాంకు లున్నాయని వారికి తెలుసును. ఈ నావికులుతప్ప అతనికి తోడు లేరు. ఈ ద్వీపంలో దిగుతున్నాడు. దీనికి మతానికి సంబంధించిన పేరున్నమాట నిజమే. కాని దొంగలు తిరిగే ఈచోటు అట్టే సుఖంగా ఉండబోదని అతనికి తెలుసును.

ఇది కేవలం అతని ఊహే కావచ్చు. అయినా ప్రమాదాన్ని కనిపెడుతూ, నావికులపైన ఒక కన్నుంచి, పిస్తోలు విడిచిపెట్టకుండా జాగ్రత్త పడ్డాడు. నావికులు మళ్లీ తెరలెత్తి బోటు నడిపారు. కటికిచీకటిలో కూడా ఆ కొండలు నీడల్లా కనపడుతూనే ఉన్నాయి. తీరంవెంట కొద్దిదూరం పోగానే ఒక కొండ కొన దాటిన తరవాత, మళ్లీ మంట కనపడింది. ఇప్పు డది మరింత వెలుగు వ్యాపింప చేస్తోంది. చుట్టూ అయిదారుగురు మనుష్యులు కూర్చున్నారు. మంటవెలుగు సముద్రపు నీటిమీద కొంత మేర పడుతోంది. బోటు ఆ వెలుగులోకి ప్రవేశించింది. అప్పుడు గేతానో, ఇతర నావికులూ కలిసి పల్లెపదం ఒకటి అందుకుని పాడ్డం మొదలు పెట్టారు.

పాట మొదలుపెట్టినవెంటనే మంటచుట్టూ ఉన్న మనుష్యులు లేచారు. గబగబా ఒడ్డుచివరికి వచ్చి బోటువంక చూశారు. బోటు ఎంతపెద్దదో, ఎందుకు వస్తోందో ఊహించడానికి ప్రయత్నిస్తున్నట్లున్నారు.

కొంతసేపటికి అందరూ ఫరవాలేదని తృప్తిపడ్డట్టున్నారు. ఒక్కడుతప్ప మిగతా అందరూ మళ్లీ మంటదగ్గరకు వెళ్లి కూర్చున్నారు. మంటలమీద ఒక కొండగొర్రెని కాలుస్తున్నారు.

బోటు ఒడ్డుకి ఇరవైఅడుగుల్లోకి వచ్చేసరికి ఒడ్డుపై నున్న వ్యక్తి తుపాకి ఎత్తి ఆకాశంలోకి పేల్చాడు. తరవాత కేక పెట్టాడు. ఫ్రాంజ్ తుపాకి, పిస్తోలు గుప్పిళ్లలో గట్టిగా పట్టుకున్నాడు. గేతానో ఒడ్డుపైనున్న మనిషితో సార్డినియన్‌భాషలో రెండు మాటలు మాట్లాడాడు. అది తననిగురించేనని ఫ్రాంజ్‌కి తెలుసును. కాని ఏమి చెప్పాడో తెలియలేదు.

గేతానో ఫ్రాంజ్ వంక తిరిగి "తమ పేరు వాళ్లకి చెప్పవచ్చునా లేక చెప్పవద్దంటారా?" అని అడిగాడు.

"నా పేరు చెప్తేమాత్రం వాళ్లకేం తెలుస్తుంది? కాలక్షేపం కోసం వచ్చిన ఫ్రెంచిదేశస్థుణ్ని అని చెప్పు."

గేతానో గట్టిగా చెప్పాడు. ఒడ్డుమీద నిలబడిన వ్యక్తి మంట దగ్గిరున్న వాళ్లలో ఒకణ్ని పిలిచి ఏదో ఆజ్ఞ ఇచ్చాడు. అత నది విని చీకటిలో ఎక్కడికో మాయమైనాడు. తరవాత కొంతసేపటికి మరొక దిక్కునించి వచ్చి, ఒడ్డుపైనున్న వ్యక్తికి సంకేత మిచ్చాడు. అతను బోటువంక తిరిగి "రావచ్చును" అని చెప్పాడు.

బోటు ఒడ్డు సమీపించింది. గేతానో ఒడ్డుకి దూకాడు. నావికు లొకరి తరవాత ఒకరు దూకారు. ఆఖరున ఫ్రాంజ్ ఒడ్డెక్కాడు.

బోటు ఒడ్డుకి కట్టేశారు. బసకోసం ఆ ప్రాంతం పరిశీలించడం ప్రారంభించి కొంద రొకవైపుకి వెళ్లేసరికి, మంటదగ్గిర కూర్చున్నవారిలో ఒకడు లేచి "ఆ! ఆ! అటు వెళ్లకూడదు గేతానో" అన్నాడు.

గేతానో మాట్లాడకుండా వెనక్కివచ్చాడు. ఇద్దరు నావికులు మంటలో కాగడాలు వెలిగించితెచ్చారు. కాగడాల వెలుగుల్లో నావికులందరూ కలిసి ఆ చోటు వెదికారు. ముప్ఫై అడుగుల దూరంలో కొన్ని గుట్టలమధ్య చదునైన నేల కనబడింది. అక్కడ మనుష్యులు కూర్చోడానికి వీలుగా మట్టిదిమ్మ లున్నాయి.

ఫ్రాంజ్ కాగడాతో ఆ చోటంతా చూచాడు. ఒకచోట నిప్పుఆర్పిన పుల్లలు, బూడిద కనపడ్డాయి. ఇంతకుముం దెవరో ఈ జాగా వాడారని ఫ్రాంజ్ అనుకున్నాడు. చీకటిరాత్రులు ఇక్కడ రహస్యంగా గడపడం కొందరికి మామూలే ననుకున్నాడు.

ద్వీపంలో అడుగు పెట్టగానే అతని సందేహాలన్నీ పటాపంచలైనాయి. ఆకలివల్ల సంకోచాలు పోయినాయి. ఆకలి వేస్తున్నట్లు కెప్టెన్‌కి చెప్పాడు. "అదెంత పని?" అన్నాడు గేతానో. "బోటులో రొట్టి, సారాయి ఆరుపిట్టలు ఉన్నాయి. పిట్టల్ని కాల్చుకోడానికి మంటమాత్రం వేసుకోవాలి."

"ఇంకొకమాట" అన్నాడు గేతానో. "మీకు గొర్రెమాంసం మీద కోరి కుంటే, మనవి రెండుపిట్టలిచ్చి, కొంచెం వాళ్లదగ్గిర తీసుకోవచ్చునండి."

"అవును అలా చెయ్యి" అన్నాడు ఫ్రాంజ్. "నువ్వు ఎటువంటివాళ్ళనైనా ఇట్టే మచ్చిక చెయ్యగలవు."

కాలుతున్న మాంసం ఘుమఘుమ వాసన వేస్తోంది. ఫ్రాంజ్ తమకంతో వాసన పీలుస్తూ వేచిఉన్నాడు. గేతానో తిరిగివచ్చేటప్పుడు అతను పరధ్యానంగా ఉన్నట్లు కనపడ్డాడు. అతన్ని చూసి ఫ్రాంజ్ ఇలా అన్నాడు: "ఏమయిందోయ్? కాయా, పండా? ఇవ్వనన్నారా?"

"అబ్బే, అది కాదండి. మీరు ఫ్రెంచి దేశస్థులని చెప్పగానే వాళ్ల నాయకుడు మిమ్మల్ని భోజనానికి తన బసకి తీసుకు రమ్మన్నాడట. కాని ఈ ఆహ్వానంలో చిత్రమైన ఒక షరతు పెట్టాడండి."

"ఏమి టది?"

"మీ కళ్లకి గంతలుకట్టి తీసుకువెడతారుటండి. ఆయన స్వయంగా చెప్పేవరకూ అది విప్పకూడదుట".

గేతానోముఖాన్ని శ్రద్ధగా పరికించాడు ఫ్రాంజ్. దీని అంతరార్థం ఏమిటో తెలుసుకోవాలని ప్రయత్నించాడు.

అది గమనించి, జవాబుగా గేతానో ఇలా అన్నాడు: "నాకు తెలుసునండి. ఇది జాగ్రత్తగా ఆలోచించి నిశ్చయానికి రావాలండి."

"నువ్వే. అయితే ఈపరిస్థితిలో ఏంచేస్తావు?" అని అడిగాడు ఫ్రాంజ్.

"నాకు నష్టమేముందండి? నేనైతే వెడతాను."

"అతని నివాసంలో చూడదగిన వేమైనా ఉంటాయా?"

"అతను భూగర్భగృహంలో నివసిస్తాడని చెప్తారు. ఆ గృహానికి ఏ మహారాజాంతఃపురం కూడా పోలదంటారు."

"అయితే అది అభూతకల్పనన్నమాట."

(43-వ పేజీ చూడండి)

కథానిక:

ప్రయాణం

శ్రీ ఆకుండి నారాయణమూర్తి

“తమరెంతదాకా వెళుతున్నారండీ?” అని మొదటమారడిగేసరికి రమేశం వినిపించుకోలేదు. మళ్లీ రెండోమారడిగేసరికివాస్తవిక జగత్తులోకి వచ్చి, “నేనాండి?” అన్నాడా అడిగిన వ్యక్తికేసి చూస్తూ!...

—“ఔనండి!... తమరినే అడుగుతున్నా.” అన్నాడావ్యక్తి కొంచెం కొంచెంగా నవ్వుతూ.

ఏమని సమాధానం చెప్పాలో తోచింది కాదు రమేశానికి. తనప్రయాణానికి ఓ గమ్యస్థానం అంటూ ఉంగా లే ఫలానాదగ్గరకని చెప్పడానికి!... కానీ, ఎదుట నిలబడి అంతటి పెద్దమనిషి అడుగుతూఉంటే ఏదో ఓ సమాధానం చెప్పకపోతే ఎలా?...కనీసం మరోవిషయంగురించయినా మాట్లాడకపోతే ఏం బాగుంటుంది?—“సరేగానీ,తమ పేరు?” అని అడిగేడు ఆయన అడిగిన దానికి సమాధానం ఇవ్వడం మానేసి.

‘ఇదేమిట్రా అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వడం మానేసి, ఇలా అనవసర బాతాఖానీ కొట్టపోతున్నాడీయన’ అని ఆ వ్యక్తి మనస్సులో కొంచెం చికాకు చెందేడు. తన పేరు చెప్పి, అతనిపేరు కనుక్కొని అలా అనవసర సంభాషణలతో కాలక్షేపం చెయ్యడం కాదతని ఉద్దేశ్యం!... అతనెక్కడికి వెళ్తాడో ఆవిషయం ఒక్కటితెలుస్తే చాలు. అంతే!—అప్పటి కప్పుడే ఓ పావుగంట సేపయి నిల్చున్నాడు కంపార్టుమెంటులో కూర్చుందికి జాగా లేకపోడంచేత!—ఆ ప్రక్క స్టేషనులో గానీ, లేక మరి రెండు మూడు స్టేషనులలోపున ఎవరయినా దిగిపోయేవాళ్లుంటే, తను ఆస్థలంలో కూర్చోవచ్చుకదా అనే ఉద్దేశ్యంచేత ఆ వరసలోనున్నవాళ్లందరినీ అడిగి నిరాశ చెంది, ఆఖరికి చిన్న ఆశ ఉండబట్టి రమేశాన్ని కూడా ఆ ఉద్దేశ్యంతోనే “ఎంతదాకా వెళుతున్నా”రని అడిగేడు. తను అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వడం మానేసి, “మీపేరేమిటని?” రమేశం తిరిగి ప్రశ్నించడంవల్ల చాలా విసుక్కున్నాడావ్యక్తి. కానీ ఓ తను మనిషి పేరు చెప్పమన్నప్పుడు విసుక్కోవడం అంత మంచి పనికాదని, “రంగనాథం” అని చెప్పేడు. “ఇంతకీ తమ రెంతవరకూ వెళుతున్నారో చెప్పేరుకాదు.” అని మళ్ళీ అన్నాడు.

ఇలా పీడలా పట్టుకున్నాడేమిట్రా, అని అనుకున్నాడురమేశం. నిజానికి తన ప్రయాణ విషయమై తనకు నిశ్చయంగా తెలుస్తేగా చెప్పడానికి? అప్పటి పరిస్థితి తప్పించుకోడంకోసం ఓ అబద్ధమాడక తప్పింది కాదు—“అబ్బే! ఏదో తీర్థయాత్రలు చేద్దామనే ఉద్దేశ్యం కలిగింది!...ఇప్పుడు తిన్నగా కాశీ వెళ్లి, అక్కడనుంచి, అలా తక్కిన పుణ్యక్షేత్రాలకు బయలు దేరుదామని ఉంది” అని కమ్మటి అబదం ఆడేసేడు. అంత గమ్మత్తయినఅబద్ధం చెప్పినందుకు తననుతానే అభినందించుకున్నాడు రమేశం.

రంగనాథానికి నిరాశ అయింది. చాలా మంది నడిగేడు. పదికాదు కదా ఇరవై కాదు కదా రెండు వందల మైళ్ల లోపుగానయినా దిగేవారు కనిపించలేదు. ఇక రమేశం ప్రక్కనున్న ఆ స్త్రీ అతనికంట పడింది. చిన్న ఆశ జనించింది. ఆమె నడుగుతే బాగుండుననుకున్నాడు. కానీ ఆమె రమేశంతో వస్తున్నదేమో అనే అనుమానంవల్ల, “ఆమె మీతాలూకావినాండి?” అని రమేశాన్ని తట్టేసరికి, “ఆ! ఔనండీ” అని అన్నాడు రమేశం కొంచెం చిరాకుతో!

“ఏమవుతారండీ?” అని మళ్ళీ ప్రశ్న వేసేడు రంగనాథం.

ఆ ప్రశ్నతో రంగనాథంమీద చాలా కోపం వచ్చింది రమేశానికి!...తన విషయమై మహా అవసర మున్నవాడిలా అలా అడుగుతాడేమా అని చాలా చికాకేసింది.

...“ఆమె నా భార్యేలెండి.” అని అతనికి సమాధానం ఇచ్చేడేగానీ, ఆ క్షణంలో అతని హృదయం ఏదో బాధతో కంపించింది. అలా చెప్పినతరువాత ‘ప్రభ’ వేపు చూచేడు. ఆమె ముఖంలో తొణికిసలాడిన చిరునవ్వును గమనించేడు. అలా ఆమె తనభార్య అని రమేశం చెప్పినందుకు ఆమెమట్టుకు ఆనందించిందిగానీ, రమేశంహృదయం ప్రెస్ చేయబడినట్లు రెండు శక్తులమధ్య నొక్కుకుపోయింది!...

...“అయితే రెండువందల మైళ్లు ఈ రైలువెళ్లే పర్యంతం నిలువుజీతమే గాబోలు!” అని గొణుక్కున్నాడు రంగనాథం.

అంతసేపయి అతను వేసిన ప్రశ్నల తాలూకు తాత్పర్యం అప్పుడు బోధపడింది రమేశానికి. ఇంకా అతనలా నిలబడేఉంటే ఊరికినే చొప్పదంటుప్రశ్నలు వేసి తనను బాధిస్తాడనే ఉద్దేశంతో, ప్రభకూ తనకూ మధ్యనున్న రగ్గు తీసి తను ప్రభవేపు జరిగి, “పాపం, ఎంతసేపని నిలబడతారు!...ఇలా కూర్చోండి రంగనాథంగారూ!” అని రమేశం అన్నాడు.

“థ్యాంక్సు!...”అని అంటూకూర్చొని–, “మీకు పిల్లలు ఇంకా...”అని రమేశం ముఖంవేపూ, ప్రభముఖంవేపూ చూచేడు రంగనాథం.

మాబాగా దాపరించేడని రమేశం అనుకున్నాడు. ఏమని చెప్పడం?...అడిగిన వెంటనే సమాధానం చెప్పకపోతే బాగుండదని, “లేరండీ!” అని చెప్పి ప్రభవేపు చూచేడు. ప్రభ కొంచెం కొంచెంగా ఒక్క రమేశం చూచేలా మాత్రమే నవ్వింది. ప్రభ ఒక్కర్తిమాత్రమే చూచేటట్లు రమేశం కూడా నవ్వేడు. కానీ రమేశం హృదయపూర్వకంగా నవ్వలేదు. నిజానికదినవ్వే కాదు! ప్రభ సంతుష్టిచెందుతుందని, అలా నవ్వినట్లు నటించేడు!!.........

రమేశంనిజంగా, శాస్త్రోక్తంగా తాలికట్టి వివాహమాడిన భార్య ఉమనీ, పిల్లల్నీ మరచిపోయి తననే భార్యగా భావిస్తున్నాడనీ, తనే సర్వస్వం అని నమ్ముతున్నాడనీ ప్రభ ఎంతోమురిసిపోయింది. తనను “నాభార్య” అని ఆ పెద్దమనిషితో చెప్పడంవల్లా, “పిల్లలా?” అని అడిగినప్పుడు, “లేరని!” ధైర్యంతో జంకూ గొంకూ లేకుండా చెప్పడంవల్లా, రమేశం పూర్తిగా ఉమనీ, పిల్లల్నీ మరచిపోయుంటాడని పరమానందభరితురాలయింది ప్రభ!...ఆ రైలు అలా తనను ఎన్నెన్నో ద్వారాలు దాటించేసి ఆఖరికి స్వర్గద్వారం గూడా దాటించేస్తున్నదని భావించుకుం దామె. ఇక తనజీవితంలో విచారానికీ, దుఃఖానికీ తావులేదని మురిసిపోయింది!... కానీ,... రమేశంనాలికచివరినుండి వెలు

వస్తున్న ఆ మాటలను విని, ఆ ముఖకవళికలను వీక్షించకలిగింది గాని,...రంగురంగుల తెరలవలెల అలని లత్కి ఉండే చీకటగదిలో, విచారం, దిగులు, బెంగ, భయం, జాలి అనేవి ఎలా ప్రకోపతాండవం సల్పుతున్నాయో చూడలేకపోయింది!— ఏవేవో ఊహాచిత్రాలు చిత్రించుకుంటూ అలా బల్లకు చేరబడి, పక్కన పోతున్నట్లుపిస్తున్న ఆ కొండలవేపూ, చెట్లవేపూ చూస్తూ కూర్చుంది.

శబ్దం మారింది!... రైలు బ్రిడ్జీమించి నడుస్తున్నాదని చటుక్కున గ్రహించేసేడు. ఏమాత్రం పెద్దదుందో చూద్దామని కిటికీలోంచి బుఱ్ఱమార్చి క్రిందికి, ప్రక్కలకూ చూచేడు రమేశం. అంతలో అకస్మాత్తుగా ఓ బొగ్గు రవ్వ ఎగిరొచ్చి కంట్లో పడింది. భగ భగా కన్ను మండి, విల విలలాడింది. పాకెట్ రుమాలుతో కంటి నొక్కేడు. వెంటనే రవ్వనుతీసెద్దామని ప్రయత్నం చేసినా కాని రాలేదు. కన్ను చింతనిప్పులా తయారయింది!...

..."రుమాలుని ఉండలా చేసి, నోటిదగ్గఱుంచి ఆవిరిచే వేడిచేసి కంటిని దానితో ఒత్తండి. అప్పుడొచ్చేస్తుం"దని ప్రభ సలహా ఇచ్చింది.

"కళ్లు బాగా తెరచేసి, కొంతసేపు రెప్ప వెయ్యకుండా అలా కూర్చోండి. అదే కన్నీటితో వచ్చేస్తుంది" అని ప్రక్కనుకూర్చున్న రంగనాథంగారు సలహా ఇచ్చేరు.

ఇద్దరు చెప్పినట్లూ చేసేడు గానీ రాలేదా రవ్వ!...అఖరికి విసిగి కిటికీమీద, వాణీ ఉంచి, దానిమీద ముఖం ఆనించి పనక్కు తిరిగి కళ్లు మూసుకొని కూర్చున్నాడు రమేశం. కన్నీళ్లు కారడంచేత వాణీ చాలావరకూ తడిసిపోయింది! ... అంతలా కళ్లంట నీళ్లు కారుతాయనుకోలేదు రమేశం!...అయితే.. ఒకటి అరకంగా కన్నీళ్లు ఎన్ని కారినా ప్రమాదం లేదు.......మరోరకంగా...?...

అతనేదో భ్రాంతిలో పడ్డాడు. ఏవేవో మానసిక బింబాలు ప్రత్యక్షమయేయి!...తన స్వంతం ప్రభ ప్రక్కను రైలులో ఉన్నట్లు అతనికి స్ఫురించేదు!!...ఉమ తనకళ్లె ఎదుట కూర్చున్నట్లు భ్రమించేడు!......ఆమె ఏడుస్తున్నాది. బొట బొటా కళ్లంటనీరు కారుస్తున్నాది. ఆ కన్నీటితో ఆమె చీర తడిసిపోయింది. జబ్బుతో ఉన్న చిట్టిబాబుముఖం మీద ముఖం పెట్టి బాబుని ఆ కన్నీటితో తడిపేస్తున్నాది....వెళ్లిపోయేడు. చిట్టిబాబు వెళ్లిపోయేడు!! ఒట్టి అమాయకురాలు ఏం చెయ్యగలదు?!...ఏడవడం తప్ప మరేమి చెయ్యగలదు?...అయితే ఆమె కళ్లంట కారే కన్నీళ్లు సాధారణమయినవి కావు!...విచారం, బాధ, దుఃఖం, దిగులు, క్రోధం అన్నీ ఆ కన్నీళ్లలో సమ్మిళితం చేయబడ్డాయి...

రమేశం ఇంకా అలా భ్రాంతిలో ఉంటూ ఉండగానే, ప్రక్కనున్న రంగనాథం గారు అయన్ని తట్టి, "ఏమండోయ్, వాణీ జారిపోతున్నాది." అని చెప్పేసరికి తిరిగి వాస్తవికజగత్తులోకి వచ్చేడు రమేశం!—తను రైలులో ప్రభ ప్రక్కనున్నట్లు గుర్తించేడు. కాని, ఉమమాత్రం మనస్సులో అలా నిలచే ఉంది. నిజంగా ఉమ అంతలా ఏడుస్తుందా?" అని తనలో తానే ప్రశ్నించుకొని, మళ్ళీ కిటికీమీద ముఖం పెట్టి ఆలోచించడం మొదలుపెట్టేడు.— ఎందుకేడవదు?...జబ్బుతో ఉన్న కొడుకునీ, తనే సర్వస్వం అని నమ్ముకొని ఉన్న ఆ ఉత్తమ ఇల్లాలు ఉమని విడిచి వచ్చేయడం అనేది మంచిపనేనా? తనెంత ద్రోహం ఆమెకు చేస్తున్నాడు!...ఆమె ఏం తప్పు చేసిందంటకే. తను ప్రభతో ఆనందంగా కులుకుతూ ఉన్నప్పుడు ఓరోజున ఉమ



చూచింది కానీ, పల్లెత్తు మాటయినా అందా? ...లోకంతో ఆ విషయం చెప్పిందా? లేదే! ....“ఆనందాన్ని అరికట్టడం మహా దోషం!” అంది ఎంతో శాంతంతో. ఆమె అంత మంచిదవడమే ఆమె తప్పు!...ఆనాడే లోకంముందు ఆ విషయాన్ని బహిరంగపరిచినట్లయితే, తను అప్పుడలా ప్రభతో లేచి వచ్చేసేవాడు కాదేమో!...ఎంత మంచి హృదయం ఆమెది. లేకపోతే ఏ ఆడదయినా భర్త మరో స్త్రీతో కులుకుతూ సరసాలాడుతూ ఉంటే చూచి సహిస్తుందీ?...“ఆనందాన్ని అరికట్టకూడదు.” అని ఆ సందర్భంలో అనేవాళ్లు పిచ్చివాళ్లు కాక మరేమిటి? ...పాపం, ఎలా ఉందో ఆ అమాయకురాలు ఉమ!...ఎలా ఉంటుంది?...ఏడుస్తుంది, కళ్లు ఎండిపోయేలా ఏడుస్తుంది. జబ్బుతో ఉన్న పిల్లడెలానూ చచ్చిపోతాడు. అప్పుడు పిచ్చెత్తిపోతుంది. ముష్టెత్తుకుంటూ వీధుల్లో తిరుగుతుంది. ప్రభతో తను కులుకుతూ సరసాలాడుతూ ఆనందంగా ఉన్న సమయమప్పుడు తన కృశించిన చెయ్యి చాచి ముష్టి వెయ్యమంటుంది!... ఆ దృశ్యం తల్చుకోనేసరికి రమేశం హృదయం గడ్డకట్టుకుపోయింది. కళ్లంట చాలా నీరు కారింది. ఈ మారు నలుసువల్ల కాదు. దుఃఖాన్ని ఆపుకోలేకపోవడం చేత!...

తలఎత్తి కిటికీలోంచి చూచేడు. సాయంత్రం కనుమూసింది. ఉన్న కొస్త వెలుతురూ మాయమయేలా నాలుగు మూలలనుంచీ కారు మేఘాలు కమ్ముకొస్తున్నాయి. పెట్టిలో దీపం వెలిగింది. ప్రభవేపు చూచేడు రమేశం.

“ఏం, ఇంకా నలుసు రాలేదా?...ఎంత ఎఱ్ఱగా అయిపోయిందో కన్ను” అంది ప్రభ రమేశం కళ్లలోకి చూస్తూ.

“కంటిలో నీరు పూర్తిగా అయిపోతేనేగానీ వచ్చేటట్లు లేదు!” అని, మళ్ళీ కిటికీ మీద ముఖం ఆనించి గట్టిగా కళ్లు మూసుకున్నాడు. ‘మళ్ళీ ఉమదగ్గర కెళ్లిపోతేనో!’ అనే ఆలోచన మెఱపు మెరసినట్లు రమేశానికి తట్టింది! మరి ప్రభసంగతి?...ప్రభను తల్చుకునేసరికి అతని మనఃఫలకంలో ఉమ మళ్ళీ మూడు వందలమైళ్ల దూరంలో ఉంది!!


...ప్రభ తనను మనసారా ప్రేమించింది. సంఘసమ్ముఖంలో శాస్త్రోక్తంగా వివాహమాడిన భర్తను విడచి వచ్చేసింది. నీటముంచినా, పాలముంచినా సరే, తనే ఆమెకు కావలసినవాడని నమ్మింది. అరవైఏళ్ళ ముసిలి పీనుగయిన భర్త దగ్గర ఇక కష్టాలు తప్పిపోయేయని ఆనందసాగరంలో మునిగి తేలుతున్నాది. ఎన్నో ఊహాసౌధాలు నిర్మించుకుంటున్నాది. ఇక అలా ఆమెను విడచి మళ్లీ ఉమ దగ్గరకు పోతే, ప్రభ అలా ఆరైలులోంచి దూకేయదూ?... ప్రభను విడిచి వెళ్లిపోవడం మంచిది కాదనే తీర్మానానికి వచ్చేడు.

కానీ, మళ్లీ ఉమ మనస్సులో, దిగంబరి అయి అలా వెఱ్ఱిగా కేకలేస్తూ ప్రత్యక్షమయింది. “ఇదిగో చిట్టిబాబు!...ప్రాణం లేని చిట్టిబాబు. కఱ్ఱబొమ్మ ... అహహహ...” అని వెఱ్ఱిగా కేకలేసినట్లు భ్రమించేడు. ఊహుఁ!...ఉండడానికి వీల్లేదు. పోవాలి. హహహ ఉమదగ్గరకు తక్షణం పోవాలనే తీర్మానానికి వచ్చేడు. మనస్సు మరో రంగు ధరించింది!!...

కానీ, ప్రభనలా రైలులో విడిచి ఎలా వెళ్లిపోవడం?!...ఈబుద్ధి తనకు మొదటే ఉండవలసింది. అప్పుడు ప్రభ రమ్మన్నప్పుడే తను రాలేనన్న సంగతి చెప్పేయ్యవలసింది!... అసలు ఆమె అరవైఏళ్ల భర్తదగ్గర తృప్తిపొందలేక తనను కామపాశంచే బంధించడం కొంతసబబే!...కానీ. చక్కని భార్య ఉంటున్నప్పటికీ తనుకూడా ఆమె వప్పల్లో కామించడం ఎంత తెలివితక్కువపని!... ఈబుద్ధి అప్పట్లో తనకుంటే, ఉమని విడిచిపెట్టి ప్రభతో తను వచ్చేసేవాడా?... సరే, తన తెలివితక్కువతనంచేత అదంతా జరిగింది.

ఇక ఇప్పుడు ప్రభని విడిచి వెళ్ళిపోవడం ఏం న్యాయం?...ఒకవేళ తను వెళ్ళిపోతే ఆమె భవిష్యత్తు ఏమవుతుంది? ...తనంటే భార్య మళ్ళీ పువ్వుల్లో పెట్టి పూజచేస్తుంది. కానీ ప్రభవిషయం? ఆమెను ఆమెభర్త మళ్ళీ గుమ్మం తొక్కనిస్తాడా?...ఇక సంఘం మళ్లీ తనను యథాప్రకారంగా గౌరవంగానే చూస్తుంది కానీ, స్త్రీజాతికి చెందిన ఆమెను సంఘం ఆదరిస్తుందా? ఊహుఁ!... ఇక ఆమెకు తనే దిక్కు. ఉమను మనస్సులోంచి తరిమెయ్యాలనుకున్నాడు. కానీ లాభం లేకపోయింది!...ప్రభతో తనుండిపోతే, అవతల, ఉమ, చిట్టిబాబుల ఇద్దరి చావుకీ తను కారకుడన్నమాట! — ఉమని చేరుకుంటే ప్రభ ఒక్కర్తి చావుకే తను కారకుడనే మాట!...ఏపని చేయడం?...బాగా ఆలోచించగా ఉమదగ్గరకు పోవడమే న్యాయమనిపించింది.

ప్రభవేపు చూచేడు ముఖం ఎత్తి. బల్లకు చేరబడి నిద్దరపోతున్నాదామె!...నిదా



నించి మళ్ళీ ప్రభవేపు చూచేడు. అతనిదృష్టి, ఆమె ఉన్న తపతో జాలమీద లేదు. ఆ తక్కువకాంతిలో కూడా తళతళ మెరుస్తున్న ఆ పసిడిచెక్కిళ్ళపై లేదు. కలకలలాడే ఆ నగుముఖం మీదలేదు. వంకీలుతిరిగి నల్ల త్రాచల్లే ఉన్న ఆ జడమీద లేదు. పరిరంభానికి ఆహ్వానిస్తున్నట్లున్న ఆ పసిడి చేతుల మీదా తొడలమీదా లేదు. సాధారణంగా ఎవ్వరూ చూడలేని స్థలంవేపు చూచేడు. అదే ఆమె ఆత్మ ఉండే చీకటిగది!-ధైర్యం, సాహసం. జీవితంమీద ఆశ. కామం, విచారం, ఈర్ష్య, కోపం...ఇంకా ఎన్నెన్నో కనిపించేయి. ఫరవాలేదు !...ధైర్యమయిన మనిషే ననుకున్నాడు. స్టేషను వచ్చింది, ఆగింది చప్పుడు!...వెనక్కు వెళ్ళుతున్న మరో రైలుకూడా ఆ స్టేషనులో ఉంది. ప్రభ ఇంకా నిద్దరపోతూనే ఉంది. "ఇప్పుడే వస్తానండీ! ఈ పెట్టె లెట్రిన్‌లో నీళ్లు లేవుట మరో పెట్టెలోకి వెళ్ళివస్తాను. మా ప్రభ లేస్తే "అలా వెళ్ళేరు. వస్తార'ని చెప్పండి" అని రంగనాథం గారితో చెప్పి, దిగి ఆ ప్రక్క రైలులో ఓ కొసాపెట్టె దగ్గరకుపోయి ఎక్కేడు. తనప్పుడుదిగివచ్చిన రైలే ముందుబయలుదేరింది. మళ్ళీ చప్పుడు గుండెల్లో దడదడ!! కనుచూపుమేర రైలు వెళ్ళిపోయే వరకూ చూచేడు. ప్రభచాలా దూరమయింది. అప్రయత్నంగా కన్నీరు కారింది. ఆ నీటితోపాటు అదివరకు కంట్లోపడ్డ రాక్షసిబొగ్గు రవ్వ కూడా వచ్చేసింది.

*   *   *

"డాక్టరుగారూ!...ఎలా అయినా రక్షించాలి!—మీకు పుణ్యం ఉంటుంది. నాచిట్టిబాబుని బ్రతికించండి. మీఋణం జన్మజన్మలకీ తీర్చుకోలేను...రక్షించండి." అని డాక్టరు కాళ్లు పట్టుకుని ఉమ బ్రతిమాలుతున్న సమయంలోనే గదిలోకి తొందర తొందరగా ప్రవేశించేడు రమేశం.

రమేశాన్ని చూడ్డంతోనే, "అమ్మోమ్! రాక్షసుడు మళ్లీ ఒచ్చేడు" అంటూ డాక్టర్ని కౌగలించుకుంది ఉమ.

నిర్ఘాంతపోయి, అలా నిలబడి పోయేడు రమేశం. ఏమనాలో, ఏం చెయ్యాలో అర్థమయిందికాదతనికి. "నేనుఉమా...నీభర్తనీ! అదేం అలా భయపడుతున్నావు?" అన్నాడు భయాశ్చర్యాలతో,

నువ్వు నాభర్తవా?...కావు రాక్షసుడివి!! నాజీవితం పాడుచెయ్యడం చాలక ఆ ప్రభ జీవితం కూడా పాడుచేసేవ్!- దాన్ని ఏం చేసేవు, చంపేశావా? రాక్షసుడా? ఈ ఇంట్లోంచి మొదట పో!" అంది ఆవేశంతో ఉమ.

అలా కట్టబొమ్మలా ఉండిపోయేడు రమేశం. తన తెలివితక్కువ ప్రవర్తనవల్ల ఉమ మనస్సు పూర్తిగావిరిగిపోయిందనుకున్నాడు. "ఉమా క్షమించు. పొరపాటు చేసేను. ఇక నాయీ పాడుముఖాన్ని లోకానికి చూపెట్టనులే!" అని అంటూ చిట్టిబాబుమంచం దగ్గరకువెళ్లి, బాబుని ముద్దులాడి, బరువుగా, అడుగులు వేస్తూ వీధివేపు బయలుదేరేడు.

ఆదృశ్యాన్నంతటినీ చూచి నిశ్చేష్టుడయిపోయేడు డాక్టరు.

వీధిగుమ్మం దాటుతున్న భర్త దగ్గరకు పరుగెట్టి అడ్డంగా నిలబడి, "మీరు వెళ్ళడానికి వీల్లేదు. చిట్టిబాబును బ్రతికించండి." అని అంటూ కాళ్ళమీదపడి బావురుమని ఏడ్చింది ఉమ!...ఏమనాలో అర్థంకాక, ఆమెను లేవనెత్తి, కౌగలించుకొని తనూ బావురుమని, ఏడవడం తప్ప అప్పట్లో మరేమీ చెయ్యలేక పోయేడు రమేశం.

డాక్టరుదగ్గరకు పరిగెట్టేడు రమేశం. ఆయనముఖంకేసి బెంగతో చూచేడు. "మరేం పరవాలేదు. ఈ కుఱ్ఱాడు బ్రతుకుతాడు...ఔనుగానీ, ఇంతసేపయి జరిగిన తతంగం నాకేమీ అర్థంకాలేదు. ఏమిటిదంతా?" అని డాక్టరడిగేడు,

"ఏం చెప్పగలను? అదంతా ఓ మరువలేని గాథ!... ఆలోచించకుండా తెలివితక్కువతనంగా చేసిన తొందరపనిఫలితం ఇదంతా!- ఆలోచించకుండా, తాత్కాలి కానందం కోసం ఇలా తొందరపడి పాలా చేసేవాళ్లు జీవితాంతంవరకూ ఏ సుఖాన్నీ పొందలేరు. ...అనవసరంగా ఒకరిచావుకు కారణమయేను డాక్టరుగారూ!..." అంటూ డాక్టరుకాళ్ళను పట్టుకొని కన్నీళ్ళు కార్చేడు.

"ప్రభ చచ్చిపోయిందా?" అని ఆందోళనతో అడిగింది. ఉమ.

"నేనామెను రైలులో విడిచిపెట్టి వచ్చేసరికి, చనిపోలేదు. ఈపాటికి చచ్చిపోయే ఉంటుంది." అన్నాడు రమేశం.

"ఆ!... మీతో లేచివచ్చేసింది, అప్రక్కనున్న మరొకరిని వలలో వేసుకొని వాడితో పోదుటండీ?!... మీ పిచ్చిగానీ!..." అని అన్నాడు డాక్టరు వెటకారంగా నవ్వుతూ.

చటుక్కున రంగనాథం జ్ఞాపకానికి వచ్చేడు. ప్రభ అతనిఅండ చేరుంటుందా అనిఅనుమానం వేసిందిరమేశానికి. కానీ ప్రభ అలాంటిది కాదని రమేశంఅభిప్రాయం.

"డాక్టరుగారన్నట్లు ప్రభ మరొకరితో పోయుంటుంది. దానికేం?" అంటుంది ఉమ.

ప్రభ ఆత్మహత్య చేసుకొనిఉంటుందని రమేశం అభిప్రాయం!.... ఆ రైలులో అలా ఆమె మరోలోకానికి ప్రయాణం చేసేస్తుందని అతని అభిప్రాయం. ★

ఏమీ తోచక

శ్రీ వల్లభనేని నారాయణరావు

★

ఏమీ తోచక
ఏదో రాస్తే
ఏమో వుందని
చదివే చదువరి
ఏమీ లేదని
యెరుగంగానే
యేమంటాడో
యేమోగానీ
ఏమీరాయక
ఎట్టుండాలో
యేమీతోచక
ఇది రాస్తున్నా.
మొన్నా నిన్నా
అన్నం లేకా
ఉన్నది కాస్తా
నిన్నటి వరకూ
అప్పుడప్పుడూ
అరటిపళ్ళకై
ఇచ్చేస్తుంటే
ఖర్చయి పోతే,
కానీకూడా
కరువైపోతే,
ఉదయంనుంచీ
ఉపవాసంతో
గడిపిన వాడిని
కలం పట్టుకుని
ఏమో అనుకుని
ఏదో రాస్తే
ఏమో వుందని
చదివేచదువరి
ఏమంటాడో

ఏమోగానీ
రాయాలంటే
రాందే యెట్లా?
మనలో మనకా
మాట చెప్పేతా-
నిన్నటినుంచీ
అన్నం లేకా,
నిస్సత్తువతో
నే చస్తుంటే
నాపై పెపుడై
నా, చూచావా?
బుర్రా కొనుక్కుని
వక్కా నములుతూ,
పక్కా జేరుకుని
పడుకోబోతూ,
తిన్నది అరగక
తేపు తేపుతూ,
బుర్రా తెరచుకుని
ఇక్కడ చూస్తూ,
ఏమీ లేదని
యెగిరేకంటే,
ఇంతకుముందే
ఇది రాసిన, నా
సంగతి తెలుసుకు
సహాయపడితే
ఏదైనా, కొం
తిక్కడ కనపడి
చదివినవాడివి
సంతోషంతో
కునికే ముందర
కులికే పనిగా!

★

శిలాద్రవం

శ్రీ యన్. ఆర్. నంది

ఆలయంలో పూజారి మొదలుకొని, నీలాటిరేవుదగ్గర అమ్మలక్కల వరకూ గంగమ్మ గయ్యాళి దనే మంచి పేరుని సంపాదించుకొంది. ఎక్కడ, ఎలాంటి జగడాలొచ్చినా గంగమ్మ తయారుగా వుంటుంది. అప లామెనోరు లేని దెబ్బలాటే వుండదు.

గ్రామంలో ఆడవాళ్లందరికీ గంగమ్మంటే భయం. ఆమె స్నేహానికి ఎంతో మంది పాటుపడుతుంటారు - భక్తివల్లకాదు; ఎప్పుడెలాంటి విపత్తులొచ్చిపడతాయో, గంగమ్మ ఎదుటివారికి సాయం వెడుతుందేమోనని అందరూ ఆమె స్నేహాన్ని కోరేవారే. వొండిన కూరలదగ్గరనించి, కట్టుకోబోయే చీరవరకూ ఆమెకి చూపించకుండా ఏ పనీ, ఏ కార్యమూ గ్రామవనితలు చేయరు. అవన్నీ ఆమె దయ తమ మీదికి ప్రసరించాలనే.

నోరు విప్పిందా తుఫానే. వీధుల్లో నడచిందా గాలివానే. ఒప్పని దయ్యానికి తప్పక తిరగాలని, కొందరు బుద్ధిమంతులు ఆమెకి అగుపించకుండా తిరిగారా ఇక వాళ్ల మీద రకరకాల సూటీమాటలు విసురుతుంది. చివరికి మగాళ్లుకూడ ఆమె అంటే భయంగా తిరుగుతుంటుంటారు. కాని మగాళ్లజోలికి గంగమ్మ అంతగా పోదు. జగడం పెరిగిందా, మరి మగాళ్ళే కాదు, ఆడాళ్లే కాదు ఆమె పిడికిలిగుద్దులు తినవలసిందే!

అందులో ఆమెకు ఒక భర్త, ఒక ఐదేళ్ల కొడుకు. తప్ప వేరే చీదరా బాదరా లేని సంసారం. భర్త వెంకన్న పొలాల్లో కష్టపడుతుంటుంటె, గంగ పని వూరుమీద తిరగడం, జగడానికేమాత్రం సందు దొరికినా వొదలకుండా, దాన్ని పెంచీ, పెద్దజేసి, చివరికి జుత్తులు జుత్తులు పట్టుకొనేవరకూ రాజేసి, ఆఖరున యిద్దరు యిల్లాళ్ల జుత్తులూ కలిపిలాగి, ఇద్దర్నీ సరిచేసేది. గంగ చేతిలో ఉత్తిపుణ్యానికి తన్నులు తిన్న యిల్లాళ్లిద్దరూ, కోపంగా ఒకర్నొకరు చూసుకొని, గంగకేసి కొరుక్కు తినేయాలన్నంత కసిగా చూసేవారు; కాని గంగ ఓ మహామ్మారి. దాన్ని కదిపితే యింకేమయినా వుందా!

గంగ వయసు అంత పెద్దదికాదు; నడివయసుంటుంది. ఆమెకి పుట్టిన ఐదుగురు పిల్లలు కొంతకాలం బతికి, అందరూ ఒకలాగే స్ఫోటకంతో చచ్చిపోయేవారు. 'మాంచి పని దొంగముండకి, లేకపోతే యింతమంది నిలా యేడిపిస్తోంటే, ఆ యమ్మకిమాత్రం కడుపు తరుక్కుపోదూ?' అని అమ్మలక్కలు చాటు చాటున తిట్టుకొనేవారు.

ఒకసారి వెంకన్న భార్యతో యిలానే అంటె, 'ఆ అమ్మవారి సంగతి కనుక్కొంటాను. దానికి నేను గయ్యాళిదాన్నట. అదే వూరందర్నీ మింగేస్తూ పైగా నన్ను గయ్యాళినని నా పిల్లల్ని పీకలు నొక్కేస్తోంది' అని ఆవేశంతో గంగమ్మ ఊరిచివరి ఆలయంలోకి పరుగెత్తుకెళ్లి చీపురుతో అమ్మవారి ముఖాన్ని దబదబా బాదింది. వెంటనే మూడో పిల్లాడు చనిపోయాడు.

తర్వాత పుట్టిన యిద్దరు పిల్లలుగూడ అలానే రక్తాన్ని కక్కుకొంటూ ఐదేళ్లదాటేలోగా చచ్చిపోగానే, గంగమ్మ గజగజ వొణికిపోయి, అమ్మవారి కాళ్లు పట్టుకొని క్షమించమని ఆ ఆలయంలో రెండు రోజులు నిద్రాహారాలు మాని అలానే వుండిపోయింది. చివరికి దేవి కటాక్షించి, ఈ కొడుకు మిగిలాడు. వాడికి ముద్దుగా పిచ్చయ్య అని పేరుపెట్టుకుంది.

ఆ మిగిలిన ఒక్క నలుసంటే గంగమ్మకి ప్రాణం. ఊళ్లో గయ్యాళిదైనా భర్తని కీలుబొమ్మలా తన చేతిలో ఆడించినా, ఆ చిన్నాడిదగ్గరమాత్రం పిల్లి - ఏమో వాడు దక్కుతాడో దక్కడో అని. అయినా వీలయినప్పుడల్లా వీధుల్లోకెళ్లి దేని జుత్తో ఓదాని జుత్తు పట్టుకొని లాగకుండా, ఉత్తిపుణ్యానికి తిట్టేవరకూ చెయ్యి నోరు వుంచబెట్టేదికాదు.

తన పిల్లడంటె గంగకి ప్రేమేగాని, మిగతా పిల్లలంటె ఆమెకి అసహ్యం; అందులో పక్కింటి రావన్న కొడుకంటె మరీను. కారణం రావన్న కొడుకుతో కూడితే తన పిచ్చి పోకిరీ అయిపోతాడట, అందువల్ల. ఒక్క రావన్న కొడుకే కాదు మిగతా కుర్రగుంట లెవరితోనూ కొడుకుని కలియనిచ్చేదికాదు.

కొంతమంది దప్పాకే 'గంజాయివనంలో తులసిమొక్క పుడుతుందా. గయ్యాళిదాని కొడుకు గజదొంగవుతా'డని కళ్లల్లో కారాలు పోసుకొంటున్నారు. వాళ్లకి బుద్ధొచ్చేటట్టు తన కొడుకుని బృహస్పతిని చేసేయాలనుకొనేది.

గంగ పూర్తిగా పల్లెవాసి. ఆమె ఎంత అజ్ఞానో అంత మూర్ఖురాలు. తనకి తోచదు యితరులు చెబితే వినదు. ఎంత మూర్ఖురాలో అంత సాహసిగూడ. ఆ మూర్ఖ సాహసంతో అగ్గిలోనన్నా దూకుతుంది గాని, అగ్గిలో పడితే తన వొళ్లే కాలుతుందని గ్రహించని మంకుపట్టు.

బడికి పంపితే కొడుకు చెడిపోతాడేమోనని, ఒక యింగ్లీషు తెలీని పంతుల్ని యింటిదగ్గరే వుంచి కొడుక్కి చదువు చెప్పించుకొంటోంద.

ఆ పంతులొకసారి కొడుకుని 'ఒరే' అన్నాడట. గంగమ్మ ఉగ్రురాలై పిల్లాడు ఎదురుగానే గురువుగారిని నానా మాటలు ఆడింది. కొంతకాలం తర్వాత ఆ పంతులు మరిచిపోయి, పిల్లాడిని కొట్టాడు - వాడేదో తప్పు చెబితే. వెంటనే గురువుగారి పని వూడిపోయింది. రెండో గురువుగారు తయారు!

ఒకరోజు సాయంకాలం గంగమ్మ నూతిదగ్గరకు వెళ్లింది. అక్కడొక యిల్లాలేవో కష్టసుఖాలు చెప్పుకొంటుంటె ఆ మాటలని వింటూ గంగమ్మ ఆ నూతిదగ్గరే యిల్లుని మరచి చదిగిలబడింది.

తల్లి లేదు, సందు దొరికిందని, ఇంట్లో పిచ్చయ్య పక్కింటి రావన్న కొడుకుని పిలచాడు. పిచ్చయ్య చెట్టెక్కి నాలుగు జాంకాయలు కోసి రెండు స్నేహితుడుకిచ్చి, రెండు తను తింటున్నాడు ఆ చెట్టు కిందే కబుర్లు చెప్పుకొంటూ. అంతలోనే గంగమ్మ వొచ్చింది. ఆమెని చూడగానే యిద్దరు పిల్లలు కొయ్యబారిపోయారు.

కొడుకు గాబట్టి పిచ్చయ్యకి తల్లిదగ్గర కాస్త చనువు ధైర్యం వుంది. మెల్లగా లేచి తల్లిదగ్గరికి వొచ్చి, తల మెల్లగా తిప్పుతూ-

'రాము, అమ్మా, వాడు' అన్నాడు వాడిని తల్లికి పరిచయం చేస్తున్నట్టు.

ఆమెకి కళ్లు లేవూ చూడ్డానికి? తనింట్లోకి వొచ్చి, తన జాంకాయలు తినేందుకు వాడికెన్ని గుండెలుండాలి? వాడి ప్రోత్సాహంవల్లే తన కొడుకు కాయలు కోసివుంటాడని మండిపోయింది. బిందె గభుక్కున అక్కడ దింపి, చెట్టుకింద దిక్కు చచ్చిన రాముదగ్గరికి గబగబా వెళ్లి, చెవి మెలికలుపెట్టి వాణ్ణి అమాంతంగా నిలబెట్టింది. రాము ఏడుపుముఖం పెట్టేడు. పోనీ గట్టిగా ఏడవడానికైనా జాంముక్క గొంతు కడ్డంగా పడింది.

స్నేహితుని అవస్తని, తల్లి క్రూరత్వాన్ని పిచ్చయ్య సహించలేకపోయాడు. రాముచెవి తల్లి పట్టుకొని నులిమేస్తోంటే, పిచ్చయ్యకి కళ్లనించి నీరు తిరిగిపోయింది. తల్లి దగ్గరకి పరుగెత్తి, తల్లి రెండుచేతులూ విడిపించబోయాడు.

'అమ్మామ్మా రాము తెంపలేదమ్మా. నేనే తెంపి రాము కిచ్చానమ్మా. రామును నేనే పిలచానమ్మా' అని కేకలేస్తూ ఆమె చేతుల్ని, బలమంతాన వుపయోగించి విడదీయాబోయాడు.

'ఏయ్, పిచ్చి, నువ్వూరుకో. ఈ వెధవపని చెబుతాను. ఆ కాయలు నువ్వు కొయ్యలేదు. వీడే కోశాడు. నేను చూశాను' అని రాము బుగ్గల్ని నులుముతోంది.

రాముపాలబుగ్గలు ఎర్రగా కంది పోయాయి. గడగడ లాడిపోతున్నాడు. స్నేహితుని బాధని పిచ్చయ్య చూడలేక పోయాడు. ఇద్దరు స్నేహితులూ చేతగాని చూపులు చూసుకొంటూ కన్నీరు కార్చుకొంటున్నారు.

'అమ్మా, అమ్మా, రాము తెంపలేదు నేనే తెంపి రాముకి యిచ్చానమ్మా ఒట్టు నీతోడు అమ్మా...మ్మా...'అని పిచ్చయ్య గూడ ఏడ్చేశాడు.

రాము గొంతుకలోని జాంముక్క పడి పోయింది. గొంతుకలో బలంగా నొక్కబడివున్న ఏడుపంతా ఒక్కసారిగా భళ్లుమంది. గంగమ్మ యిష్టమొచ్చినట్టు, కొడుకు చేతుల్లో పడుతున్నా సరే విదిలించుకొంటూ రాముని దబదబా బాదేస్తోంది, చచ్చేది గూడ కానకండా.

కొడుకు ఏడుపు వినిపించిందో ఏమో, రాముతల్లి అవలి దొడ్డి పిట్టగోడమీదనించి తొంగిచూసింది. గోడమీద తల్లి ముఖం కనిపించగానే, రాము లక్షుమంది అప్పుల్ని చూసినట్టు 'అమ్మా' అని పెద్దకేక వేశాడు.

కొడుకు గయ్యాళిగంగమ్మ చేతుల్లో గిలగిలా కొట్టుకొంటూంటే, వరాయిదాని చేతుల్లో చావుదెబ్బలు తింటుంటే, ఆ మాతృహృదయం సహించలేకపోయింది. మాతాశతో తనకేసి చూస్తున్న కొడుకు చూపుల కలవరాన్ని చూసి ఆ తల్లి మనసు భరించలేకపోయింది. వదడుగుల గోడమీంచి భంగున దూకి, రక్కసి చేతుల్లో చిత్రవధ గావింపబడుతున్న కొడుకుని గభుక్కున లాక్కొని గట్టిగా కౌగిలించుకొంది. అగ్గిలో కాలిపోతున్న శరీరంమీద ఒక్కసారిగా నవనీతం వర్షించి, మలయమారుతాలు వీచినట్టుంది రాముకి ఆ తల్లి ఆలింగన. ఒక్కసారిగా భోరుమన్నాడు.

స్నేహితుడు రక్షింపబడ్డాడని పిచ్చయ్య ఎగిరి గంతేశాడు. తన కొడుకంటే తనకి ముద్దుగాని, యితర పిల్లలంటె తనలాగే మరో తల్లికిగూడ ముద్దనే సంగతి గంగమ్మకు తెలీదు-తెలుసు-కాని ఆ పిల్లాడు తన గర్భంలో పెరగలేదుకదు.

'నీ చేతులు మండ, నీ చేతులు ముక్కలవ, ఎందుకే నా కొడుకు నలా చచ్చినట్టు బాదుకొంటున్నావ్? ఆ చిన్నాడు నిన్నేం చేశాడే?' అనేసింది రాముతల్లి, కొడుకుఏడుపుని చూడలేక, ఉడికి



పోతున్న దుఃఖంతో, ఎదురుగుండా వున్నది పిశాచి అని తెలిసికూడ.

ఇక గంగమ్మ అంతమాట సయించ గలదూ? విరుచుకపడిపోయింది. ఆమెను నానాతిట్లు తిట్టుకొంటూ మీద కలబడి. ఆమె జుత్తు అందుకొని, బరబర లాగేసింది గంగమ్మ. ఆమె ఒడిలోవున్న రాము కింద పడిపోయాడు.

సరయినపట్టు దొరికిందిగాబట్టి గంగమ్మ, ఆమెను నేలమీద పడేసి యిష్టమొచ్చినట్టు డొక్కలోను పక్కలోను-ఎక్కడబడితే అక్కడ కాలుతో శక్తికొద్దీ తంతోంది. తల్లి బాధని, ఏడ్పునిచూడలేక రాము గొల్లు మన్నాడు. ఇక సయించలేక పక్కనున్న ముల్లకర్ర తెచ్చి గంగమ్మని బాదుతున్నాడు.

పిచ్చయ్యకి ఏడుపొచ్చేస్తుందిగాని, మధ్య దూరలేకపోతున్నాడు. ఇప్పుడు తల్లిని రాము ముల్లకర్రతో కొడుతుండడం చూసి, వాడి చేతిలోని కర్రని గభుక్కున లాక్కొని విసిరేశాడు-వాడు ప్రాణ స్నేహితుడయినా, తనే పిలచి వాడికి కొయలిచ్చినా!

'మా అమ్మను చూడు మీ అమ్మెలా చంపేస్తోందో' అన్నాడు ఏడుస్తూ రాము.

పిచ్చయ్య స్నేహితునికి సమాధాన మివ్వ లేకపోయాడు. తల్లి దగ్గరకి గబగబా వెళ్ళి. ఆమె చేతులు పట్టుకొని ఇంట్లోకి లాక్కు పోబోతున్నాడు. చేతుల్లో యింకా రాము తల్లి జుత్తుంది.

'నువ్వు లేరా పిచ్చి. దీన్ని చంపి మరీ పోదులు తొస. నా దొడ్లో... కొమలు... కాజేసిందిగాకుండా, నా చేతులు ముక్కల వాలట!' అని రొప్పుకొంటూ, తిట్టుకొంటూ ఆమెను నేలమీద ఈడ్చేస్తోంది.

తల్లి అవస్థని చూడలేక రాము మళ్ళా గంగమ్మదగ్గరికొచ్చి గుద్దుతున్నాడు.

గంగమ్మ రాముని డొక్కలో ఒక్క తన్ను తన్నింది. రాము దూరంగా గోడకి గుద్దుకొని పడిపోయాడు.

పిచ్చయ్య తల్లి నొదిలి స్నేహితునిదగ్గరకి పరుగెత్తాడు. రాము పెదాలు ఎండి పోయాయి. మాట రావడంలేదు. బొంగురు పోయిన గొంతుకతో ఏడుస్తూనే, 'మా అమ్మను మీ అమ్మ చంపేస్తోంది' అంటు న్నాడు.

పిచ్చయ్య రాము తల చూశాడు. తల నించి రక్తం కారిపోతోంది. రక్తాన్ని చూడగానే పిచ్చయ్యకళ్లు తిరిగిపోయాయి గబుక్కునలేచి తల్లిదగ్గరకి పరుగునవచ్చి 'అమ్మా...మ్మా...రాము తల బద్దలై పోయింది...రక్తం కారిపోతోందే' అని కంగారుగా ఏడుస్తూ అన్నాడు.

ఆ మాట గంగమ్మకి వినిపించి, కిందపడి వున్న రాముకేసి చూసింది. రాము తల నించి నిజంగానే రక్తం కారుతోంది. ఆ రక్తాన్ని చూడగానే ఆ గయ్యాళిచేతులు పట్లుతప్పాయి.

పిచ్చయ్య కేక రాముతల్లికిగూడ విని పించింది. ఆమెగూడ తిరిగి చూసింది. కొడుకు తలనించి రక్తాన్ని చూడగానే ఆమె కంగారుగా మహాసాగరకెరటంలా లేచి ఒక్కగంతులో కొడుకుని కౌగిలించు కొని, పగిలినతలని చూసి పిచ్చికేక వేసింది.

దొడ్లో జనం అప్పటికే చాలమంది గుమి గూడిపోయారు.

స్నేహితుడు చచ్చిపోయాడేమో అను కొన్నాడు పిచ్చయ్య. తల్లిని విడిపించు కొని రాముదగ్గరకి వెళ్ళిపోవాలనుకొన్నాడు. కానీ గంగమ్మ చేతుల్లో బంధింపబడ్డ పిచ్చయ్యకి ఏం వీలుచిక్కలేదు.

'అమ్మా...మ్మా, రాము చచ్చిపోయా డేమో చూస్తానే.... అమ్మా... రాము... చచ్చి...'చటుక్కున నోరుమూసి పిచ్చయ్యను ఇంట్లోకితోసి తలుపుగొళ్ళెంపెట్టి అరుగుమీద కూచుంది.

ఒకటి చలించని రాతిగుండె. మరొకటి విలపిస్తున్న వెన్నగుండె. ఇద్దరూ స్త్రీలే. ఇద్దరూ తల్లులే. ఇద్దరిలోను వాత్సల్యం, మమత వున్నాయి. ఇద్దరికీ తమ పిల్లలంటె ప్రేమే. ఇద్దరూ తమ పిల్లలు ఏడిస్తే బాధ పడతారు. గంతులేస్తే ఆనందిస్తారు. కాని ఆ హృదయాలే ఇతరులపట్ల శిలలుగా ఎందు కుంటవో!

తర్వాత దెబ్బలాట ముదిరి గంగమ్మ పక్షంవాళ్లు గంగమ్మతరఫున, ఆమె పక్షం వాళ్లు ఆమె తరఫున దెబ్బలాడుకొని చివరకి మగాళ్లు కర్రలు, కత్తులు పట్టుకొనేంత వరకూ వచ్చింది.

గంగమ్మభర్త వెంకన్న, బలవంతుడు, ధైర్యశాలి అయినా చాల శాంతస్వభా వుడు. న్యాయబుద్ధి కలవాడు. అందువల్ల విషయాన్నంతనీ విని తన భార్యదే తప్పని ఒప్పుకొన్నాడు. కాని తర్వాత గంగమ్మ అతన్ని నానా మాటలు ఆడింది.

ఈ దెబ్బలాటవల్ల మునుచుకపోయిందేదీ లేదు. లోకంలో చచ్చినా బతికినా

(21-వ పేజీ చూడండి)

కథానిక:

బరువెక్కిన గుండె

శ్రీ సోమవేదం జానకిరామశర్మ

"నిజంగా మీ అయ్యగారి నెఱుగుదును నేను."

"పోవయ్యా! కబుర్లు."

"కబుర్లు కాదు. ఒక్కసారి ఆయన దర్శనం చేయనియ్యి. ఆయనతో ఒక్కసారి మాట్లాడనియ్యి. నీకు పుణ్యం వస్తుంది."

"మంచిగా చెపితే మనుషులకు తెలియదు. అయ్యగారి నీ సమయంలో చూడ్డానికి వీల్లేదయ్యా అంటే పైతాన్లాగు తగులుకున్నా వేం? ముందు మెట్లుదిగి మాట్లాడు."

"ఆయన వద్దంటే అప్పుడే పోతాగా_"

"నే వద్దంటే పోగూడదా ఏమిటి? ఈ మాత్రానికి అయ్యగారు కూడా చెప్పాలా? పోవయ్యా - ఈపాటికి."

"మాడు. నువ్వు పొమ్మంటే కూడా పోవల్సిందే... కాని —"

"మళ్లీ - కాని... అంటాడు!"

"నువ్వు మంచివాడివి కనక అయ్యగారి కష్టసుఖాలు కనిపెడుతున్నావు. కొందఱు పసువుల్లాగ మంచీ చెడ్డా తెలియక ఇష్టం వచ్చినట్లు చేస్తారు. ఇప్పుడు నువ్వు నన్ను లోపలికి వెళ్ళనియ్యటం లేదంటే నామనస్సులో ఓపక్క నిన్నుగురించి మెచ్చుకుంటూ నేవున్నా. ఐనా. ఇంత తెలివితేటలు కలవాడివి కాస్త నేనుచెప్పేది ఎందుకని వినటం లేదా అని ఆలోచిస్తున్నాను... అయ్యగార్ని చూడ్డానికి అస్తమానం అనేకమంది వస్తూవుంటారు. ఎవర్ని రానియ్యాలో ఎవర్ని రానియ్యగూడదో తెలియకపోతే ఇన్నాళ్ళనుంచీ ఎల్లా వుద్యోగం చేస్తున్నావ్! ఆమాత్రం నాకు తెలియదంటావా! అసలు అయ్యగారి దర్జా, గౌరవం అంతా నీ మీదే ఆధారపడి వుందనుకో!"

"తెలిసిన మారాజులుకి మా కష్టం తెలుస్తుంది."

"ఎవరికో తెలివి తక్కువదద్దమ్మలకి తెలియదు గాని అందరికీ తెలుస్తుంది...... అయ్యగారితో ఒక్కసారి నన్ను మాట్లాడనియ్యి!"

"చీకటి పడింది. ఇప్పుడు వీల్లేదు. రేపొస్తే ముందుగా వెళ్లి నేనే చెప్పి అయ్యగారి దర్శనం చేయిస్తా"

"అభ్యంతర మేమిటి. రేపెల్లాగూ నీవా పని చేయగలవు. కాని... ఒకమాట ఈరాత్రి మాట్లాడనిచ్చావంటే నీకెంతైనా పుణ్యం వుంటుంది. చూడు.... నీ సాయం నే నూరికే పోనియ్యను."

"నాకామాత్రం తెలవదూ! ఐనా లోపలికి వెళ్లొస్తా నుండండి."

ఇట్లా చెప్పి బంట్రోతు సూరయ్య లోపలికి వెళ్లాడు. వెంటనే లోపల్నుంచి బయటకువచ్చి—

"అయ్యగారికి తలనొప్పిగా వుందిటండీ!"

"అల్లాగా... పోనీతే నువ్వేం జేస్తావ్. నా అదృష్టంకూడా కలిసిరావాలి."

"బాబూ! అయ్యగార్ని బాగా ఎఱుగుదురా?"

"ఎఱిగుండడం ఏమిటి? ఇద్దరం ఒకటేననుకో..."

"ఐతే రేపుప్రొద్దున్న రండి...... కాఫీకేమైనా.."

బంట్రోతు కాఫీకి డబ్బులడిగేటప్పటికి కృష్ణమూర్తి జేబులో చెయిపెట్టాడు. కానీ కూడా లేదు. తెల్లబోయిన మొహంతో కృష్ణమూర్తి...

"కానీ కూడా లేదయ్యా ..."

"పోనీలెండి. రేపు తేవచ్చు."

బంట్రోతు రేపు తేవచ్చుననగానే కృష్ణమూర్తి మనసులో ఆలోచన బయలుదేరింది. రేపుమాత్రం డబ్బులు ఎట్లా తేగలడు? తేకపోతే రేపు బంట్రోతును ఎలా చూడడం? ఒక్కసారిగా అనేక ఆలోచనలు మనస్సులోకి వచ్చినై. తన పూర్వస్థితి అంతా జ్ఞాపకం వచ్చింది. మొగం పక్కకు తిప్పి—

"రేపైనా తెస్తానని నీకు వాగ్దానం చెయ్యలేను. ఏమంటే......."

...ఇలా అని కృష్ణమూర్తిపైన మాట్లాడలేదు. బంట్రోతు సూరయ్య అప్పుడే చుట్టకాల్చేందుకు అగ్గిపెట్టె తీసి పుల్ల వెలిగించాడు. ఆ నిప్పు పుల్ల వెలుతురులో కృష్ణమూర్తి మొగం బాగా కనిపించింది. గడ్డం బాగా పెరిగివుంది. కళ్లు పెద్దవి. ఆ నిప్పు పుల్లకాంతిలో జిగేలుమని ప్రకాశించినై. కళ్లు చెమ్మగిల్లినట్లుకూడా అనిపించింది. సూరయ్య అతన్ని చూసి—

"పోనీలెండి. డబ్బులివ్వకుండా ఎంతమందికి అయ్యగారి దర్శనం యిప్పించడం లేదు. రేపు తొమ్మిది గంటలకల్లా రండి."

"నీ పేరేమయ్యా?"

"నాపేరు సూరన్నండి."

"మాడు, సూరన్నా! రాత్రికి ఈఅరుగు మీద పడుకోనా? అభ్యంతరం ఏమైనా వుంటుందా?"

"అమ్మో! వద్దు బాబూ! వూరు చూడబోతే బాగుండలేదు. ఈ కమ్యూనిస్టోళ్లు... మంచీ చెడ్డా లేదు. ఎవర్నిపడితే వాళ్లని... ఉత్తిపుణ్యానికి చంపేస్తున్నారు బాబూ! మీరు ఎక్కడికైనా వెళ్లి ఈ రాత్రికి పడుకోండి. రేపు తొమ్మిదింటికల్లా రండి."

"కమ్యూనిస్టులు అంతపని చేస్తున్నారా?"

"అంత పనా? వాళ్లు చెయ్యని దురాగతం ఏముంది బాబూ! ఆడ, మగ తేడా లేదు. డబ్బుకు డబ్బు- ప్రాణానికి ప్రాణాలు తీసేస్తున్నారు. వాళ్లకే మొస్తుందో తెలియదు."

"వాళ్లంత చెడ్డవాళ్లా సూరన్నా?"

"ఆ గొడవ మనకెందుకు బాబూ! మందేవూరు?"

"మాది కృష్ణాజిల్లా. మీ అయ్యగారిదీ మాదీ ఒకేవూరు. మే మిద్దరం చిన్నప్పటినుంచీ కలిసిచదువుకున్నాం. చాలా స్నేహంగా వుండేవాళ్లం. స్నేహమంటే - ఓకంచంలో తిని ఓ మంచంమీద పడుకునేవాళ్లం."

"ఐతే మా అయ్యగారిలాగా మీరూ గొప్పచదువు చదివేరన్నమాట! మొదట్లోనే చెప్పెయ్యకపోయినారా బాబూ! అయ్యగారితో చెప్పేవాణ్ణి. ఇప్పుడు తలుపు కూడా వేసుకున్నారు. ఐనా మళ్లీ పిలవమంటారా?"

"ఒద్దు, ఒద్దు. రేపు రమ్మన్నావుగా"

"బాబూ! మన పేరు?"

"నాపేరు కృష్ణమూర్తి."

ఇలా చెప్పి కృష్ణమూర్తి వెంటనే అరుగుదిగి వెళ్లబోతూ "సూరన్నా! రేపు తొమ్మిదిగంటలకు వస్తాను సుమా!" అన్నాడు. ఆమాటకు సూరన్న "తప్పక రండ"ని సమాధాన మిచ్చాడు. ఒక నిమిషంలో కృష్ణమూర్తి వెళ్లినతరువాత సూరన్న బైట వసారాగదిలోకి పోయి పడుకున్నాడు.

మోహనరావు హైదరాబాదులో స్పెషల్ జడ్జీగా నియమింపబడ్డ రెండేళ్లనుంచీ సూరన్న వారిదగ్గరే వుంటున్నాడు. మోహనరావు కృష్ణమూర్తి ఎలిమెంటరీ స్కూలుచదువు మొదలు కాలేజీవిద్య అయ్యేదాకా సహాధ్యాయులుగా వున్నారు. కృష్ణమూర్తి బి. ఎ. ఐనాక ఇంటిదగ్గర వ్యవసాయంపనులు చేసుకుంటూ వుండిపోయినాడు. మోహనరావు బి. యల్ పరీక్ష ప్యాసయి కొన్నాళ్లు బందరులోనూ, కొన్నాళ్లు బెజవాడలోనూ ప్రాక్టీసుచేశాడు. తరవాత కొన్నాళ్లకు ప్రభుత్వంవారిచే మునిసిఫ్‌గా నియమింపబడ్డాడు. క్రమంగా ఆయన ఆవృత్తిలో మంచిపేరు సంపాదించుకొన్నాడు. తత్ఫలితంగా ప్రభుత్వం ఆయనను ఇటీవలనే హైదరాబాదులో స్పెషల్‌జడ్జీగా నియమించింది.

మర్నాడురాత్రి తొమ్మిదిగంటలు దాటింది. మోహనరావు గోపాలరావు భోజనంచేసి ముందు వరండాలో వున్న కుర్చీల్లో కూచున్నారు. కొంచెంసేపైన తరువాత సుశీల తమలపాకులు వక్కలు వగైరా తీసుకుని అక్కడేవున్న చాపమీద కూర్చుంది. సుశీలను చూడ్డంతోనే మోహనరావు—

"కృష్ణమూర్తి బలే నాటకం ఆడాడు సుమీ"

"నాటకం ఏముందీ - ఏదో పనిమీద తిరుగుతూ వుంటాడు"

"వండిన వస్నీ నువ్వే తిన్నావా?"

"రాత్రికి వస్తాడేమో ననుకుంటూన్నాను"

సుశీల ఇలా అంటూవుండగానే కృష్ణమూర్తి తన కూతురు సుధను తీసుకొని వీధిగుమ్మం దాటి ఇంట్లోకి వస్తున్నాడు. మోహనరావుగాని, సుశీలగానికృష్ణమూర్తిని గుర్తుపట్టలేదు. సరాసరి కృష్ణమూర్తి వరండాదగ్గరకు వచ్చాడు. వెనక సుధ నిలబడి వుంది. సుశీల ఎవరో వచ్చారని చాపమీదనుంచి లేచి నిలబడింది. వెనకాలే సూరన్న వచ్చి "అమ్మా! కృష్ణమూర్తిగారే నండి. అమ్మాయిగారిని తీసుకొచ్చారు" అన్నాడు. ఆమాట విని సుశీల వచ్చిన వ్యక్తిని నిదానించి చూసి

"ఎవరూ? కృష్ణమూర్తా?" అంది. గడప ఎక్కుతూ కృష్ణమూర్తి

"అక్కా మఱచిపోయినావా?"



"ఇదేమిటి? కృష్ణమూర్తీ! ఇలాతయారైనావు" అంది.

మోహనరావు కృష్ణమూర్తిని పోల్చుకొన్నాడు. "కృష్ణా! ఏమిటి వేషం?" అన్నాడు.

కృష్ణమూర్తి తన కూతురు సుధతో "అమ్మాయీ అత్తదగ్గర కూర్చో" అన్నాడు. సుధ సుశీలదగ్గరకు వచ్చింది. కృష్ణమూర్తి మోహనరావుదగ్గరగా వున్న పడకకుర్చీలో కూచున్నాడు. మోహనరావు కృష్ణమూర్తితో

"కృష్ణా! ఏమిరా యీ వేషం" అన్నాడు. కృష్ణమూర్తి ఒరే వేషంలో ఏముంది? ఈమధ్య చాలా జబ్బుపడ్డాను. అందుచేత గడ్డం బాగా కులాసా చిక్కేదాకా తీయించనని వేంకటేశ్వరస్వామికి మొక్కుకున్నాను." అన్నాడు.

సూరన్న ఇంతలో దొడ్లో నూతిలోంచి నీళ్లు తోడి తెచ్చాడు. కృష్ణమూర్తి లేచి కాళ్లు కడుక్కున్నాడు. సుశీల, అమ్మాయీ! నీవుకూడా కాళ్లు కడుక్కో అమ్మా! అని సుధను చూస్తూ అన్నది. సుధ లేచి కాళ్లు కడుక్కుంది.

ఒకప్పుడు కృష్ణమూర్తి ఎప్పుడూ తల, బట్ట మాయనీయకుండా అప్పుడే పూసిన పువ్వల్లే వుండేవాడు. మనస్సు కూడా దానికి తగినట్టు చాలా సున్నితంగా వుండేది. పూట పూటకు దుస్తులు మారుస్తూ వుండేవాడు. ఇప్పుడు పోలిక పట్టలేకుండా తయారైనాడు. తొడుక్కున్న చొక్కా మూడుచోట్ల చిరిగింది. పదేళ్లక్రిందట కృష్ణమూర్తికి ఇంత శరీరం వుండేది కాదు. కొంచెం పల్చగా వుండి, పెద్ద పెద్ద కళ్లు, సూదిముక్కుతో బంగారు ఛాయతో అందర్నీ ఆకర్షించేవాడు. ఆనాటి రూపంలోనే కృష్ణమూర్తిని, మోహనరావు, సుశీల ఇప్పుడు కూడా చూస్తామనుకున్నారు. ఇప్పుడు మనిషి మోటుగా వున్నాడు. శరీరచ్ఛాయ బాగా తగ్గింది. శరీరం లావెక్కింది. నాజూకుతనం పోయింది.

రెండు నిముషాలసేపు అయినతరువాత మోహనరావు "కృష్ణా! ఈ అమ్మాయి నీ కుమార్తెనా? అన్నాడు.

"అవును మా అమ్మాయే. ఒకటే పిల్ల. దీని పేరు సుధ"

ఆ మాటపైన సుశీల అందుకొని "అవును దీని బారసాలకే మేము బెజవాడలో వుండగా రమ్మని వుత్తరంకూడా వ్రాశావు" అంది. ఆమాటపైన "సరె కాని లోపలకు తీసుకువెళ్లి వీళ్లకు ముందు అన్నం పెట్టు. వంటమనిషికూడా వెళ్లిపోయినట్లుంది" అని మోహనరావు అన్నాడు. దానిమీద కృష్ణమూర్తి—

"నేను ఇప్పుడు భోజనం చెయ్యను. చాలా మందిమి మనవూరినుంచి బొంబాయి పోతున్నాము. మా అమ్మాయి హైదరాబాదు చూడలేదంటే చూపిద్దామని తీసుకు వచ్చాను. నాలుగురోజుల్లో తిరిగి బొంబాయినుంచి వచ్చేటప్పుడు ఇక్కడ ఆగి మా అమ్మాయిని తీసుకు వెడతాను." అన్నాడు. ఆమాటలు విని మోహనరావు—

"భోంచెయ్యకుండా వెళ్లడమేమిటి?"

"ఫరవాలేదు. ఆకలి గాలేదు. రాత్రి 11½ గంటలకు ఇక్కడనుంచి బయలుదేరె బండికే అంతా పోతున్నాము. నేను కూడా ఇప్పుడే పోతాను. విశేషాలన్నీ నేను తిరిగి వచ్చాక మాట్లాడుకుందాం."

"నీ భార్య నిర్మల కులాసాగా వుందా?"

"కులాసా కెక్కడికి? ఏదో వున్నాం. అంతా అమ్మాయి చెపుతుంది. అక్కా! ఆ కూర్చుంది మీ గోపాలమేనా?"

"మరే! మావాడే - వీడికీ మీ అమ్మాయికీ ఐదేళ్లు వార అనుకుంటాను"

"ఔను! అల్లుడూ! పోయివస్తానోయ్! మోహన్! మళ్లీ వస్తానురా!"

"అరే! [illegible] చెప్పుల్లో ప్రయాణమేమిటిరా?"



"ఏమీ లేదు. వాళ్లని మళ్లీ చిక్కుల పెట్టినట్లవుతుంది. మళ్లీ నీకు కనబడతాగా... మరి. సరే నను. అక్కా! నీవైన వెళ్లి రమ్మను."

"కృష్ణమూర్తీ! ఫోం చెయ్యకుండా వెళ్లడం బాగా లేదు. "మళ్ళీ వస్తానంటినిగా.... అక్కా!"

ఈమాట విని మోహనరావు—

"సరే! పో, టైము కొవచ్చింది. తప్పకుండా కనపడు."

"కనపడక మా అమ్మాయిని మీఇంట్లో నే వుంచుతానేమో!"

ఇట్లా అంటూనే కృష్ణమూర్తి బయటకు బయల్దేరాడు. వెడుతూ కుమార్తెతో. "అమ్మా! సిగ్గుపడక మన ఇంట్లోలాగా నే వుండు. త్వరగా వస్తాలే" అన్నాడు. మోహనరావు, సుశీల బయట గుమ్మందాకా వచ్చి కృష్ణమూర్తిని సాగనంపారు.

సుశీల సుధను భోజనం చేయించటానికి ఇంట్లోకి తీసుకువెళ్లింది.

* * *

నాలుగురోజుల్లో వస్తానన్న కృష్ణమూర్తి బొంబాయినుంచి నెలరోజులైనా రాలేదు. సుధ ఏపూటకాపూట తండ్రికోసం ఎదురు చూస్తోంది. ఏమాత్రంపరిచయంలేనిఆఇంట్లో సుధ మొదటిరోజుల్లో వుండటానికి కష్టపడింది. కాని సుశీల, మోహనరావు తన మీద చూపిస్తున్న ప్రేమవల్ల కొంతమనస్సు నిబ్బరంగా వుంచుకుంది. గోపాలరావు ఆ యింట్లో ఒక్కడే వుండటానికి సెలవుల్లో ఎప్పుడు వచ్చినా చిరాకుపడేవాడు. ఇప్పుడు సుధకూడా వుండటం అతనికి చాలా సంతోషంగా వుంది. సుధ గదిలో కూర్చుంటే గదిలోకి, వసారాలో వుంటే వసారాలోకి, ఏదో పనిపెట్టుకుని వస్తూ వుండేవాడు. ఆమె నవయౌవనం అందం అతణ్ణి యిబ్బందిపెట్టినై. స్వగ్రామంనుంచి వచ్చినప్పటికంటె సుధ ఈనెలరోజుల్లోనూ చాలా మారిపోయింది. అప్పటికంటె ఆమెలో సౌకుమార్యం ఎక్కువైంది. గోపాలరావుకు ఎప్పుడూ సుధను చూస్తూ కూచోవాలనిపించేది. మొదటిరోజుల్లో సుధ గోపాలరావంటే బెరుకు బెరుకుగా వున్నా రోజులు గడచినకొద్దీ అతని దర్శనం ఆమెకు ఆనందం కలిగించసాగింది.

ఒకరోజున సుశీల, కాఫీ గదిలో వున్న గోపాలరావుకు సుధ చేత పంపించింది. గోపాలరావు అప్పుడు ఏదో మంచంమీద పడుకుని చదువుకుంటున్నాడు. గుమ్మం దగ్గిర చప్పుడు కావడంతోటే తలెత్తి చూశాడు. సుధ నెమ్మదిగా గాజుగ్లాసుతో కాఫీ తీసుకురావటం చూశాడు. చూడనట్టుగా మళ్లీ తన దృష్టి పుస్తకంవేపు మళ్లించాడు సుధ అతనిదగ్గరగా వెళ్లి—

"కాఫీ ఇదిగోనండి"

"..........."

"ఏమండీ! కాఫీ పంపించారండీ!"

"............"

"అత్తయ్యగారు మీకు కాఫీ పంపించారండీ"

"ఏమిటే! అత్తగారా? నాకా! కాఫీ పంపారా? మరి - నీవు - నేనంటే సిగ్గులేకుండా, తెచ్చావే!"

ఇలా అంటూనే గోపాలరావు ఆమె చేతిలో కాఫీగ్లాసుఅందుకున్నాడు. వెంటనే సుధ వెళ్లిపోబోయింది. గోపాలరావు ...

"ఉండు, కాఫీ తాగేదాకా వుండి గ్లాసు తీసుకువెళ్లు." అన్నాడు. ఆమె అల్లాగే గో వేపుకుతిరిగిగ్లాసుకోసంనిరీక్షిస్తూవుంది. గోపాలరావు ఎంతో వేడిగా వున్నట్లుగా కాఫీఆర్చుకు ఆర్చుకుతాగాడు. "ఇదుగో గ్లాసు"అని చెయ్యిచాచాడు. సుధ దగ్గరకు వచ్చి గ్లాసు అందుకోబోయింది. గోపాలరావు కుడిచేత్తో ఆమె బుగ్గమీద చిటికె వేశాడు. సుధ చిఱునవ్వుతో అతనికేసి చూస్తూ వంటఇంట్లోకి పోయింది.

కృష్ణమూర్తి బొంబాయివెళ్లి నాలుగు మాసాలయింది. ఇంతవరకు జాడ లేదు. ఫలానాఅప్పుడు వస్తానని గాని ఫలానా చోటవున్నానని గాని వుత్తరంకూడా వ్రాయలేదు. సుధ వాళ్లింట్లో చనువుగా తిరగడం మొదలుపెట్టింది. గోపాలరావు, సుధ అప్పుడప్పుడు ఎవరూ లేకుండా కలిసి మాట్లాడుకోటం - సుశీలా, మోహనరావులు కనిపెడుతూనేవున్నారు. సుశీల వాళ్లిద్దరూ హద్దు మీరకుండా వుండేలాగు కనిపెడుతూనేవుంది. సుధమనసులో తన కక్కడ కలుగుతూవున్న నూతనానుభవానికి ఆనందం, భయంకూడా పొందుతోంది.

ఒకరోజురాత్రి అందరూ భోజనాలు చేసి తాంబూలాలు వేసుకున్నారు. సుశీల దగ్గరగా సుధ కూచునివుంది. గోపాలరావు తండ్రికి ఎదురుగా కుర్చీలో కూర్చుని వున్నాడు. సుశీల సుధతో—

"అమ్మాయీ! మీ నాన్న దగ్గిర్నుంచి వుత్తరమే రాలేదే"

"నాకేమిటో భయం వేస్తోందత్తా!"

"ఏం భయం-వుత్తరం తీరిక లేక వ్రాయలేదో—వ్రాస్తే వుత్తరమే అందలేదో—

'ఆ మాటపైన మోహనరావు—

"వాడు చిన్నప్పటినుంచి చెప్పేదొకటీ చేసే దొకటీను." అన్నాడు. అది విని సుశీల—

"మీ అమ్మ నిర్మలైనా నీకోసం జాబు వ్రాయలేదే! చిన్నప్పుడు మనవూళ్లో ఎంతో సంతోషంతో ఇద్దరం కలిసిమెలిసి వుండేవాళ్లం." అంది. అది విని గోపాలరావు—

"అమ్మా! ఆ మాటలన్నీ ఎందుకు ఇప్పుడు?"

"ఎందు కేమిటిరోయి—నిర్మలా నేనూ ఎంత స్నేహంగా వుండేవాళ్ళం - నేను కాపరానికి వెళ్లిన కొత్తలో. చాలా కలుపుగోలైనమనిషి." సుశీల పలికిన ఈ మాటలు విని మోహనరావు—

"ఒరే! గోపీ! నాకూ కృష్ణమూర్తికీ ఎంత స్నేహమో మీ అమ్మకూ, నిర్మలకూ అంత స్నేహం వుండేదిరా!"

మోహనరావు ఈ మాటలుఅన్న తరువాత సుధ తలవంచుకుంది. కళ్ళనుంచి రెండు మూడు బిందువులు కిందకు రాలినై అది గోపాలరావొక్కడే చూశాడు. వెంటనే—

"అమ్మా! మీ మాటలకు సుధ ఏం చేస్తోందో చూశావా?"

"ఏం? ఏం చేస్తోంది?"

సుశీల సుధకేసి చూసింది. సుధ పొంగి వచ్చే దుఃఖం ఆపుకోలేకపోయింది. వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది. మోహనరావూ, సుశీలా ఒక్కసారిగా—

"ఏడవకు తల్లీ! ఎందుకు ఏడుస్తావు?" అన్నారు. గోపాలరావు అందుకుని—

"నేను చెపితే విన్నావా అమ్మా! సుధను ఏడిపించేదాకా చేశావు"

"నే నేం చేశానురా నాయనా?"

"సుధతల్లివిషయం, మాట్లాడవద్దంటే విన్నావా అమ్మా?"

"ఏం నాయనా? నాకేం తెలుసురా!"

"నీ కేం తెలియదు కనుకనే వద్దన్నాను."

గోపాలరావుమాటపైన మోహనరావు "నిర్మల ఏమైందిరా? సుధఏడుపు ఎందుకు? నీకు తెలుస్తే చెప్పు!"

(48-వ పేజీ చూడండి)

కథానిక:

ఆడపిల్లతండ్రి

"విషాది"

గంగాధరం రుసరుసలాడుతూ ఇంట్లోకొచ్చాడు.

అప్పుడే మన్నీళ్ళెత్తుకొని వస్తూన్న రాజమ్మకేమీ అర్థం కాలేదు. ఎందుకంత కోపంతో గ్రామాంతరాన్నుంచొచ్చాడో గర్త!

"వెధవకాలం...వెధవ వేషాలు ... పాడలవాట్లూనూ" అంటూ నెత్తికి చుట్టుకున్న ఉత్తరియ్యాన్ని తీసి వంకెన పెడుతున్నాడు.

కాళ్ళ[illegible] నీళ్ళివ్వటానికి దొడ్లోకి పోయింది రాజమ్మ.

ముఖంమీది చెమట తుడుచుకుంటూ [illegible]సుగ్గా కూలబడ్డాడు గంగాధరం.

"ఏమిటండీ? మహా విసుగ్గావచ్చారు? ఏమైందేమిటి?" అంటూ ఇత్తడి చెంబుతో నీళ్ళు తెచ్చి అక్కడ పెట్టింది రాజమ్మ.

"ఏమి టేమిటి? ఆ వెధవ...వాడు లేడూ... రామశర్మకొడుకు..ఉత్తమొద్దు - వాడికీ కావాలట! వేలు..."

"మరి వెంకటేశ్వర్రావేమన్నాడండీ?"

"చెట్టెక్కి కూర్చున్నాడు."

"అసలు ఎంత కావాలన్నాడు కట్నం?"

"పదివేలు..."

"మరి ఇంకెక్కడన్నా వెతక్క పోయారా?"

"చచ్చేట్టు కట్టిన గడపల్లా తిరిగాను; మగపిల్లవాడున్నాడన్న కొంపలంతా తిరిగాను..."

"ఎక్కడా సంబంధం కుదరనే లేదండీ!"

"మొలతాడు గట్టిన వాడల్లా వేలమీదనే కూర్చుండె! వేలుంటే కుదరటానికేం...?"

"ఏదో మనకు తగ్గదే చూడక పోయారూ?"

"నీకు చెపితే అర్థం కావటంలేదే? పిచ్చిమొద్దు!"

"అర్థమేమిటండీ? ఇంతకూ కుదరలేదంటారు అంతేగా."


"ఆహా"

అన్నం మెత్తనౌతుందేమోనని గొణుగుకుంటూ వంటింట్లోకి పోయింది రాజమ్మ.

ఈ సంభాషణలో మెత్తనే అయింది కూడు కాస్తా -!

పొగాకుపట్టా ముందేసుకొని చుట్ట చుట్టుకుంటూ నిప్పు తెమ్మని కేకేశాడు గంగాధరం.

గంటెతో నిప్పు తెచ్చిస్తూ "ఇంతకూ



దానికి పెండ్లిగీత పెట్టుకోరాలేదేమో" అన్నది రాజమ్మ విచారంగా.

గంటె అందుకొని "దాని గీత ఎట్లా ఉందో?" అన్నాడు గంగాధరం.

"ఈ వైశాఖమాసంలోనైనా ముడిపడితే బాగుండు" అంది రాజమ్మ.

"అదే చూస్తున్నాను. కాళ్ళరిగేటట్టు తిరుగుతున్నానా మరి?" అన్నాడు గంగాధరం.

"ఇంతకూ దాని రాత. ఎటువంటివాడు దొరకుతాడో?" అంటూ లోపల కెళ్ళింది రాజమ్మ.

చుట్టను పీలుస్తూ, ఊపిర్కొస్తూ, ఆలోచనలో పడ్డాడు గంగాధరం.

"స్నానానికి లేవండి. వంటైంది" అని కేకేసింది లోపలనుంచి రాజమ్మ.

"అమ్మాయి యెక్కడికి పోయిందే?" అంటూ చుట్టపారేసి లోపలకు పోయాడు గంగాధరం.

* * *

పిల్లను చూట్టానికి అగ్రహారంనుంచి వచ్చారు. రాజమ్మకు అంతులేని పని. హడావుడిగా అటూ ఇటూ తిరుగుతూ వారికి కావలసినవన్నీ సమకూరుస్తున్నది.

గంగాధరం పిచ్చాపాటీ వచ్చినవాళ్లతో మాట్లాడుతున్నాడు వాళ్ళ ప్రక్క కూర్చొని.

ఎదురుగా చాప వేసివుంది.

"అమ్మాయిని తీసుకొనిరావే!" అని కేకేశాడు రాజమ్మని మాటలాపుజేసి.

పిల్లను ముస్తాబుతో తీసుకొనివచ్చింది రాజమ్మ. సిగ్గుతో తల వంచుకొని కూర్చుంది చాపమీద పిల్ల.

"మీ పిల్లకు చదువచ్చునా? ఏమండీ?" అని ప్రశ్నించాడు పెండ్లికొడుకు పినతండ్రి.

"ఆ! తెనుగు చదవంతా వచ్చు. కాస్తో కూస్తో సంగీతంకూడా వచ్చు" అన్నాడు గంగాధరం.

"ఇంగ్లీషు అసలు రాదా?" అని ప్రశ్నించాడు పెండ్లికొడుకు.

"పల్లెటూరిపిల్లకు ఇంగ్లీషు ఎట్లా వస్తుంది? అయినా ఇంగ్లీషు ఆడపిల్లలకెందుకు?" అన్నాడు గంగాధరం కొంచెం వ్యంగంగా—

"మరి కట్నమేమిస్తారు?" అని అడిగాడు పెండ్లికొడుకు పినతండ్రి.

"ఏదో వెయ్యినూటపదహార్లు ఇద్దామని. నేనూ, ఇప్పుడు చాలా చితికిపోయివున్నాను - ఇదివరకు మా పెద్దలున్నప్పటిలాగా లేదాయ సంసారం. ఉన్న ఆస్తి సంతటినీ వారే పాడుచేసిరి. అయినా యీ రోజుల్లో డబ్బుకు మహా కిటకిటగా వుంది. నేనేమో చేతులు ముందర పెట్టుకొని కూర్చుంటిని - ఆ వచ్చిన పంటలోనే తినాలాయ. ఉన్న పదెకరాలూ నా తరువాత మీకొచ్చేదేగా—" అంటూ మొదలెట్టాడు గంగాధరం.

ముఖం చిట్లించుకున్నాడు పెండ్లికొడుకు. "సరే ఇంతకూ ఎంత ఇస్తామంటారు" అని నిగ్గదీశాడు పెండ్లికొడుకు పినతండ్రి.

"అన్ని లాంఛనాలూ కలిపి పదిహేను వందలకన్నా ఎక్కువ ఇవ్వలేని" నిగ్గతేల్చాడు గంగాధరం.

"మరి ఇంతకూ పిల్ల నచ్చిందీ, లేనిదీ చెప్పరేం?" అన్నది రాజమ్మ తలుపుచాటున నుంచొని.

"ఇంటికిపోయి ఉత్తరం రాస్తాం" అంటూ లేచాడు పెండ్లికొడుకు పినతండ్రి.

"తొందరగా ఏకబురూ తెలియచెయ్యండి" అన్నాడు గంగాధరం.

చూడవచ్చిన వాళ్ళంతా ప్రయాణమై బయలుదేరారు. ఊరిబయటిదాకా సాగనంపాడు గంగాధరం.

* * * *

మూడువేల రూపాయల కట్నంతో నిశ్చయమైంది వివాహం. గంగాధరం, రాజమ్మల సంతోషానికి మితిలేదు. కానీ రెండెకరాలు అమ్మాలసి వచ్చినందుకు మాత్రం గంగాధరం లోపల విచారపడ్డాడు.

ముహూర్తం రేపనగా విడిదికి చేరారు పెండ్లివారు. వారికి మర్యాదలు చెయ్యటంలో సతమత మయితున్నారు గంగాధరం, రాజమ్మనూ. ఇంటినిండా ఆ రాత్రే మామిడితోరణాలు కట్టారు. రంగుకాయితాలు కత్తిరించి అంటించారు. గంగాధరానికి ఒక్క ఆడపిల్ల. ఆ పిల్ల పెండ్లి నలుగురిలో కొంచెం ఘనంగా చెయ్యాలని. అందుకనే రెండెకరాల పొలాన్ని నాలుగువేల కమ్మాడు గంగాధరం. ఇంట్లో ఇదివరకున్న వెయ్యిరూపాయీలూ పొలంఅమ్మిన నాలుగువేలూ కలసి పిల్ల పెండ్లికి ఖర్చు పెట్టాలని కట్నం మూడు వేలూ పోను మిగతా రెండువేలూ పెట్టి పెండ్లిసరుకులు తెచ్చాడు.

ఇల్లంతా కళకళలాడుతున్నది. తెల్లవారేటప్పటికే ఫలహారాలు పంపాలని తొందర చేయసాగింది రాజమ్మ. లగ్నం పదిగంటలకాయె. అందువల్ల అంతా తొందరలో వున్నారు.

పెండ్లివాళ్ళలో అప్పుడే కాఫీ అందలేదనీ, ఫలహారాలు రాలేదనీ ఫిర్యాదులు వచ్చాయి తెల్లవారకముందే!

రాజమ్మ ఆదుర్దాగా ఇదివరకు చేసివుంచిన లడ్లూ, అరిశలూ, వగైరాలన్నీ తీసి పళ్లాలలో సర్దుతున్నది. వంట బ్రాహ్మడు ఉప్మా, కాఫీ తయారుచేస్తున్నాడు.

ఇంతలోనే గంగాధరాన్ని పిలుస్తున్నారని, పెండ్లివారి చాకలి పిలిచాడు. గంగాధరం పెండ్లివారి విడిదికెళ్లాడు ఆదుర్దాగా.

"ఆడబిడ్డకు వెయ్యినూటపదహార్లివ్వంది పెండ్లి జరగటానికి వీల్లేదు" అంటున్నది పెండ్లికొడుకు తల్లి.

గంగాధరం లోపల ప్రవేశిస్తూనే విన్నాడు పెండ్లికొడుకు తల్లిమాటలు.

"మరి మొదట అనలేదుగా?" అన్నాడు గంగాధరం కొంచెం కటువుగా.

"అనుకోకపోతే మీకు తెలియదూ?" అంటూ దగ్గరకొచ్చింది పెండ్లికొడుకుతల్లి.

"మొదట అనుకోలేదు. ఇప్పుడంటే ఎట్లా?" గంగాధరానికి కోపం వచ్చింది కానీ, తనలోనే ఇముడ్చుకున్నాడు. ఎంతైనా "ఆడపిల్ల తండ్రినే"నని.

"ఏమైనాసరే ఆడబిడ్డ కట్నం వెయ్యినూటపదహార్లూ పడితేనే వరపూజకొస్తాం" అని మూతిముడుచుకుంది పెండ్లికొడుకుతల్లి.

గంగాధరానికి పట్టరానికోపం వచ్చింది. ఏమిచెయ్యాలో తోచలేదు. "వెయ్యినూటపదహార్లు!" తనదగ్గర ఇప్పుడు చిల్లిగవ్వ లేదు. అప్పుకూడా పుట్టదు యీ గ్రామంలో. నిర్ఘాంతపోయాడు పెండ్లివాళ్ల యీ అఘాయిత్యానికి.

నలుగురూ సర్ది చెప్పారు "ఆడపిల్ల తండ్రివి కనక ఇమ్మోకతప్పద"ని.

★

శిలాద్రవం

(14-వ పేజీ తరువాయి)

'గంగమ్మ మా తల్లి గయ్యాళిగంప' అనే మంచి పేరు తరాలుతరబడి నిలబడిపోతుంది. లోకాన్ని తృణీకరించి తిరిగేవారికి ఆ చెడు మంచిలతో లెఖ్ఖ వున్నా లేకపోయినా, గంగమ్మమాత్రం ఎవ్వరినీ లెఖ్ఖ చెయ్యలేదు – ఆమె మూర్ఖత్వంలో.

ఇప్పుడు పిల్లడికి బయట తిరిగే హక్కు లేదు. ఇంట్లోనే కావలిసినవి తింటూ, ఆడుకొంటూ వుండాలి. బయటికి ఎప్పుడైనా తొంగిచూసినా స్నేహితులందరూ నిరాకరించేవారు – ఏ కుర్రాడితో మాటాడినా రాముకి పట్టినగతే తమకీ పడుతుందేమోనని తప్పించుక తిరిగేవారు.

దెబ్బలాట జరిగిందగ్గర్నుంచి రాము యిటు రావడమే మానేశాడు. దొడ్లోగూడ వాడి మాటలు వినిపించడం లేదు. తల దెబ్బ పూర్తిగా మానిపోయివుంటుంది. వాణ్నోసారి చూడ్డానికైనా వీలు చిక్కటం లేదు. తల్లి నెలా మోసపుచ్చాలా అనే ఎప్పుడూ ఎత్తులు వేసుకొనేవాడు. ఒకరోజు వీలుచిక్కింది.

పిచ్చయ్య గబగబా రాము యింట్లోకి వెళ్లాడు. రాము మరిద్దరు పిల్లలు దొడ్లో మట్టితో లక్కపిడతలు, బొమ్మలు, రైలింజన్లు చేసుకొంటున్నారు. స్నేహితుల్ని చూడగానే పిచ్చయ్య పొంగిపోయి 'రామూ' అని పిలచాడు.

పిల్లలందరూ వెనక్కి చూశారు. రాము నిలబడి పిచ్చయ్యను రమ్మన్నాడు. రమ్మనడం తడవుగానే పిచ్చయ్య పరుగెత్తి వాళ్ళలో కలసిపోయాడు. రాము, పిచ్చయ్యకి తాను చేసిన బొమ్మలన్నీ చూపిస్తున్నాడు. పిచ్చయ్య అది చూస్తూ వాళ్ళల్లో ఒక్కడైపోయాడు.

'మా యింటికి రావడం లేదేం రామూ?' అని అమాయకంగా ప్రశ్నించాడు పిచ్చయ్య.

'మా అమ్మొద్దంది. నేను వస్తే మీ అమ్మ ఆ వేళలాగు కొడుతుంది.'

'అవును అమ్మ కొడుతుంది' అనుకొన్నాడు పిచ్చయ్య. మరి తన నెందుకు కొట్టదో?

ఇంతలో రాముతల్లి బయటినించి వచ్చింది. ఆమె పిల్లల్ని చూసినా ఏదో పని మీద వాళ్లని పలకరించకుండా అలా వెళ్లిపోతోంది.

రాము గబగబా తల్లిదగ్గరకు వెళ్లి 'అమ్మా, పిచ్చి వచ్చాడే' అన్నాడు ఆనందంగా, నవ్వుకొంటూ.

ఆమె అప్పుడు వెనక్కి తిరిగి పిచ్చయ్య కేసి చూసింది. చూసి చిన్నపిల్లల మనసు లెంత నిర్మలమైనవో అని చిరునవ్వు నవ్వుకొంది. కాని గంగమ్మముఖం జ్ఞాపకం రాగానే ఆమెలోని చిరునవ్వలానే పెదాల్లో మాయమైపోయింది. పిచ్చయ్య దగ్గరికి వచ్చింది.

'ఎందు కొచ్చావ్ బాబూ, మళ్ళా రాము తల మీ యమ్మచేత పగలగొట్టించడానికా?' అంది.

పిచ్చయ్య సిగ్గుతో తలవొంచుకున్నాడు. రాముతల్లి ఈ మాట అనగానే ఆవాళ దొడ్లో రాము తల పగిలిపోవడం, రక్తం కారుతుండడం జ్ఞాపానికి వచ్చినై. రాము, తన యింట్లోకి వస్తేనే ఆవాళ అంత గల్లంతు చేసింది తల్లి; కానీ ఈవాళ తను రాము యింటికి వస్తే రాముతల్లి ఎందుకు కొట్టలేదు. అసలు ఏమీ అనదు అనే నమ్మిక పిచ్చయ్య కుంది; కాని ఆ నమ్మి కేమిటో పిచ్చయ్యకే తెలీదు.

తల్లి యిలా అనడంతో రాము అదోలా అయిపోయాడు. తల్లి చెయ్యి పట్టుకుని 'పిచ్చి చాల మంచాడమ్మ' అన్నాడు.

'అవును మంచాడే, మరి వాళ్ళమ్మ?' అని పిచ్చయ్యకేసి తిరిగి 'మీ యింటికి నువ్వు వెళ్ళిపో. లేనిపోని గొడవలన్నీ ఎందుకు మళ్లా? రావడం నువ్వే వచ్చావ్, తిరిగి మీ యమ్మతో చెప్పి మామీదికి ఉసి కలుపుతా' వంది.

'నేను... చెప్పను...' అని మెల్లగా గొణుక్కున్నాడు పిచ్చయ్య.

'నువ్వు చెప్పావొద్దు చెయ్యావొద్దు. తిన్నగా మీ యింటి కెళ్లిపో...ఆవాళ యింటి కొచ్చి ఆడుకొంటున్నవాణ్ణి తీసుకెళ్లి, జాంకాయలు కోయించావు. మళ్లా తల్లి రాగానే ఏం ఎరగనట్టు తప్పుకొన్నావ్...”

'పిచ్చి ఏం చెయ్యలేదమ్మ... వాడు చెబుతున్నా సరే గంగమ్మ వినిపించుకోలేదు.' అని పిచ్చయ్యతరపున క్షమార్పణ వేసుకొన్నాడు రాము.

'నా కవన్నీ అనవసరం. అత నింటికి అతన్ని పోనియ్. మీ యిల్లుండగా మా యిల్లెందుకు రావడం?' అంటూ ఆమె వెళ్లిపోయింది.

పరాభవంతో పిచ్చయ్య పూర్తిగా చచ్చిపోయాడు. తలొంచుకొని అలానే నిలబడి వున్నాడు. రాము మెల్లగా పిచ్చయ్య పక్కకి వచ్చాడు. 'అమ్మ నిన్ను నిజంగా పొమ్మంటం లేదు. ఊరికే అంటోంది' అన్నాడు.

పిచ్చయ్య పిచ్చిగా రాముకేసి చూశాడు. రాము నవ్వాడు, ఆ నవ్వుని చూడగానే పిచ్చయ్య అన్నీ మరచిపోయి మళ్లా వాళ్ల ఆటల్లో కలసిపోయాడు.

కొంతసేపయిం తర్వాత పిచ్చయ్య యింటికి వెళ్లిపోయాడు.

ఇంటికి వెళ్లగానే గుమ్మంలోనే ఎదురయింది తల్లి. తల్లిని చూడగానే పిచ్చయ్య గుండెల్లో రాయి పడ్డట్టయింది. ఆమె వేయబోయే ప్రశ్నలకి ముందునించే సమాధానాన్ని వెతుక్కొంటున్నాడు.

తల్లి నిలబడగానే, వొణికిపోయి, ఆమె ప్రశ్నించకండానే 'ఉహుఁ, లేదమ్మ గా–కాదమ్మ...ఆడుకోడానికి... ఆడుకోడానికి...ఉహుఁ...ఆడుకొంటున్నానమ్మ.. అఁ అఁ; అన్నాడు.

'ఊరుకో దబాయించకు. నువ్వెక్కడికి వెళ్లిందీ నే చూశాను...ఆ ముండ లింటి కెళ్లొద్దని నీ కెన్నిసార్లు చెప్పాలి?...ఆ ముండలికి సిగ్గుంటె సరి నా పిల్లాడిని పిలవదు.' అని కింద నున్న పిచ్చయ్యని ఇంట్లోకి తోసేసింది.

పిచ్చయ్యకి యిక్కణ్నించి ఆ నాలుగు గోడలమధ్యే జీవితం. ఆనందంగా, హాయిగా స్వేచ్ఛగా తిరగడానికి యింత పెద్ద భూమి వుండేగూడ పిచ్చయ్య ఆ వంద చదరపు టడుగుల చరలలోనే జీవించాలి. ఇంత ప్రవహించే గాలి వున్నా, పిచ్చయ్య మాత్రం దయాదాక్షిణ్యాలతో ఆ చిన్న కిటికీలోంచి మారే పిల్లగాలుల బుజ్జగింపులోనే నిద్రపోవాలి.

తన వయసున వుండే చిన్నపిల్లలంతా

కేరింతాలు కొడుతూ ఉప్పట్లే, దొంగాటలు, కోతికొమ్మచ్చి ఆడుకొంటుంటే పిచ్చయ్యమాత్రం పంజరంలో పిట్టలా కొట్టుక చావవలసిందే.

బెంచిమీద సంచి ఎంచి, కంచినించి పొంచి చూస్తూ, పంతులంచ నాకే అందకండా తంటాలెడుతూ తిరిగే అదృష్టంపిచ్చయ్యకి లేదు.

ఇంటికి వచ్చే పంతులు ముందు ఏడుపు ముఖంతో కూచోవడం; మనసు పుస్తకాల మీద లేక చెప్పింది తలకెక్కకపోవడం; పంతులు వెళ్ళిపోయిన తర్వాతగూడ, తల్లి ఆజ్ఞప్రకారం ఆ చీకటికొట్లోనే పడి చదవడం; మధ్యాహ్నం అన్నం తిని ఏమీ తోచక, ఈ నరకాన్నెందుకు సృష్టించారనుకొంటూ నిద్రపోవడం; సాయంకాలం లేచి ఆ దొడ్లోనే ప్రాణంలేని జాంచెట్టుతో చుట్టూరా కట్టివున్న ముళ్లకంచెతో ఆటలాడుకోవడం; మళ్లా రాత్రికి దీపంముందు కూచొని రక్కసితల్లి పక్కనించి బలవంతం పెడుతుంటుంటె - లోపల కోపం ఉడికిపోతున్నా - ఆ పెద్దదాని బలంముందు ఓడిపోయి భయంతో తలొంచుకొని, లోలోనే కుమిలి కుమిలి ఏడుస్తూ, పట్టిన గొంతుకతో, చదివింది తలకెక్కని చదువుతో తలవొంచుకొని, కళ్లనించి ముక్కునించి కారిపోతున్న నీటితో పిచ్చయ్య తీరనివ్యథని ఆ మూర్ఖురాలు గ్రహించలేకపోయేది.

'అమ్మా, రంగడాళ్లతో దొంగాటాడుకొంటానే బయట' అనేవాడు పిచ్చయ్య తల్లిని బతిమాలుతున్నట్టు.

'వొద్దు నాన్నా. వాళ్లు పోకిరీగుంటలు. వాళ్లతో కూడితే నువ్వూ చెడిపోతావు.' అని కొడుకుని బుజ్జగించేది.

ఆమె ఎంత గయ్యాళిదయినా తన కొడుకునిమాత్రం చేయెత్తి కొట్టదు. కొడుకంటె ఆమెకు అపారమైన ప్రేమ, దయ—కాని ఆమె అజ్ఞానంవల్ల ఆ ప్రేమ, ఆ దయ మరో విధాన చెడుఫలితాలకు దారితీస్తోంది.

గంగమ్మ కొడుక్కి మంచి గడ్డపెరుగు, రొట్టె, పాలు, బలమైన తిండి యిస్తున్నా సరె పిచ్చయ్య క్రమంగా నీరసించిపోతున్నాడు. వీడెంత తింటున్నా సరె ఈసురోమంటూ దిగులుగా ఉంటాడు. తల్లిని చూస్తే జాలిగా చూస్తాడు, కాని ఆమెను తిరస్కరించలేడు.

ఆ ఒక్కగదిలోనే తిరుగుతూ బయటవాళ్ల ముఖాలే కరువైనందున, కొత్తవాళ్లని చూస్తుంటుంటె చాలు అదోరకమైన సిగ్గు, భయం, సంతోషాలతో ఒకపక్కకి తప్పుకొనేవాడు. ఇంటికి వచ్చే చుట్టాలలో తన ఈడుపిల్ల లెవరైనా వుంటె వాళ్లనించి సిగ్గుతో తప్పించుకు తిరిగేవాడు. వాళ్ళు పలకరించినా, వాళ్ళకేసి చూసేందుకే ధైర్యం చాలేది కాదు. చివరికి తల్లి ఎదరగూడ సిగ్గుపడుతున్నాడు.

ఆ తొమ్మిదేళ్ల వయసులో లేడిలా గెంతుతూ, కిలకిల నవ్వులతో, ఎదుటివారి యిష్టాయిష్టాలని లెఖ్ఖచేయకండా తనయిష్టం వచ్చినట్టు మాటాడవలసే పిల్లాడు, దిగులుగా, భయంగా, సిగ్గుగా, ఉత్సాహం అనేదే కనబరచకండా ఏడుపుముఖంతో, మూగవాడిలా వుండడమేమిటో అది గంగమ్మకని పెట్టలేకపోయింది.

'ఇంకా పెరుగు కావాలా నాన్నా?' అని గంగమ్మంటె, పిచ్చయ్య తల అడ్డంగా తిప్పేవాడు.

'నా నాన్న, నా బంగారం, నా కొసులు ఎంత మెత్తనోడు. పెద్దవాడయితే చాలసత్తిగాలం వాడవుతాడు; అని వాణ్ణి ముద్దులాడేది - కాని వాడికళ్లల్లో తిరిగేవి విషాదాశ్రువులా, ఆనందాశ్రువులా ఆమెకు అవసరంలేదు.

గుడ్డులోపల కమిలిపోయినా పైకి పెంకు మామూలుగానే వుంటుంది. అదే గంగమ్మకి కావలసింది. పైకి కొడుకు మెత్తగా, మౌనంగా వుంటున్నాడు. పెంకితనమంటేనే తెలీదు. తను ఏదడిగినా మెల్లగా జబాబు చెబుతాడు. రావన్న కొడుకులా దొరికిందే సందుగా నానాగడ్డీ బుక్కియ్యడు. మెల్లగా ఏదయినా ఆలోచించిమరి చేస్తాడు; అని లోలోన సంతోషించేది.

కొడుకుసంగతి భర్తతో చెప్పేది పొంగుకొంటూ తను గొప్పవాడవబోయేవాడి తల్లిననే గర్వంతో.

'వాణ్ణింకెన్నాళ్లు యింట్లో చదివిస్తావ్, ఏదో బళ్లో వేసెయ్యగూడదు?' అనేవాడు వెంకన్న.

'బళ్లోనే. అమ్మబాబో. ఆ పెంకిగుంటలతో కూడి నా బాబు చెడిపోడూ! వాణ్ణి పట్నం పంపించి పెద్దచదులు చదివించి, నా బాబుని పెద్దవాణ్ణి చేస్తా' ననేది.

తల్లినిర్బంధంలో, పిచ్చయ్య ఆ నాలుగు గోడలమధ్యలోనే నీరసించి, జ్వరం తెప్పించుకొన్నాడు. గంగమ్మకి మతిపోయింది. ఇంతకముందు ఐదుగురు పిల్లలుగూడ ఐదునించి తొమ్మిదేళ్లలోపలే పోయేవారు. నమ్మకంగూడ కుదిరింది ఆవాళ చీపురుతో అమ్మవారిని బాదిందగ్గర్నుంచీ.

పిచ్చయ్య నీరసించిన దేహం మంచం పట్టిన మూడురోజుల్లోనే ఎముకలగూడయిపోయింది. గంగమ్మ కొడుకుపక్కన కూచొని ఏడుస్తుంది. వాడి గుండెల్లో తలదూర్చి కుమిలిపోతుంది. వాడు నిలువుచూపు చూస్తే పిచ్చెత్తినట్టు అరచేది.

ఎంతోమంది వైద్యులొచ్చారు; డబ్బు కాసపడి సేవచేశారు. మందులిచ్చారు; కషాయాలిచ్చారు. పెదాలు విరచారు.

'ఏం జబ్బు ముండాకొడుక్కి'

'ఏదో లెస్తూ. గయ్యాళిముండకి తగిన శాస్తి. లేకపోతే ఇన్నా మన్నా కొనకండా ఒక్కలాగే మిడిసిపడుతుంది, ఆపరాత్పరుడు లేడూ?' అనేవారు గ్రామయిల్లాళ్లు.

ఉపవాసాలతో గంగమ్మగూడ నీరసించిపోయింది. కళ్లు మంటలెత్తుతున్నా మాతృమమతలోని క్షీరధారలు చల్లబరుస్తూనే వున్నై. ఎప్పుడూ పిచ్చయ్య పక్కన కూచొని ఆ చలనంలేని ముఖాన్ని తడుముతూ 'నాన్నా, నేను, అమ్మని, చూడు, నాకోసం కళ్లుతెరు.' అని ఏడుస్తుంది.

ఆ తొమ్మిదేళ్ల శరీరం, ఆ తొమ్మిదేళ్ళ మాంసం, ఆ తొమ్మిదేళ్ల ఎముకలు, సర్వం ఆమెగర్భంలో పెరిగాయి, తొమ్మిదినెలలు వదిలాయి. ఇప్పుడవి ఎక్కడికో ఎందుకో పోతున్నవి శాశ్వతంగా. ఎందుకు చచ్చిపోవాలి? తనభాగం, తనరక్తం, తన హక్కు, తనవల్లపుట్టి, తనవల్ల పెరిగిన, ఆస్తిని ఈనాళ తనకి కాకండా ఎవరు, ఎందుకు తీసుకపోతున్నారు?

నవ్వుతున్న నక్షత్రాల మధ్యకి నాల్గవరోజు పిచ్చయ్య నిశ్శబ్దంగా నడచిపోయాడు.

కొయ్యబారిపోయిన శరీరంమీద నిలువునా కూలిపోయింది గంగ. ఏడ్చింది - అది ఏడుపు కాదు, సృష్టివల్ల కలిగిన సహజ ఉచ్చరణ. ఆ ఏడుపు భాషలు నేర్చిన మానవుల్లోనూ, అరచే కుక్కల్లోనూ, ఓండ్రించే గాడిదల్లోనూ, ఘీంకరించే సింహాల్లోనూ, చలనంలేని చెట్లలోను, ఘుక్కుమనే ప్రకృతిలోనూ వుంది.

నిన్న మొన్నటివరకూ నవ్వే కొడుకుని ఈవాళ మన కాళ్లకింద నీచంగా చూడబడుతూ, మనం చేసే ప్రతీ కార్యానికి తలొంచుకొంటూవున్న ఈ మురికిమన్ను కింద ఎందుకు పాతిపెట్టాలి? ఈ నేలకెంత అధికారముంది తన కొడుకు చిరునవ్వుల్ని కప్పివేయడానికి.

పిచ్చిగంగ కొడుకు చావుతో పిచ్చిదై పిల్లల్నందర్నీ 'పిచ్చీ' అని పిలుస్తూ అనందిస్తోంది. ★

★ కొత్త ముఖాలు ★

సినిమాలలోకి కొత్త ముఖాలు రావాలని పత్రికలలో కొంత కాలం క్రితం ఆందోళన జరిగింది. చాలామంది చిత్ర నిర్మాతలు ఈ ఆందోళనను పాటించనట్టు నటించారుగాని సినిమా రంగంలోకి చాలా కొత్త ముఖాలు రానేవచ్చాయి.

కొత్త ముఖాలు కావాలన్న ఆందోళన సామాన్య సినిమా ప్రేక్షకులనుంచి రాదనీ, కొద్దిమంది ఊసుపోనివాళ్లు పత్రికల్లో ప్రవేశించి ఈ ఆందోళన సాగిస్తారనీ కొందరి వాదం. ఈ వాదం నిజమే కావచ్చు. అయినా కొత్త ముఖాలవల్ల సినిమాపరిశ్రమకూ కళకూ కూడా కొంత లాభం లేకపోలేదు.

మొదటి సంగతి, మన సినిమాచిత్రాలలో వ్యక్తిత్వంగల పాత్రలు అరుదు కావటంచేత ఆ పాత్రలు ధరించే నటీనటులకుండే వ్యక్తిత్వమే పాత్రల వ్యక్తిత్వంకింద గణనకు వస్తుంది. అంజలీదేవి నటించే పాత్రలన్నీ అంజలీదేవే; శివరావు అన్ని చిత్రాలలోనూ శివరావే! తెరమీద కనిపించే పాత్రలకు కథకు డివ్వలేని ప్రత్యేకతా, వ్యక్తిత్వమూ తారలిస్తున్నారు గనకనే ఈ తారలకు ఇంతంత పెద్దవేతనాలు ముట్టుతున్నాయనుకోవలసి ఉంది.

పురాణచిత్రాలలో పాత్రల వ్యక్తిత్వం ప్రేక్షకులకు తెలుసు. పాత్రకూ పాత్రధరించే మనిషికీ గల తేడా చాలా జాస్తి అయితే, నటించే మనిషికి ఎంత నటనా సామర్థ్యం ఉన్నా విమర్శకు అవకాశం ఉండేది. సాంఘికచిత్రాలలో ఎంత లేదన్నా పాత్రలకు కనీసప్రమాణంలో వ్యక్తిత్వం ఉండితీరుతుంది. అది నటుల వ్యక్తిత్వానికి అనుగుణంగా ఉండాలి. ఈ బాధ జానపదచిత్రాలకు చాలా తక్కువ. అందుకే జానపదచిత్రాలుకూడా తారల గిరాకీతోబాటు విజృంభించి ఉండవచ్చు.

ఈ పరిస్థితులలో కొత్తముఖాన్ని తెరమీదికి తేవటమంటే కొత్తపాత్రను సృష్టించటంతో సమానమన్నమాట. చూసిన పాత్రనే మళ్లీ మళ్ళీ చూడడానికీ కొత్తపాత్రను చూడటానికీ ప్రేక్షకుల దృష్టిలో ఏ వ్యత్యాసమైతే ఉంటుందో పాత తారలను చూడటానికీ కొత్త తారలను చూడటానికీ అంత వ్యత్యాసం ఉంటుంది. అంజలీదేవి, నాగేశ్వరరావు, ఎన్. టి. రామారావు, జూనియర్ శ్రీరంజని, జి. వరలక్ష్మి, శివరావు, రేలంగి, రామమూర్తి వగైరా నటులు తెరమీదికి వచ్చిన ఈ కొద్ది ఏళ్లకాలంలో సినిమా చిత్రాలు పాత బాక్సాఫీసు రికార్డులను ఏ విధంగా చించి చెండాడినదీ మనం చూస్తూనేఉన్నాం. ఇది కేవలం కాకతాళీయమని మనం భావించనవసరంలేదు. ఎందుకంటే ఈ కొత్త ముఖాలను విసర్జించి ఇంకా సినిమా రంగంలోఉన్న పాతముఖాలతోనే ఏదైనా చిత్రం తీసినట్లయితే ఆ చిత్రానికి వచ్చే రాబడి పూర్తిగా పాత రికార్డులప్రకారమే ఉంటుంది. ఈ సంగతి ప్రతి ప్రొడ్యూసరుకూ తెలుసు.

కొత్త ముఖాలను తీసుకురావటంలో ఇంకో సౌకర్యంకూడా ఉంది. సినిమాలు మనదేశానికి వచ్చి ఇరవై ఏళ్లు మాత్రమే అయింది. కాని ఒక్కసారి వెనక్కు తిరిగి చూసుకుంటే సినిమాసంగీతమూ, సినిమా సంభాషణలూ, సినిమా నటనా ఎన్నిరెట్లు అభివృద్ధి అయిందో ఎటువంటి కృత్రిమత్వం నుంచి ఎటువంటి సహజత్వానికి పరిణతి చెందిందో మనం సులభంగా తెలుసుకోవచ్చు. ఇప్పుడు పుట్టేవాళ్లంతా గొప్ప నటులూ, పాటకులూ అని కాదు. కాని ఒకతరంమీద ఒకతరం సులభంగా అభివృద్ధి చూపిస్తుంది. మన తొలి సినిమాతారలు స్టేజినటనా, స్టేజి సంగీతమూ మాత్రమే ఎరిగినవారు. వారిని చూసిన అనంతరం వచ్చినవారు వారికున్న కొంచెంముందుకు వెళ్లారు. మన సినిమానటులు నాలుగైదు దశలలో అభివృద్ధి సూచిస్తూ ముందుకు వచ్చారు. ఈనాటి తారలను చిన్నతనం నుంచీ చూసి, వారి పాట వినే పిల్లలలోనుంచి మరో పదేళ్ళలో వీరి తలదన్నినవాళ్లు తప్పక వస్తారు. అందుచేత నాలుగైదేళ్లకొకసారి కొందరు కొత్త నటీనటులు సినిమాలోకి అధికసంఖ్యలో ప్రవేశిస్తూ ఉండటం సినిమాపరిశ్రమకూ కళకూ కూడా చాలా మంచిది. దీనికి తార్కాణంగా మనం రంగారావునూ, జానకినీ, జోగారావునూ, మరికొంతమందినీ చెప్పుకోవచ్చును. కిందటేడే సినిమాలోకి వచ్చిన ఈ నటులలో పాతనటులలో లేని శక్తులు కొన్ని చూశాం. వీళ్లు కేవలం తమ వ్యక్తిత్వాన్ని పాత్రల వ్యక్తిత్వంకింద ప్రదర్శించటమేకాక తమది కాని వ్యక్తిత్వాన్ని పాత్రలకు ఇవ్వగలిగారు. ఈ విషయం రంగారావువిషయంలో పూర్తిగా రుజువయింది కూడానూ. అతను "షావుకారు' లో వేసిన రౌడీపాత్రా, "పాతాళభైరవి' లో వేసిన మాంత్రికుడి పాత్రా ఒకదానికొకటి భిన్నమైనవి. నిలబడటం మొదలు, వాలకమూ, భాషా, యాసా, మనస్తత్వమూ అన్నీ వేరే. ఒకడు పిరికివాడూ, తేలూనూ రెండోవాడు, ధీరుడూ, భయంకరుడూ, సింహమూనూ. జానకికూడా "షావుకారు"లో సుబ్బులుపాత్రకుపూర్తిగా భిన్నమైనపాత్రలను, తెరమీద కాకపోతే రేడియోలో, అనేకపర్యాయాలు నిర్వహించి ఉన్నది. దీనినిబట్టి ఈ శక్తిగల నటులు ఒక్కొక్కరూ అనేక భిన్నపాత్రలను ప్రదర్శించి సినిమా తెరకు అపారమైన కొత్తదనం చేకూర్చగలరు.

కొత్త ముఖాలవల్ల మూడో ప్రయోజనం కూడా అతి ముఖ్యమైనది. చిత్ర నిర్మాణం అపారంగా పెరుగుతున్నది. నిర్మాణమైన చిత్రాలలో సగానికిపైగా దెబ్బ తినటం చూస్తూకూడా సాహసవంతులైన ధనికులు చిత్రనిర్మాణంలోకి ప్రవేశిస్తూనేఉన్నారు. బాక్సాఫీసులు "పగలగొట్టే" తారలు కొద్దిమందే కావటంవల్లా, చాలామంది కొత్త నిర్మాతలకు కొత్తముఖాలను తెచ్చే ధైర్యసాహసాలు లేనందువల్లా ఉన్న తారల రేటు విపరీతంగా పెరిగిపోవటమే గాక, ఒక్కొక్క తారా అనేక చిత్రాలలో బుక్కావటం జరిగి ఏ రేటుకూ కూడా వారిని మరికొన్ని చిత్రాలలో బుక్ చెయ్యటం కూడనిపనిగా పరిణమిస్తున్నది. అందుచేత సాహసవంతులైన కొద్దిమంది చిత్రనిర్మాతలయినా కొత్తముఖాలనుతీసుకు

రావటం తప్పనిసరి అవుతున్నది. ఈ కొత్త ముఖాలతో తీసే చిత్రాలు అంతో ఇంతో చౌకగా పూర్తికావటమేగాక పాత ముఖాలతో తీసిన చిత్రాలకన్న ఇవే ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి. ఇటీవల విడుదలైన ఒక చిత్రంలో చాలా కొత్త ముఖాలుండి కూడా అది గొప్పగా విజయం పొందటమే గాక అందులోని పాతముఖాలకన్న కొత్త ముఖాలే ప్రేక్షకులను చాలా బలంగా ఆకర్షించినట్లు కూడా స్పష్టమవుతున్నది.

మరొక్క విషయం. కొత్త ముఖాలు అప్పుగా తెరమీద కనిపించే నటులనే కానవసరంలేదు. తెరవెనక నుండి చిత్రానికి ప్రాణంపోసేవారినిఏమైనా మనం హర్షించవలసిందే. ఉదాహరణకింద చాలా మందిని పేర్కొనవచ్చును. 1950 లో చిత్రనిర్మాతలుగా వచ్చినవారిలో బి. ఏ. సుబ్బారావు, నాగిరెడ్డి-చక్రపాణీద్వయమూ కూడా ప్రజలను కొత్తరకం చిత్రాలిచ్చి ప్రజాదరణ సంపాదించారు. స్క్రిప్టు రచయితగా చక్రపాణి "షావుకారు" లో కొత్త రకం సృష్టి చూపాడు. తెలుగు తెరమీద ఎన్నడూ లేని పాత్రరచనా, సంభాషణలూ, వాతావరణమూ ఆ చిత్రం చూపింది. మొట్టమొదటి సారిగా సంగీతదర్శకత్వం "ద్రోహి" తో ప్రారంభించిన పెండ్యాల నాగేశ్వరరావు సినిమాప్రేక్షకులను కొత్తరకం సంగీతంతో ఆనందపరిచారు. అట్లాగే "పాతాళభైరవి"కి ఆర్టు డైరెక్షను చేసిన గోఖలే తన శిల్ప ప్రభావంతో మాయగాలు ప్రేక్షకులను కూడా బలంగా ఆకర్షించారు. కొత్తదనం మాటకు వస్తే ప్లేబాక్ పాటలలో కొత్త మాధుర్యం తెచ్చిపెట్టిన పి. లీలను కూడా పేర్కొనవలసిందే.

రాజకీయాలలోనే గాక కళారంగంలో కూడా ఈనాటి ప్రజాజీవితం పరుగులు తీస్తోంది. జీవితం కోరే శీఘ్రపరిణామాలు సినిమా కళలో కూడా జరగాలంటే కొత్త ముఖాల అవశ్యకత నానాటికి హెచ్చుతుందిగాని తగ్గదు. ★



'మంజరి' చిత్రంలో ఒక రసవత్తర సన్నివేశం



★ శ్రీమతి లక్ష్మి ★

అంతా ఘటన

"రాధానాథశాస్త్రి" (పెద్దకథ)

4

తను వేసిన పాచిక పారుతుందని కామయ్యగారు ఆశపడ్డారు. తన వుత్తరం అందగానే వియ్యంకుడు రామయ్యగారు బేషరతుగా లొంగిపోయి కాళ్లమీద పడి దాసోహంఅంటాడని ఊహించాడు. ఆడపిల్లనిచ్చుకున్నవాడు లొంగిరాక ఏం చేస్తాడని ధీమాగా అనుకున్నాడు. కాని ఎన్నాళ్లకి కమల జాడ జవాబూ లేకపోయేసరికి కామయ్యగారికి పట్టలేని అహంకారం వచ్చింది. ఇక కొడుకుకాపురం దారిన పడే యోగ్యత లేదని తెలిసిపోయింది. ఏమైనాసరే కొడుక్కి ఇంకోపెళ్ళి చేసి తీరాలి. అప్పటికాని వియ్యంకుడు రామయ్యగారు అణగడు అని తీర్మానించుకున్నాడు. కామయ్య తీర్మానాన్ని కాదనగలవారు ఇంతవరకూ పుట్టలేదు. ఈసంగతి తనే దామోదరంచెవిన వేశాడు. తండ్రి మాటలు విని కొడుకు గంగిరెద్దులాగా తలకాయ ఆడించాడు.

కాని కామయ్యగారికి ఒక్క ఆలోచన మటుకు తెగకుండా వుంది. తనకి చిన్నప్పటినుంచీ మనసులో ఒక కోరిక వుంది. తన కొడుకుని లండను పంపించి బారిష్టరు చదివించాలని కామయ్యగారు ఎన్నాళ్లనుంచో కలలు కంటున్నాడు. తనలాటి మోతుబరిమనిషికి కొడుకుని చదువుకి లండను పంపటం చాలా అవలీల. అందులో దామోదరం లా డిగ్రీ పుచ్చుకుని ఓడ ఎక్కటానికి సిద్ధంగా వున్నాడు. అప్పటికే పాస్‌పోర్టుకి ప్రయత్నాలన్నీ జరిగినై. ఇక ప్రయాణం స్థిరంచేసుకోటమే తరువాయి. లండనుకి వెళ్లేముందే కొడుక్కి ఇంకో పెళ్లిచెయ్యటం మంచిదా, తిరిగొచ్చినాక చేస్తే మంచిదా అనే సమస్య కామయ్యగారికి ఎటూ తెగకుండా వుంది. ఈవిషయంలో కామయ్యగారు ధర్మపత్ని సలహా కూడా తీసుకోవలసివచ్చింది. ఆవిడ ఈ సమస్యని సవ్యంగా పరిష్కరించింది. కొడుక్కి మళ్లీ పెళ్లి సీమనుంచి తిరిగివచ్చాక చేస్తేనే బాగుంటుందని ఆవిడ ఖచ్చితంగా తేల్చివేసింది. ఎందుకంటే సీమగాలి తగిలేసరికి కుర్రాళ్ల తత్వం ఫిరాయిస్తుందిట. సీమనుంచి ఇంటిముఖం పట్టేప్పుడు కుర్రాళ్లు నాటుదొరలుగా తయారైపోయి కూడా ఒక తెల్లదొరసానిని వెంటపెట్టుకు రావటం పరిపాటి అయింది. ముందే ఇంకో పెళ్లి చేస్తే దామోదరంకూడా అందరిలా దొరసానిని వెంటవేసుకొస్తే కొత్తకోడలు యావజ్జీవమూ తమప్రాణాలకి ఉసూరుమంటూ వుంటుంది. ఎందుకైనా మంచిది, తిరిగి వచ్చాకనే పెళ్లిమాట ఆలోచించటం మంచిదని కామమ్మగారు అనేసరికి కామయ్యగారు కాదనలేక పోయారు.

తత్ఫలితంగా తరవాత కొద్దిరోజుల్లోనే దామోదరం బారిష్టరుచదువుకోసం సీమకి తరలివెళ్లటం జరిగింది. బారిష్టరుపార్వతీశంగారి లండనుప్రయాణానికి దామోదరంగారి లండను ప్రయాణం వీసంకూడా తీసిపోదని చెబితే ఒక్కముక్కలో సరిపోతుంది. అందుకే దామోదరం ప్రయాణసన్నాహం, దారిలో అనుభవాలూ పూర్తిగా మీవూహలకే వొదిలేస్తున్నాను.

దామోదరం లండనువెళ్లిన సంగతి ఆనోటా ఆనోటా పడి కమల తల్లిదండ్రుల దాకా పాకింది. అది వినగానే కమల జీవితం కుదుటపడుతుందేమో ననే ఆశలన్నీ హారతికర్పూరంలాగా హరించిపోయినయ్. "అదే నాకు కొడుకూ కూతురూను" అని మరికొంచెం గట్టిగా అనుకున్నాడు రామయ్య. ఆయనభార్య మాత్రం చాటుగా కళ్లు తుడుచుకుంది.

ఈ సంగతి కమలకి కూడా తెలిసింది. అది విన్న క్షణంలో కమల తల తిరిగిపోయింది. తన జీవితం దారీ తెన్నూ లేని సముద్రం పరవడిలో దిక్కు తెలియక కొట్టుకుంటున్న నావలాగా కనిపించింది. భావిజీవితమంతా అర్థంకాని అయోమయంగా తోచింది. "ప్రభూ! నే నేం తప్పు చేశాను? నా కెందుకీ శిక్ష?" అని మౌనంగా కన్నీళ్లతో దీనంగా వేడుకున్నది. కొండంత బరువు వచ్చి కమలగుండెలని అణగదొక్కింది. తను బతుకుబాట అంతా కటికచీకటులతో అలుముకుపోయినట్లు తోచింది. ఏనాటికైనా తన కాపురం ఒకదారిన పడుతుందేమో ననే ఆశ ఆనాటితో కొంత కెక్కింది. "కమలా నువ్వు సుఖపడటానికి పుట్టలేదు. కష్టాలతో పోరాడటానికే పుట్టావు" అని ఎవరో లోపల్నుంచి గొంతు చించుకుని అరిచినట్లు వినిపించింది. కన్నీళ్లు తుడుచుకుని నిదానంగా లేచి నిలబడింది. ఎదురుగా గోడకి వేలాడుతున్న బాపుజీ బోసి నవ్వు పటంకనిపించింది. బేలగా కన్నీళ్లు కారుస్తున్న కమలని ఒక్క నిమిషంలో అచంచలమైన ఆత్మవిశ్వాసంవచ్చి ఆవరించింది. తను బతికి వున్న సంగతి కూడా గుర్తించకుండా, తనకి వుత్తరంముక్కయినా రాయకుండా భర్త లండను వెళ్లినందుకు కమల ఎంతో క్షోభపడింది. కాని తన తప్పేమీ లేదని తెలుసుకుని కమల ధైర్యం తెచ్చుకుంది. నిబ్బరంగా నిదానంగా ఆలోచించింది. తన జీవితం నిష్కళంకంగా గడుపుతుంది. తన మనస్సుని నిశ్చలంగా చదువుమీదికి ప్రసరింపజేస్తుంది. అకారణంగా తనని బాధలు పాలుచేస్తున్న అత్తమామలమీద ఆధారపడకుండా తనకాళ్లమీద తాను నిలబడటానికి కృషిచేస్తుంది. ధైర్యంగా జీవితసమస్యలని ఎదుర్కొంటుంది. ఏమైనాసరే ఇకనించీ తన గతజీవితాన్ని గురించి విచారించి పిరికిపందలాగా కళ్లనీళ్లు పెట్టుకోరాదని కమల మనస్సుని గట్టిచేసుకుంది.

దీనస్థితిలో అబలగావున్న కమలహృదయంలో ఆ నిమిషంలో ఏదో అద్భుతమైన ఆత్మశక్తి వచ్చి ప్రవేశించింది. ఆ నిమిషంలో కమలకి భవిష్యత్తునిగురించిన భయం మటుమాయమయింది.

ఏది ఎలా జరగనున్నదో అల్లాగే జరుగుతుంది. తనుమాత్రం అనవసరంగా ఆందోళనపడి లాభం లేదని కమల గ్రహించింది.

5

కూతురు కాపురాన్ని గురించి రామయ్యగారు విచారించటం పూర్తిగా మానేశారనే చెప్పవచ్చు. అల్లుడు లండనునుంచి తిరిగి వచ్చినాకఅయినా కమలకాపురం కుదుటపడటం కలలోమాట అని ఆయనకి ఎన్నడో తెలిసిపోయింది. అదీకాకుండా ఏళ్లు పైబడుతున్నకొద్దీ మనిషిలో వైరాగ్యం కూడా ముదురుతోంది. పగలంతా గీతాపారాయణంతోనూ, రాత్రి పడుకోబోయేదాకా భాగవతంలోని పద్యాలు వల్లిస్తూనూ గడిపివేస్తున్నాడు. కమల భావిజీవితాన్ని గురించి తను బాధపడి ఆలోచించి లాభం లేదని మనస్సులో గట్టిగా నిశ్చయించుకున్నాడు. ఎప్పుడైనా ఊరుకోలేక భార్య కళ్లనీళ్లు పెట్టుకుంటే రామయ్యగారు

"నీ కేం పిచ్చా? మనచేతుల్లో ఏముంది? ఎట్లా రాసి పెట్టివుందో అట్లాగే జరుగుతుంది. ఎవరికర్మకి ఎవరు కర్తలూ? సుఖపడుతుందనే సంబంధం కుదిర్చి పెళ్ళిచేశాం. ఇట్లా అవుతుందనుకున్నామా?" అని బదులు చెబుతారు. ఈ జవాబుతో తృప్తిపడక కేవలం సాంసారిక ధోరణిలో ఆయనభార్య "పిల్లని తీసుకుని మీరొకసారి ఎందుకు వెళ్ళరాదూ?" అని అడగటమూ అర్థమైన చివాట్లుతినటమూ జరుగుతూవుంది. ఇట్లాగే కాలం దొర్లుకుపోతోంది.

దామోదరం చదువు పూర్తిచేసుకుని బారిష్టరు డిగ్రీతో సీమనుంచి నాటుదొర వేషంతో తిరిగివచ్చాడు. బారిష్టరుడిగ్రీతో పాటు పెదవులమధ్య బారుచుట్ట చర్చిల్‌లాగా కాలుస్తూ ఇంటికి తిరిగివచ్చాడు. దొరసానిని వెంటబెట్టుకు రానందుకు తల్లిదండ్రులు చాలా సంతోషించారు. మనవాడు ఎంత బుద్ధిమంతుడోకదా అని ఉబ్బి తబ్బిబ్బయిపోయారు. సీమకివెళ్ళి రావటంవల్ల దామోదరం వేషభాషల్లోకొంత మార్పు వచ్చినమాట నిజమే. ఎప్పుడూ చెక్కుచెదరని సూటూ, పాలిష్ చెరగని బూటూ, టిక్ టాక్‌గా వుంటాడు. తల్లిదండ్రులముందు కూడా నిర్భయంగా గుప్‌గుప్‌మని పొగవొదులుతూ చుట్ట తరవాత చుట్ట వెలిగించే నిరతాగ్నిహోత్ర తత్పరుడుగా మారిపోయాడు. మునుపు ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసినచోటే వున్నానన్నట్లుగా వుండేవాడు. ఇప్పుడు చలాకీగా మాట్లాడటం, చురుకుగా కదలటం నేర్చుకున్నాడు. ఈ హడావిడిఅంతా చూసి తల్లిదండ్రులు లోలోపల కొంచెం భయపడటం మొదలుపెట్టారు. గిరిగీసి కంచో బెడితే కదలకుండా నిలబడే దామోదరం సీమవాసనలవల్ల చెప్పినమాట వినకుండా పోతాడేమోననీ, తమ మాటకాదని కమలనే కాపురానికి తీసుకొస్తానంటాడేమోననీ లోపల బెదిరిపోతున్నారు.

నిజంగా కమలే కాపురానికి వస్తే తమకి శిరచ్ఛేదంగా వుంటుంది. ఆయింట్లో తమకి క్షణంకూడా నిలిచే ఆస్కారం వుండదు. అందుకని ఎట్లాగైనా సరే దామోదరంమనస్సు కమలమీదికి పోకుండా చెయ్యాలని తల్లిదండ్రు లిద్దరూ ఆలోచించారు. దీనికి ఒక్కటే మార్గం వుందని గ్రహించారు. ఎక్కడో ఒకచోట ఏదో ఒక సంబంధం చూసి సాధ్యమైనంత త్వరలో ముడిపెట్టేస్తే చిక్కు తీరిపోతుందని తీర్మానించారు. అంతేకాకుండా దామోదరం లండను వెళ్ళినప్పుడు కమలనిగురించి చాలా చెడ్డసంగతులు విన్నామనీ, అటువంటి అమ్మాయి కోడలని చెప్పుకోటమే తమకి నామర్దాపని అనీ కొడుకు చెవులో గూడు కట్టుకుని గోజిల్లటం సాగించారు. అసలే కమలమీద మమకారంలేని దామోదరం ఈ మాటలు వినగానే భార్యని తన ఊహలలోంచి దూరంగా తరిమివేశాడు.

దామోదరం సీమకి వెళ్ళినట్లు వాళ్ళవల్లా వీళ్ళవల్లా ఎట్లా తెలిసిందో తిరిగి వచ్చినట్లు కూడా అట్లాగే తెలిసింది కమల తండ్రి రామయ్యగారికి. తిరిగి వచ్చినట్లు ఉత్తరమైనా రాయనందుకు మనస్సులో చాలా నొచ్చుకున్నారు. "వాళ్ళకి ఏం అపకారం చేశామని ఇన్నివిధాల వేధించుకు తింటున్నారు?" అని తల్లి కళ్ళనీళ్ళు కుక్కుకుంది. "బంగారంలాటి పిల్లని ఇవ్వటమే మనం చేసిన అపరాధం" అని రామయ్యగారు కోపంతో పళ్ళుకొరికాడు. "ఇక మాటిమాటికీ అడగను. ఇది ఆఖరుసారి. ఒక్కసారి ఇద్దరం పిల్లని తీసికెళ్ళి అటో ఇటో తేల్చుకువద్దాం పదండి" అంది భార్య. రామయ్యగారు అగ్గిలాగా మండిపడి "నా ప్రాణం వుండగా ఆ వెధవగడప తొక్కుతానా? నాపిల్ల నాకు బరువౌతుందా?" అన్నాడు ఉగ్రంగా. "కాదండీ. అనవసరమైన పట్టుదలకి పోతే పిల్లగతి ఏమవుతుందో ఆలోచించండి. దాని ఈడువాళ్ళంతా ముచ్చటగా కాపురాలు దిద్దుతూ పిల్లలతల్లులవుతుంటే మన పిచ్చితల్లి ఒక యోగినిలాగా పుస్తకాలకి అంటుకుపోయివుండటం చూస్తుంటే కడుపు తరుక్కుపోవటం లేదా?" అని కళ్ళు తుడుచుకుంటూ అడిగింది. రామయ్య "ఓసి పిచ్చిదానా? మన చేతులో ఏముందే? మనం కేవలం నిమిత్తమాత్రులమే" అనేసరికి భార్య రోషంతో "కట్టిపెట్టండీ మీ ముష్టి వేదాంతాలు. పట్టుదలకి పోయి కన్నబిడ్డ కాపురం పాడు చేసుకుంటారా?" అంది.

"ఛీ దుర్మార్గురాలా! ఎంత మాటన్నావ్? నావల్లదాని కాపురం పాడవుతోందా? అది దాని గీత, దానికర్మ. ఇదుగో ఇక నేనీ యింట్లో క్షణం కూడా వుండను. పోయి సన్యాసం పుచ్చుకుంటాను" అని ప్రచండమైన కోపంతో జందెం పటపట తెంపేసి పెళ్ళాంమెళ్ళో చుట్టి వెళ్ళిపోవటానికి లేచివాకిట్లోకి వచ్చేసరికి గుమ్మంముందు బండీ ఆగింది. కమల బండీలోంచి దిగింది. కన్నం తవ్వుతుండగా పట్టుబడిన దొంగలాగా రామయ్యగారు ముఖం చిన్నబుచ్చుకుని "వచ్చావామ్మా. ఉత్తరమైనా రాశావు కావేం?" అంటూ ఇంట్లోకి వెళ్ళాడు.

కమల మనస్సు నొచ్చుకుంటుందేమోనని రామయ్యగారు మనస్సు మార్చుకుని తిరిగి ఇంట్లోకి వెళ్ళాడు. కాని లేకపోతే ఇల్లు విడిచి వెళ్ళిపోయేవాడే. ఆయన చేసిన హంగామాఅంతా చూసి భార్య ఇంకెప్పుడూ భర్తతో ఈ ప్రసక్తి తీసుకురాకూడదని మనస్సులో గట్టిగా నిశ్చయించుకుంది. ఆయన అన్నంత పనీ చేసి తీరే మనిషి అని ఆవిడకి ఎన్నడో తెలిసివచ్చింది.

అనుకోకుండా కమల ఇంటికి రావటంవల్ల విషాదాంతంగా పరిణమించవలసిన నాటకం మధ్యలోనే ఆగిపోయింది.

తన భర్త సీమనించి తిరిగి వచ్చినట్లు విని కమల క్షణంసేపు చలించింది. సీమగాలి తగలటంవల్ల అతని మనస్సు మారిందేమో? అతనికి తనమీద దయకలిగి కాపురానికి తీసికెళ్తాడేమోనని ఆశపడింది. కాని తనలాటి దీనురాలి జీవితానికి అంత అదృష్టం కూడానా? తన ఎడారి బతుకులోకి వసంతం ఎందుకు తొంగి చూస్తుంది?

6

కామయ్యగారి కోరిక చివరికి నెరవేరింది. ఘనకార్యం సాధించినవాడిలాగా విజయగర్వంతో పొంగిపోయాడు. దామోదరానికి మళ్ళీ పెళ్ళి చేసేశాడు. అతని జీవితంలోకి మళ్ళీ కమల అడుగుపెట్టే వీలులేకుండా దారులన్నీ మూసేశానని మురిసిపోయాడు. పెళ్ళిపందిట్లో వియ్యంకుడు రామయ్యమీద విసిరిన సవాలు ఈనాటికి కార్యరూపం ధరించినందుకు కామయ్య లోపల చాలా సంతృప్తి పడ్డాడు. కమలమీదా వియ్యంకుడిమీదా తను కత్తిదూసినందుకు ఈనాటికి ఘనవిజయం సాధించి తన ప్రతిష్ఠని నిలబెట్టుకున్నాడు. ఆయన పుత్రరత్నం దామోదరం మంచి పిల్లవాడిమాదిరిగా చెప్పినమాటవిని మళ్ళా పెళ్ళిపీటల మీద కూచుని ఇంకోసారి పుస్తెకట్టి తల్లిదండ్రులని ఆనందసాగరంలో ఓలలాడించాడు. "నూరేళ్ళు వర్ధిల్లు నాయనా" అని కామయ్య ఈసారి మనసారా కొడుకుని దీవించాడు. కొత్తకోడల్ని చూసి మామగారూ అత్తగారూ ఉబ్బి తబ్బిబ్బయిపోయారు. కోడలు రూపసి. నిజంగా మెరుపుతీగలాటి సుందరి. పైగా ఎస్. ఏ. కూడా పాస్ అయింది. అంతేకాకుండా సంగీతం కూడా పాడుతుంది. ఈ సంబంధం ఎవరైనా గిట్టనివాళ్ళు కాకుండా చెడగొడతారేమోనని కామయ్యగారు పెళ్లి అయేదాకా రెండో కంటికి తెలియకుండా గుట్టుగా వ్యవహారమంతా నడిపారు. పెళ్ళి

కూతురు చిన్నతనంలోనే తల్లీ దండ్రులని కోలుపోయింది. మేనమామయింట్లో పెరిగింది. ఆయనే అతికష్టంమీద ఎఫ్. ఏ. దాకా చదివించి ఎక్కడ వరుడు దొరుకుతాడా, ఎప్పుడు నెత్తిమీది బరువు తగ్గుతుందా అని అతి తొందరపడిపోయాడు. పిల్ల అందకత్తె. విద్యావంతురాలు. కాని తను కానీ కూడా కట్నం ఇవ్వడు. మరి పెళ్లి ఎల్లా అవుతుందా అని ఆరాటపడ్డాడు. పెళ్ళిళ్ల పేరయ్యా ధర్మమా అని దామోదరం సంబంధం కుదిరింది. లండను వెళ్ళి బారిష్టరుపట్టా పుచ్చుకు వచ్చిన వరుడు కానీ కట్నం కూడా అక్కర్లేకుండా దొరకటం తన అదృష్టమని మేనమామ పడ్డ సంతోషానికి అంతు లేదు. ఇటువంటి వరుడు ఇంతచౌకగా దొరకటం నమ్మశక్యం కాని సంగతి అని ఆశ్చర్యపడ్డాడు. "నాయనా! మాకు ఇంత తినేందుకూ పదిమందికి పెట్టేందుకూ వుంది. ఇంకా కట్నంతో నిమిత్తమేముంది? ఈ కట్నాల వల్ల ఎన్నికుటుంబాలు నాశనమైపోతున్నయ్యో!" అని కామయ్యగారు తనకి ధనంమీద కామం లేనట్లు చాకచక్యంగా నటించి మూడుముళ్లూ పడినయ్ అనిపించాడు.

ఇల్లలకగానే పండగా? పెళ్లికూతురికి వాళ్లూ వీళ్లూ తలోకమాట చెవినివేసి చెడగొడతారేమో? అయినవాళ్లకి ఆమడదూరంలో వుండటం మంచిది. అందుకే మూడునిద్రలూ కాగానే కోడల్ని కొడుకునీ తీసికెళ్లి మద్రాసులో కాపరం పెట్టించాను. అక్కడికి పనికట్టుకుని వెళ్లే చుట్టాలు ఎవరుంటారు? హాయిగా కాలక్షేపం చెయ్యొచ్చు. దామోదరం హైకోర్టులో ప్రాక్టీసు చేస్తాడు. అదృష్టం కలిసివస్తే బాగా సంపాయిస్తాడు. సంపాయించకపోయినా దిగులు లేదుగా? కొన్ని తరాల వరకూ కడుపులో చల్ల కదలకుండా గడిచిపోయేటంత ఆస్తివుంది. బంధువులకి దూరంలో వుంటే అన్ని విధాలా మంచిది. కామయ్యగారి బుద్ధి చాకులాటిది. ఆయన ఘటనాఘటన ధురీణుడు. దామోదరం జీవితఫలకంలోనుంచి గతకాలపు ఛాయలన్నీ చెరిపివేయటానికి చేయగల పనులన్నీ చేశాడు. భూతకాలపు పెనుభూతాలు జొరలేని దుర్భేద్యమైన కోటను రెండో పెళ్లి చేసి నిర్మించాడు. ఇక దామోదరం జీవితం నిత్యకళ్యాణంపచ్చతోరణంగా గడిచిపోతుందని ఆశపడ్డాడు. పట్నంలో కాపురం పెట్టి ఇంటికి తిరిగిపోతూ కామయ్య కోడలిని నిత్యసౌభాగ్యవతిత్వ వర్ధిల్లమని దీవించి మరీ వెళ్లాడు. ఈనాటికి దామోదరం ఒక ఇంటివాడయాడని ఇక దామోదరం కుటుంబ జీవనస్వర్గంలో స్వైరవిహారం చేస్తాడనీ, ఇక తనపని తీరిపోయిందనీ కామయ్య లోలోపల పొంగిపోయాడు. ఇన్నాళ్ల నుంచీ అకారణంగా బుసకొట్టి కమల కాపురాన్ని నాశనంచేసిన విషసర్పం పడగ ముడుచుకుని పుట్టలోకి తిరిగి వెళ్లిపోయింది.

మనిషి అతిరహస్యంగా దాచదలచుకున్న విషయమే అతి తొందరగా నలుగురి నోళ్ళలోనూ పడిపోతుంది. దామోదరం రెండో పెళ్లివుదంతం చకచకా పాకిపోయింది. పెళ్లి కాగానే కొత్తకోడలి ముఖమైనా నలుగురికీ చూపకుండా మునిగిపోయినట్లు పట్నంలో కాపురం పెట్టించినందుకు లోకులు కామయ్యని ఎంతో కంటగించుకున్నారు. ఈ సంగతి వియ్యంకుడు రామయ్యకి తెలియటానికి ఎంతో కాలం పట్టలేదు. ఇంతపని జరుగుతుందని ఆయన ఎన్నడూ అనుకోలేదు. పిడుగు దెబ్బకు కూలే తాటి చెట్టులాగా ఈకబురు వినగానే నేలకి వాలిపోయ్యాడు. ఆయన భార్య కడుపుమంట పట్టలేక తెలుగు భాషలో వున్న తిట్లన్నీ వియ్యాలవారిమీదికి ప్రయోగించింది. ఉత్త బెదరింపులనుకున్నారు కాని అన్నంతపనీ కామయ్య చేసితీరే ఘటం అని వాళ్లనుకోలేదు. కమల కాపరం ఎల్లాగో ముక్కచెక్కలై పోయింది. కాని వియ్యాలవారిని ఇంతటితో విడిచిపెట్టకూడదు. వాళ్లకి తగిన శాస్తిచెయ్యాలి. కసి తీర్చుకోవాలి. మూడు చెరువులనీళ్లు తాగించాలి అని రామయ్య రగిలిపోయే కోపంతో లేచి నిలబడ్డాడు. ముఖం జేవురించిపోయింది. మనిషి వణికిపోతున్నాడు. "నాన్నా నేను ఫస్టుక్లాసులో పాస్ అయాను" అంటూ కమల వచ్చి పేపరు తండ్రికి సంతోషంతో అందించి తండ్రి ముఖం చూసి నివ్వెరబోయింది. "అయ్యొ వెర్రితల్లీ!" అంటూ తల్లి కమలని కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది. అంతా అయోమయంగా వుంది కమలకి. అసలుసంగతి తండ్రి పెల్లిగా బైట పెట్టాను. కమల తొణకలేదు, నిబ్బరంగా నిలబడింది. విగ్రహంలాగా నిలబడింది. ముఖంలో రంగుకూడా మారలేదు. ఇది చూసి రామయ్య ఆశ్చర్యంతో కూడిన దుఃఖంలో "తల్లీ! చేతులారా నిన్ను కష్టాలపాలు చేశానమ్మా" అని కళ్లు తుడుచుకున్నాడు. "విచారపడకు నాన్నా. నీ తప్పేముంది?" అని గంభీరంగా అంది కమల. "వాళ్లని ఇంతటితో వదిలిపెడితే నేను రామయ్యని కాను. వాళ్లని కోర్టు చుట్టూ తిప్పి తిప్పి చంపకపోతే నాపేరు మారుపేరు పెట్టు" అంటూ వెళ్లిపోయాడు.

కమలకళ్ల ముందునుంచి గతమంతా ఒక మంచుతెరలాగా తొలగిపోయింది. భావిని గురించిన ఆలోచనలతోనే ఆమె మనస్సు నిండిపోయింది. భవిష్యత్తులో తన జీవితాన్ని ఏదైనా మహత్కార్యానికి నివేదించాలని కమలకి ఎన్నాళ్లనుంచో కుతూహలం. ఆ కుతూహలం నెరవేరటానికి వున్న ఒక్క అవరోధమూ ఇవాళ తొలగిపోయింది. తన జీవితవాహిని ఏదారిన ప్రవహించాలా అని కమల ఆలోచించసాగింది. ఈ దరిద్రదేశంలో అంతా కుటుంబపు కూపాలలో దిగబడ నవసరంలేదని తోచింది. అంతా ఇల్లు చక్కదిద్దే ఇల్లాళ్లు కానక్కరలేదు. అంతా పిల్లల్ని కనిపెంచే తల్లులే కానక్కరలేదనిపించింది. అవును. తన జీవితానికీ తగిన విలువవుంది. తను చెయ్యవలిసిన పనీ చాలా వుంది. అందుకోసమే దైవం తనని వివాహశృంఖలలోంచి విడిపించి స్వేచ్ఛ ఇచ్చాడనిపించింది.

ఆ మర్నాడే కమల తన ఆదర్శాలకి ఆకారం కల్పించాలని పూనుకుంది. వూళ్లో బీదపిల్లలందరినీ పోగుచేసి వాళ్లకిఉచితంగా చదువు చెప్పాలని నిశ్చయించి తన ఇంట్లోనే చిన్నబడి పెట్టింది. వాళ్లకి పలకలూ, పుస్తకాలూ, కుట్టుదారాలూ, సూదులు తనేకొనియిచ్చింది. వాళ్లకుమంచి నడవడీ, మంచి బుద్ధులూ, మంచి ఆశయాలూ అలవరచి వాళ్ల భావిజీవితాలని తీర్చిదిద్దాలని కమల సంకల్పించుకుంది. ఈ ఆశయాలని ఆమె తల్లిదండ్రులు కూడా ఆమోదించారు. ఈవిధంగా కమల తన కష్టాలని మరిచిపోతుందని వాళ్లు సమ్మతించారు.

కాని రామయ్యగారి పగ తాచుపాము పగ. అది తీరేదాకా ఆయనకి నిద్రపట్టదు. ఊళ్లోనల్లకోటు వేసిన ప్రతిలాయర్నీ సంప్రదించాడు. వాళ్ల సలహా సంప్రతింపులు పూర్తిగా పొంది ఒక మేధావియైన వకీలు చేత తన కూతురుతరఫున కోర్టులో దావా దాఖలు చేస్తానని బెదిరిస్తూ బ్రహ్మాస్త్రంలాగా పనిచేసే రిజిష్టరునోటీసొకటి దామోదరంమీదికి వొదిలి ఫలితంకోసం ఎదురు చూస్తున్నాడు. తనబతుకు కోర్టుకి ఎక్కటం కమలకి ఇష్టంలేదు. కాని తండ్రిని వారించలేకపోవటంవల్ల మెదలకుండా వూరుకుంది. తనకి భర్త మనోవర్తి ఇచ్చినా ఇవ్వకపోయినా అన్నవస్త్రాలకి ఎన్నడూ కొరతలేదు. కాని రామయ్య పట్టుదల మనిషి. వియ్యాలవారి గూబలుదలిపి రావలి

సినదంతా రాబట్టి అందులో ఒక్క దమ్మిడీ అయినా ముట్టుకోకుండా ఏదైనా అనాథ శరణాలయానికి ధర్మం చెయ్యాలని ఆయన పూనిక. డబ్బుకోసం కాదు. తనకూతురి కాపురం తీసినందుకు కామయ్యకి తగిన శాస్తిచేసి నలుగురిలో ఛీ అనిపించి వొదలాలని ఆయన పట్టుదల. ఎత్తుకి పైయెత్తు వేసి కామయ్యతనని చిత్తుచేయగల వ్యవహర్త అని వెర్రి బ్రాహ్మడు రామయ్యకేం తెలుసు? తను ప్రయోగించిన అస్త్రానికి భూనభోంతరాళాలు తలకిందులైపోతే అని ఆశపడ్డాడు. ఇంక మళ్లీ నలుగురిలో కామయ్య తలఎత్తుకుని తిరగకుండా చెయ్యాలని పట్టుపట్టాడు.

దామోదరం కొత్తకాపురం వాలుగాలికి తెరచాప ఎత్తి సాగిపోయే నావలాగా వుంది. ఇన్నాళ్లూ తల్లిదండ్రుల అదుపాజ్ఞలలో అతని వ్యక్తిత్వం అణగారిపోయింది. అతనికి ఏవిషయంమీద సొంతఅభిప్రాయం లేదు. ఏదీ స్వతంత్రంగా ఆలోచించలేడు. అతని స్వభావానికి ఒక స్వరూపం అంటూ లేదు. నీళ్లు కూజాలో పోసినప్పుడు కూజా ఆకారంగానూ కుండలో పోసినప్పుడు కుండ రూపంగానూ కనబడినట్లే అతని స్వభావం ఎవరి అదుపులోవుంటే వాళ్లనిబట్టి మారుతుంది. ఇప్పుడతను కేవలం కొత్త భార్య చరణ చారణ చక్రవర్తి. ఆవిడ అభిరుచులే అతనివి; ఆవిడఇష్టాలే అతనివి. అతనికి ఇంగ్లీషు సంగీతం వినాలనివున్నా ఆవిడ ఇష్టప్రకారం తెలుగుసంగీతమే వింటాడు. అతనికి సూటుమీద మోజుగా వున్నా ఆవిడకి నచ్చినట్లు లాల్చీ వేసుకుని గ్లాస్గో పంచ కట్టుకుంటాడు, ఇంట్లో వున్నప్పుడు. అన్ని విషయాలూ అరమరిక లేకుండా, దాపరికం లేకుండా భార్యకి చెప్పేస్తాడు. కాని ఆనాడు పోస్టులో వచ్చిన రిజిస్టరుకవరులో సంగతులు మాత్రం అతిగుట్టుగా వుంచాడు. వెంటనే తండ్రికి వుత్తరం రాశాడు. ఆనాడల్లా కాళ్లకింద ఏదో అగ్నిపర్వతం బద్దలు కావటానికి సిద్ధంగా భగభగమంటున్నట్లనిపించింది. అతనిముఖం అతనికి తెలియకుండానే వివర్ణమైపోయింది. ఏదో భయం ఏదోబాధ వచ్చి అతనిముఖాన్ని కమ్మివేసినయ్. "ఏమండీ అల్లా వున్నారేం? వొంట్లో బాగా లేదా?" అని భార్య అడిగింది. "అబ్బే ఏం లేదు. మామూలుగానే వున్నాను" అని లేని వుత్సాహాన్ని ముఖంలో మెరిపించాడు.

7

అల్లుడిమీద తను ప్రయోగించిన బ్రహ్మాస్త్రానికి ఇటువంటి విపరీతమైన ఫలితం ఎదురవుతుందని రామయ్య ఎన్నడూ వూహించలేదు. ఇటువంటి సమాధానం వస్తుందని కలలోనైనా అనుకోలేదు. ఎటూ పాలుపోని వింతపరిస్థితి ఏర్పడింది.

దామోదరం చాలా విచిత్రమైన సమాధానం పంపాడు. తను కమలని వదిలిపెట్టలేదుట. మద్రాసులో తీసుకొచ్చి దింపేటట్లయితే కమలతో కాపురం చేయటానికి తనకి ఏవిధమైన అభ్యంతరమూ లేదుట. ఇంకో పెళ్లి చేసుకుని, రెండో పెళ్లాంతో సుఖంగా కాపురం చేస్తున్న దామోదరం ఇటువంటి సమాధానం పంపేసరికి రామయ్యగారి తల తిరిగిపోయింది.

ఇప్పుడు తను ఏం చెయ్యాలి? కమలని పంపటమా? మానటమా? కూతురి కాపురం కుదుటపడే అవకాశాన్ని చేతులారా జారవిడుచుకుంటే ఏం లాభం? అయినా ఇంతమాత్రాన కమల కాపరం చక్కబడుతుందని ఆశించటానికి వీలుందా? ఇది కేవలం కపటనాటకం కాకూడదా? అయినా తీసికెళ్లి దింపకపోతే నిష్ఠూరం తనమీద పడదా? తనదే తప్పని లోకం దుయ్యపట్టదా? ఇన్నేళ్లనుంచీ రాకపోకలు లేని వాళ్లగుమ్మం తను ఎల్లా తొక్కుతాడు? తనపరువు నిలుపుకోవద్దా? ఏమీ పాలుపోక రామయ్య భార్యని సంప్రతించాడు. ఆవిడమటుకు వెంటనే తీసికెళ్లి దింపిరావటమే మార్గమన్నది. కాని రామయ్య మనస్సుమాత్రం ఎదురుతిరుగుతోంది.

ఈ సమాధానం చదివి కమల కలవరపడింది. అయోమయమైన అవస్థలో పడింది. తన బతుకు ఏదో ఒక దారిన నడిచిపోతోంది. పిల్లలకి పాఠాలు చెబుతూ, వాళ్ల పసిగుండెల ఆనందంతో మునిగి తేలుతూ, వాళ్ళ ఆటపాటల్లో కలిసిపోతూ కాలం హాయిగా గడిపేస్తోంది. జీవితంలోని ఆటుపోటులు తెలియని ఆటపాటల్లో బతుకే ఒక మధురగీతంగా గడిచిపోతోంది. ఏమైనా సరే వెళ్లకూడదు. ఇక్కడే వుండి జీవితమంతా ఈ విధంగానే గడిపివెయ్యాలని ఒకక్షణంలో అనిపించింది. కాని మరుసటి క్షణంలో దుర్బలమైన మానవహృదయం ఆమె ఆదర్శాలన్నిటినీ వెక్కిరించింది. ఆమె నిశ్చయాలన్నీ సడలిపోయినయ్. ఆహ్వానించే కుటుంబజీవితాన్ని కాలితో తన్నివేసి ఆదర్శాలనే వరించి వాటికోసమే బతుకుని బలిపెట్టగల మనోబలం తన దగ్గర వున్నదా అని అనుమానం కలిగింది. జీవితంలో తొట్రుపాటుపడితే అధఃపాతాళానికి గుంజుకుపోయే సుడిగుండాలెన్నో కమల కళ్లముందర భయంకరంగా తిరుగుతూ ఘోషించినయ్. ఏమీ పాలుపోదు, ఎటూ తెగదు. సంతోషంతో స్వీకరించనూ లేదు; ఏ ధైర్యంతో తృణీకరించనూ లేదు.

వీళ్లెవ్వరూ చెయ్యలేకపోయిన నిర్ణయం రామయ్య తమ్ముడు భీమయ్య చేశాడు. తను తీసుకువెళ్ళి కమలను దింపివస్తాననీ, సంగతి అటో ఇటో తేల్చుకు వస్తాననీ భారం తన నెత్తిన వేసుకున్నాడు. అన్నగారు పట్టుదల మనిషి అని ఆయనకి తెలుసు. తను వెళ్తే అన్నగారి పట్టుదలకీ భంగం వుండదు, కావలసిన పనీ అవుతుంది. "బయలుదేరవే కమలా!" అని బాబాయి ప్రయాణం చేసేసరికి కమల కాదనలేకపోయింది. మంచిరోజు చూసి కమలని దింపి రావటానికి నిశ్చయం అయింది.

కామయ్య మద్రాసు వచ్చింది మొదలు దామోదరం కాపరంలో ఒడుదుడుకులు మొదలైనయ్. అంతదాకా ఏవిధమైన పొరపూ లేకుండా కాలం గడిచిపోయింది. కాని మామగారు మద్రాసు రావటం, వచ్చింది మొదలు దామోదరంతో ఏదో గుసగుసలాడుతూ వుండటం, ఆ మాటలు తను వినకూడనివైనట్లు తలుపులు బిగించుకోటం, రాత్రి పొద్దుపోయేదాకా ఏదో గూడుపుఠాణీలు చేస్తూ వుండటం చూస్తూ వుంటే దామోదరం రెండో భార్యకి చిత్రంగావుంది. విషయమేమిటని ఎంత అడిగినా భర్త చెప్పకపోవటంవల్ల ఆమె అనుమానం, బాధా మరీ ఎక్కువైనయ్. ఆయింట్లో తనకి తెలియని రహస్య తతంగమేదో జరుగుతున్నదని ఆమెకి అర్థమయింది. తను తెలుసుకోకూడని విషయం భర్తకి ఏముందా అని ఆశ్చర్యపడింది. తనని పరాయిదానిలాగా ఆ రహస్యప్రాకారాల బైట నిలబెట్టటం చూసి ఆమె సహించలేకపోయింది. భర్త తెలుసుకోరాని రహస్యం తన జీవితంలో లేదు. అలాగే తను తెలుసుకోరాని సంగతి భర్తదగ్గర ఏమున్నది? ఎందుకుండాలి? మామగారివల్ల తనకీ భర్తకీమధ్య ఏదో అడ్డుగోడ ఏర్పడుతున్నది. అసలు మొదటినించీ మామగారిమీద ఆమెకి కొంచెంకూడా గౌరవం లేదు. ఈ సంగతులవల్ల ఆయనమీద అనుమానమూ ఏవగింపూ జాస్తి అయినయ్. ఒక్కొక్కరోజు గడుస్తున్నకొద్దీ దామోదరానికీ భార్యకీ మధ్య ఎడం ఎక్కువైపోతోంది. అసలు విషయమేమిటో చెప్పేదాకా భర్తతో మాట్లాడకూడదని సంకల్పించుకుంది. ఇద్దరూ ఎడముఖం పెడముఖంగా వుండటం చూసి కామయ్య విస్తుపోయాడు. తను వచ్చినపని అయిపోవటంవల్ల ఇంటికి ప్రయాణం కట్టాడు. కోడలి

ప్రవర్తన చూసి లోపల చాలా తికమక పడ్డాడు.

మామగారు వెళ్ళిపోయిన రాత్రే భార్య దామోదరాన్ని నిలవేసి అడిగింది. "ఏమిటి మీ మంతనాలు? నాతో చెప్పకూడదా?" అని. కాని దామోదరం మౌనంతో తన రహస్యాన్ని భద్రంగా కాపాడుకున్నాడు. ఇది చూసి భార్య మండిపోయింది. మేడ మీద గదిలోంచి తనపక్క తీసుకెళ్లి కింది గదిలో పడుకుంది. దామోదరం అల్లాగే ఒక్కడే నిద్రపోయాడు.

మర్నాడు కోర్టువేళదాకా ఏవో కాగితాలు చూసుకుని భోజనంచేసి కోర్టుకి వెళ్లాడు. రోజూ భర్తకి తమలపాకుల చిలకలు చుట్టియిచ్చే భార్య ఆనాడు ఆ చాయలకైనా రాలేదు. రోజూ భర్తబూట్లు పాలిష్ చేసి, సూటు బ్రష్‌తో తుడిచి అన్నీ సిద్ధంగా పెట్టే భార్య ఆనాడు భర్త కోర్టుకి వెళ్లిపోయిన తరవాత గాని తన గదిలోనించి కదిలి ఇవతలికి రాలేదు. చిన్నబుచ్చుకున్న మనస్సుతో దామోదరం కిక్కురు మనకుండా కోర్టుకి వెళ్లిపోయాడు.

వంటమనిషి తొందర పెట్టటంవల్ల భోజనం చేశాననిపించి భార్య సావట్లో ఆనాటి పేపరు తిరగేస్తూ కూచుంది. ఏదో తెలియని ఆవేదనవల్ల ఆమె చదువుతున్న అక్షరాలన్నీ అలికి వేసినట్లయిపోతున్నయ్. తనకి అర్థంకాని రహస్యమేదో భర్తదగ్గర దాగివున్నదనే అనుమానం పెనుభూతంలాగా ఆమెమీదికి దూకుతోంది.

ఇంటిముందర టాక్సీ ఆగిన చప్పుడు అయింది. తలుపు కొట్టిన అలికిడి అయింది. ఉలిక్కిపడి ఒక్క అంగలో వెళ్లి తలుపు తీసి తన కళ్లని తను నమ్మలేక నిర్ఘాంతపోయింది. "కమలా!" అని ఒక్క గంతేసి కారు దిగిన కమలని గాఢాలింగనం చేసుకుంది. కమలకూడా విస్మయంతో స్తంభించిపోతూ "విమలా!" అని గట్టిగా కౌగిలించుకుంది. కమలని దింపి వెళ్లటానికి వచ్చిన భీమయ్య బాబాయి ఈ దృశ్యంచూసి అర్థంకాని అయోమయంలో పడిపోయాడు. ఏవో మాట్లాడాలని తహతహ పడుతున్నాడు కాని నోటివెంట మాటరాక ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని నిలబడి పోయాడు.

మరుక్షణంలో విమల తనని తాను సంబాళించుకుని "పదండి, లోపలికి రండి. ఎన్నాళ్లయిందోయ్ కమలా నిన్ను చూసి. ఇవాళ ఎంత సుదినం!" అంది.

"నిజంగా సుదినం విమలా" అంటూ కమల లోపలికి నడిచింది. లోపలికి రాగానే "ఈవిడ నాప్రాణ స్నేహితురాలు విమల. మేమిద్దరం ఎఫ్. ఏ. లో కలిసి చదువుకున్నాం. ఒకే గదిలో వుండేవాళ్లం బాబాయ్" అని కమల భీమయ్యతో అంది.

"ఓహో అల్లాగా! అయితే ఈ విడే కాబోలు మన దామోదరం రెండో భార్య!" అని అప్రయత్నంగా భీమయ్య అన్నాడు.

ఈమాటలు వినేసరికి విమల నిలువునా నీరయి పోయింది. ముఖం వివర్ణమైపోయింది. నేలలోకి అణగారి పోతున్నట్లనిపించింది.

భీమయ్య ఇంత ఫెళ్లున మాట్లాడినందుకు కమల చాలా సిగ్గుపడింది. విమలముఖం కేసి చూసేసరికి కళ్లు గిర్రున తిరిగినయ్. కాళ్లు గజగజ వణికినయ్. తను అక్కడికి ఎందుకు వచ్చానా అనిపించి, ఆక్షణంలోనే తిరిగి వెళ్లిపోదామా అనిపించింది. ఆ ఇంట్లో అడుగు పెట్టే అధికారం తనకి లేనేలేదేమో? ఇప్పుడీ ఇంటికి విమల గృహిణి అని తెలిస్తే తను చచ్చినా బయలుదేరి వచ్చేదా?

ఆ నిమిషంలో వాళ్లముందు తను మూర్ఛపడి పోతానేమో నని విమల భయపడింది. ఎల్లాగో కాళ్లమీద నిలబడగలిగింది. కాని కమలముఖంకేసి చూడటానికి ధైర్యంరావటంలేదు. ఎంతో సేపటికి తనని తాను నిలవరించుకుని "లేవండి. స్నానం కానివ్వండి. భోజనానికి పొద్దుపోయింది" అని ఏర్పాట్లు చేసే వంకమీద అక్కడినించి లోపలికి వెళ్లిపోయింది.

అలిగిన భార్యని అనునయించుదామని రోజూకంటే ముందుగా దామోదరం కోర్టు నించి ఇంటికి తిరిగి వచ్చాడు. సావిట్లోకి వచ్చేసరికి పెట్టే పరుపుచుట్టా కనిపించి వచ్చినచుట్టా లెవరా అని ఆశ్చర్యపోతూ లోపలికి అడుగుపెట్టాడు. కళ్లెదుట స్నానం చేసినతరవాత తల ఆరబెట్టుకుంటూ అద్దంముందు నిలబడి కుంకుమ దిద్దుకుంటున్న కమల కనబడింది.

ముందుకి అడుగు పడక దామోదరం శిలలాగా స్తంభించిక్షణంసేపునిలబడిపోయాడు. ఎవరో వచ్చిన అలికిడి అయి కమల గిర్రున వెనక్కితిరిగి బారిష్టరు వేషంలో వున్నభర్తని పోల్చుకోలేక క్షణంసేపు అల్లాగే నిలబడి, పోలిక గుర్తుకి తెచ్చుకుని సిగ్గుతో జేవురించిన ముఖంతో, వణికే చేతులతో నమస్కారం చేసింది. భర్త అలికిడి విన్న తొందరలో చెయ్యివణికి కుంకుమ నుదుటిమీద గాలికి వణికే జ్వాలలాగా అంటింది. ఇన్నాళ్లకి భర్తని చూశాననే ఆనందంతో కమల అణువణువూ పులకరించింది. తన నమస్కారాన్ని పూర్తిగా అందుకోకుండానే పాలిపోయిన ముఖంతో, దొంగలాగ నక్కుతూ మెల్లెక్కిగబగబా మేడమీదికి వెళ్లిపోయాడు దామోదరం. మెట్లమీద అతని బూట్లచప్పుడు కమలగుండెలమోతలో లీనమైయింది.

భోజనాలయినాక భీమయ్యబాబాయి "నేను వచ్చినపని అయింది. ఇంక నేను వెళ్లిరానా కమలా?" అన్నాడు. కమలయేమీ మాట్లాడలేకపోయింది. తిరిగి వెళ్లిపోదామని మనస్సు వొత్తిడిచేస్తోంది. ఇంతలో విమల అందుకుని "వెళ్లండి. కమలకి మరేమీ ఫరవాలేదు. నాదీ పూచీ" అంది. "అయినా అల్లుడికి అప్పగించివెళ్తే నాపని తీరిపోతుంది" అని భీమయ్య దామోదరం కోసం మేడగదిలోకి వెళ్లాడు. పొగమబ్బుల తెరలలో దామోదరం తనని దాచుకుంటూ మంచంమీద పడుకుని వున్నాడు. గదిలో అడుగుపెడుతూనే భీమయ్య పాఠం అప్పచెప్పినట్లు చెప్పదలుచుకున్న సంగతులన్నీ ఏకరువు పెట్టేశాడు. కాని దామోదరం హారీ అనలేదు, అచ్యుతా అనలేదు. తననికూర్చో మనలేదు, పలకరించనూలేదు. ఈ నిరాదరణకి భీమయ్య భగ్గునరగిలి "నీ తాతలలాంటి వాళ్లని చూశానోయ్. ఎవరనుకున్నావో? నీ తలపొగరు దేవుడే అణుస్తాడులే" అని పెద్దపెద్ద కేకలు వేసుకుంటూ మెట్లు దిగి వచ్చేశాడు. రావటంతోటే "పదవే కమలా పోదాం. తిరుగు ప్రయాణం కట్టు" అని కేక పెట్టాడు.


"మీరు వెళ్లండి బాబయ్యగారూ. కమలని ఇక్కడే వుండనివ్వండి. నేను వెయ్యి కళ్లతో కనిపెడుతాను. ఏమీ భయంలేదు, మీరు వెళ్లిరండి" అని విమల అనటం విని భీమయ్య బిత్తరపోయాడు. ఇటువంటి విచిత్ర స్త్రీని ఎక్కడా చూడలేదే? కావాలని సవతిపోరు కొని తెచ్చుకునే ఆడది ఎక్కడైనా వుంటుందా? అని ఆశ్చర్యంతో తలకిందులై పోయాడు.

"నామాట విను కమలా! నీ కేం భయం లేదు. నీకే ఇబ్బందీ రానివ్వను. ఇక్కడే వుండు, నామాట విను" అని విమల దీనంగా కమలగడ్డం పుచ్చుకుని బతిమాలింది.

"అల్లాగే వుంటాను విమలా! నీదగ్గర వుంటంకంటె నాకేం కావాలి? నేనిక్కడే వుంటాను. నువ్వు వెళ్లు బాబాయ్" అంది కమల.

"వారానికి రెండుత్తరాలు రాస్తూ వుండు తల్లీ!" అంటూ భీమయ్య తిరుగు ప్రయాణం కట్టి వెళ్లిపోయాడు.

★



కెరటాలు

"మధుశ్రీ"

వెన్నెల కెరటాలు
వన్నెల కెరటాలు
పున్నమి నిశివేళ
వెన్నెల కిరణాల
పొంగే కెరటాలు
కుంగే కెరటాలు.

సంద్రపు తీరాన
సంధ్యా సమయాన
పెరిగే కెరటాలు
విరిగే కెరటాలు.

పగగుల కెరటాలు
నురుగుల కెరటాలు.
ఆగని కెరటాలు
అందని కెరటాలు.
తొందర కెరటాలు
సందడి కెరటాలు.

పాములవలె సాగి
పడగలవలె ఊగి
ఉరికే కెరటాలు
ఉబికే కెరటాలు.

★



మ్ కాంటీ భోజనానికి ఉపక్రమించాడు. చుట్టూ ఖరీదైన దుస్తులు ధరించిన రాజసేవకులు నుంచుని వున్నారు. వాళ్ళలా గుడ్లు పెట్టుకుని చూస్తూ నుంచునుంటే తన 'పేద అతిథి' తినటానికిబ్బంది పడతాడేమోనని యువరాజు వాళ్లని పంపించేశాడు. టామ్ మాంచి ఆకలిమీద వున్నాడేమో ఫుల్‌స్టాపూ, కామాలూ లేకుండా పట్టెయ్యడం మొదలెట్టాడు. కాని యువరాజు టామ్ పక్కనే కూచ్చుని ప్రసంగం ప్రారంభించాడు.

"నీ పేరేమిటబ్బాయ్?"

"టామ్‌కాంటీ అంటారండి."

"తమాషా పేరే. మీ యిల్లెక్కడ?"

"పట్నంలోనండి. పుడ్డింగ్ వీథిలో ఆఫల్ కోర్టు అనే చోట."

"ఆఫల్ కోర్ట్! ఇదింకో తమాషా పేరు. తల్లి, తండ్రీ వున్నారా?"

"ఉన్నారు ప్రభూ! ఒక బామ్మ, బెట్, నాన్ అనే కవల అక్కలు కూడా ఉన్నారండి. మా బామ్మకీ నాకూ పడదండి."

"ఏం? నిన్ను ప్రేమతో చూడదా?"

"లేదు ప్రభూ! అసలు మా బామ్మకి ఎవరన్నా ప్రేమ లేదు. దాని గుండె విషపుగుండె. ఎప్పుడూ దుష్టమైన పనులే చేస్తూవుంటుంది."

"ఏం చేస్తుంది?"

"నిద్ర పోతున్నప్పుడో, తాగి మత్తుమీదున్నప్పుడో తప్ప, దానికి చెయ్యాడుకోదండి. వంటి మీదకి స్పృహ వచ్చిరాగానే, ఒక్క నిమిషం కూడా వృథా చెయ్యకుండా నన్ను పట్టుకుని—బాదుతూంటుంది."

యువరాజు కళ్లు తీవ్ర కోపంతో ప్రకాశించాయి.

"ఏమిటీ—నిన్ను కొడుతుందా?"

"అవును ప్రభూ!"

"నువ్వింత చిన్నవాడవని జాలి కూడా లేకుండా కొడుతుందా? ఇదుగో విను: ఈ రోజు సూర్యాస్త

మరియం కాకముందు మీ బామ్మని లండన్ గోపురంలో ఖైదు చేస్తాను. నా తండ్రియైన మహారాజు—"

"ప్రభూ! తమరు మరచిపోయారు. మా బామ్మ కేవలం బిచ్చగత్తె. లండన్ గోపురం గొప్ప గొప్ప వాళ్ళకు మాత్రమే తగినది."

"ఆ, అవును. మరిచిపోయా. ఆమెకి తగిన శిక్ష ఆలోచించి చెబుతా. నీ తండ్రి నిన్ను ప్రేమతో చూస్తాడా?"

"ప్రేమవిషయంలో మా బామ్మకి తీసిపోడండి."

"తండ్రులంతా అంతేనేమోలే. నా తండ్రిగారు చాలా కోపస్వభావం గలవారు. ఆయన కోపానికి ఎందరో భస్మమై పోయారు. కాని నన్నెప్పుడూ కొట్టరు; నా మీద ఎప్పుడన్నా కేక లేస్తారంతే. మీ అమ్మ ఎలాంటిది?"

"మా అమ్మ చాలా మంచిదండి. నన్నెప్పుడూ కష్టపెట్టదు. బెట్, నాన్ కూడా మా అమ్మలాంటి వాళ్ళే."

"నీ అక్కలు పెద్దవాళ్ళేనా?"

"చెరో పదిహేనేళ్లుంటాయండి."

"మా అక్కగారు ఎలిజబెత్ కు పధ్నాలుగేళ్లుంటాయి. మా మేనమామ గారి కూతురు జేన్ గ్రే సరిగ్గా నా యీడుది; చాలా మంచిది, అందమైనది కూడా. కాని నా ఇంకో అక్కగారు మేరీ మాత్రం ఎప్పుడూ చిరచిరలాడుతూ వుంటుంది: చూడు, నీ అక్కలు సేవకుల్ని నవ్వవద్దని, నవ్వితే పాపం చుట్టుకుంటుందనీ ఎప్పుడైనా కోపం చేస్తారా?"

"ప్రభూ! నా అక్కలకి సేవకులెక్కడ నుంచి వస్తారు?"

యువరాజు బిచ్చగాణ్ణి క్షణం సేపు తెల్లబోయి చూశాడు. ఆశ్చర్యపోతూ అడిగాడు:

"సేవకులేరూ? మరి రాత్రిపూట వాళ్ల బట్టలెవరు మారుస్తారు? పొద్దున లేవగానే కొత్తబట్టలెవరు తొడుగుతారు?"

"నాకర్థం కేమాత్రం, గౌను విప్పేసి మృగాల్లాగా బట్ట లేకుండా పడుకుంటారా, యువరాజా?"

యువరాజు ఆశ్చర్యం పట్టలేకపోయాడు.

"గౌను విప్పేస్తే వాళ్లకిక బట్టలుండవా? ఒక్కటేనా?"

"ఒకటికంటె ఎక్కువెందుకు ప్రభూ! వాళ్లకి చెరో రెండేసి శరీరాలు లేవుగదా."

యువరాజు నవ్వు ఆపుకోలేకపోయాడు.


"నీ మాటలు బలే వింతగా వున్నాయి. క్షమించు, నిన్ను చూసి వెక్కిరించటంలేదు. కాని నీ అక్కలు మంచివాళ్లన్నావు గదూ! వాళ్లకి సిల్కు బట్టలు, పనులు చేసేందుకు నౌకర్లని ఇప్పుడే పంపిస్తాను; నా వస్త్రశాఖా సేవకుడితో చెప్పానంటే వెంటనే చేసేస్తాడు. ఫరవాలేదు, అహ, మొహమాటపడకు. నువ్వు బాగా మాట్లాడుతున్నావు. ఎందాకా చదువుకున్నావు?"

"ఎందాకా చదువుకున్నానో, నాకే తెలియదు. ఫాదర్ ఆండ్రూ అనే మతగురువు నాకు కాస్త చదువు నేర్పాడు. ఆయనదగ్గిర్నించి పుస్తకాలు తెచ్చి చదివాను."

"లాటిన్ భాష వచ్చా?"

"కొంచెం వచ్చు."

"బాగా నేర్చుకో అబ్బాయ్! మొదట్లో కొంచెం కష్టంగా వుంటుంది గాని తరవాత [illegible] లే



బిచ్చగాని వేషంలో ఉన్న యువరాజును ద్వారపాలకులు అవమానిస్తున్న దృశ్యం.

తేలిక. గ్రీకుభాష ఇంతకంటే కష్టం. కాని లాటిన్, గ్రీకు లేమిటి-ఏ భాష పడితే ఆ భాషని మా ఎలిజబెత్, జేన్ గ్రే అవలీలగా మాట్లాడేస్తారు. వాళ్లు మాట్లాడుతుంటే నువ్వు వినితీరాలి. సరేగాని ఆఫల్ కోర్టును గురించి చెప్పు. అక్కడ జీవితం సరదాగా ఉంటుందా?"

"ఆకలిగా ఉన్నప్పుడు తప్ప మిగతాఅప్పుడు సరదాగానే వుంటుందండి. బొమ్మలాటలు, కోతులాటలు.—ఓ! ఏం కోతులండి! రంగురంగుల బట్టలు తొడుక్కుని తైతక్కలాడతై. అప్పుడప్పుడు వీధినాటకాలు కూడా వేస్తారు. వాళ్లు మైలుదూరందాకా వినిపించేట్టు అరచిఅరచి, చివ్వరికి అంతా పొడుచుకుని చచ్చిపోతారు. చాలా బావుంటాయండి ఆ నాటకాలు. ఫార్తింగు (దాదాపు కాసీ) పెడితే టిక్కెట్టు వస్తుంది.—ఆ ఫార్తింగు దొరకటం కూడా కష్టమే ననుకోండి."

"ఇంకా చెప్పు. ఇంకేంచేస్తారు?"

"ఆఫల్ కోర్టులో ఉండే జతగాళ్లమంతా కలిసి అప్పుడప్పుడు కర్ర యుద్ధాలు చేస్తాము, వీరుల్లాగా."

యువరాజుకళ్లు ఉత్సాహంతో మెరిశాయి: "ఊఁ చెప్పు, చెప్పు. బలేగా వుంది."

"ఎవరు బాగా పరిగెత్తుతారో పందాలువేస్తూవుంటాము."

"ఇది కూడా బాగానేవుంది. ఊఁ, చెప్పు."

"వేసాకాలంలో కాలవల్లోనూ, నదిలోనూ ఈతలు కొడతాము. ఒకళ్లనొకళ్లు ముంచుకుంటూ, నీళ్లు చల్లుకుంటూ, అరుస్తూ, మునిగీత కొడుతూ, ఉక్కిరిబిక్కిరౌతూ—"

"అల్లా సరదాగా ఒక్కసారి గడపటానికి నా తండ్రి రాజ్యమంతా ఖర్చయినా లెక్కచెయ్యను. ఊఁ, ఇంకా."

"చీప్‌సైడుబజార్లో వసంతోత్సవాలు జరిగేటప్పుడు నాట్యంచేస్తూ, పదాలు పాడతాము. ఇసకలో ఆడుతూ దొర్లుతాము. బురదలో ఆడుకుంటాము—అబ్బ, ఏం బురద, ప్రభూ! ప్రపంచంలో అంత మంచి పదార్థం ఇంకోటుందా! బురదలో నానుతుంటే బలే మజాగా వుంటుంది—"

"చాల్చాలు. ఇంకేం చెప్పకు. అద్భుతం, పరమాద్భుతం! నీ బట్టల్లాంటివి తొడుక్కుని, ఒక్కసారంటే ఒక్కసారి, ఎవ్వరూ వద్దనే వాళ్లు లేకుండా బురదలో పొర్లాడితే—ఈ రాజ్యం పోయినా ఫరవాలేదు."

"నేను కూడా, ఒక్కసారంటే ఒక్కసారి, మీబట్టల్లాంటివి తొడుక్కుని—"

"ఓహోహోహో! నీకూఅల్లాగే అనిపిస్తోందా? అయితే నీ చిరుగు బట్టలు తీసేసి ఇవి వేసుకో. ఈ ఆనందం అట్టేసేపుండదనుకో; అయినా బలేగావుంటుంది. ఇష్టం వచ్చినంతసేపు నువ్వాబట్టల్లోనూ, నేనీబట్టల్లోనూ వుందాం. ఎవరూ కనిపెట్టకముందే మళ్ళీ మార్చేసుకుందాం."

మరి కొద్ది నిమిషాల్లో వేల్సు యువరాజు చిరుగుల గుడ్డల్లో తయారయ్యాడు. భిక్షాసామ్రాజ్య చక్రవర్తి టామ్ రాజవేషంలో తయారయ్యాడు. నిలువు టద్దం ముందు ఇద్దరూ పక్కపక్కన నుంచుని చూసుకున్నారు — ఏమాశ్చర్యం! అసలు వాళ్లు దుస్తులు మార్చుకున్నట్టే లేదు; ఒకళ్ళనొకళ్లు తేరిపార చూసుకున్నారు; మళ్ళీ అద్దంలో తమకేసి చూసుకున్నారు; చివరికి యువరాజిలాగన్నాడు:

"ఏమిటంటావు దీనికి కారణం?"

"ప్రభూ! నేను జవాబు చెప్ప

లేను. మీదాసానుదాసుడు అంత మాట అనటానికి సాహసించడు—"

"అయితే నే చెబుతా విను: నీకూ నాకూ ఒకే మోస్తరు జుట్టు, కళ్లు ఉన్నాయి. మనం మాట్లాడే తీరు, నడిచే నడక, మన మొహాలు, వంటిరంగు, ఎత్తు, లావూ అన్నీ ఒకటే. మనం దుస్తులు తీసేసి నుంచుంటే ఎవరు బిచ్చగాడో, ఎవరు వేల్సు యువరాజో కనిపెట్టలేరు...... అదేమిటీ, నీ చేతిమీద దెబ్బ?"

"ఆ, ఏమీలేదు, ప్రభూ! ఇందాక పాపమా సిపాయి, నన్ను తోసినప్పుడు తగిలింది. పెద్ద దెబ్బేమీ కాదండి."

"ఛట్! మాట్లాడకు. ఎంత అవమానం, ఎంత క్రూరం! ఆ వెధవకి బుద్ధిచెప్పి వస్తా నాగు. నేను వచ్చేదాకా ఒక్క అడుగు కదలకు—ఇది నా ఆజ్ఞ."

బల్లమీద రాజ్యాని కంతటకీ ముఖ్యమైన ఒక వస్తువుంది. దాన్ని యువరాజు ఒకమూల దాచేశాడు. మరుక్షణంలో, ఇందాకటి సిపాయిని శిక్షించే ఉద్దేశంతో యువరాజు తలుపు తెరుచుకుని పరిగెత్తాడు. పేలికలు నేలజీరాడుతుండగా, ఉద్యానవనమంతా దాటి గేటు సమీపించాడు. కటకటాలు పట్టుకుని ఊపుతూ.

"తెరు. గేట్లు తెరు," అని అరిచాడు.

టామ్ కాంటీ నిందాక అవమానించిన సిపాయి ఈ ఆజ్ఞ శిరసావహించాడు. యువరాజు రాజులకు తగిన తీవ్రకోపంతో చిందులు తొక్కుతూ గేటు ఇవతలకి వచ్చాడు; వెంటనే గేటు తీసిన ద్వారపాలకుడు ఊచిపుచ్చుకుని దవడ మీద కొట్టాడు; ఆ దెబ్బకి యువరాజు గిరగిర బొంగరంలా తిరుగుతూ రోడ్డు మీదికిపోయి పడ్డాడు:

"ఇందాక యువరాజు చేత తిట్టించినందుకు ఇదుగో బహుమానం పంది వెధవా!" అన్నాడు సిపాయి.

సముద్రపు ఘోష నిమించేటట్టు నవ్వారు రోడ్డుమీది జనం. యువరాజు మట్టి దులుపుకుంటూ లేచి, సిపాయికేసి పరిగెత్తి వస్తూ,

"నేను వేల్సుయువరాజుని. నా పవిత్రమైన శరీరాన్ని అవమానిస్తావా, మూర్ఖుడా! నామీద చేయివేసినందుకు నిన్ను ఉరితీయిస్తాను."

సిపాయి నిటారుగా నుంచుని సెల్యూట్ చేస్తూ,

"క్షమించండి మహాప్రభూ!" అని వెక్కిరించాడు. వెంటనే తీవ్రంగా, "ఒరే, చెత్తకుంకా! కదుల్తావా, కదలవా?" అన్నాడు.

ఈలోగా జనం యువరాజుని చుట్టు ముట్టారు. అతన్ని ఎత్తి పడేస్తూ, రోడ్డుదాకా తోసుకుపోయారు; "వేల్సు యువరాజుకు దారివ్వండి—మహాప్రభువులు వేంచేస్తున్నారు—తొలగండి," అని కేకలేస్తూ లాక్కుపోయారు.

4

చాలా గంటలసేపు జనం యువరాజుని హింసించి, బాధించి, వేధించి, వినోదించారు. ఇహవిసుగు పుట్టి అతని మానాన అతన్ని వదిలేసి పోయారు. ఓపికున్నంతవరకూ యువరాజు జనాన్ని రాజఠీవితో బెదిరించాడు; రాజఠీవితో ఆజ్ఞాపించాడు; తిట్టాడు, తన్నాడు. అంతవరకూ జనానికి సరదాగానే వుంది. కాని కొంతసేపటికి యువరాజు అలసిపోయాడు; ఇహ ఏంచేయటానికీ ఓపిక లేకపోయింది; కనుక అతనితో అవసరం తీరిపోయి, జనులు ఎవళ్లదారిన వాళ్లు వెళ్లిపోయారు.

యువరాజు చుట్టూ కలయచూశాడు. ఎక్కడున్నాడో తెలియలేదు. లండన్ నగరంలో ఉన్నట్టు మాత్రం గ్రహించాడు. ఏదారి కనిపిస్తే ఆదారిన నడవసాగాడు. కొంతదూరం పోయేసరికి ఇళ్లు పల్చబడ్డాయి; రోడ్డు మీద జనంకూడా పల్చబడ్డారు.

ఇప్పుడు ఫారింగ్టన్ వీధిఉన్న చోట ఆ రోజుల్లో ఒక కాలవ ప్రవహిస్తూండేది. అందులో దిగి నెత్తురు కారుతున్న పాదాలుకడుకున్నాడు. కాస్సేపు గట్టున విశ్రమించాడు. మళ్ళీ నడిచి ఒక పెద్దమైదాన స్థలంలోకి వచ్చాడు. అక్కడ అట్టే ఇళ్లు లేవు; ఒక పెద్ద చర్చి వున్నది. ఆ చర్చి నతడు గుర్తుపట్టాడు. ఆ చర్చి మరమ్మతులో ఉండటంవల్ల పనివాళ్లు చాలామంది నిచ్చెనలు వేసుకుని పని చేస్తున్నారు.

చర్చి చూడగానే యువరాజుకు ప్రాణం లేచివచ్చింది; తనకష్టాలు గట్టెక్కా యనుకున్నాడు: "గ్రే ఫ్రయర్ల చర్చి ఇదే. దీన్నే నాన్నగారు కాథలిక్ సన్యాసుల నుంచి లాక్కుని అనాధ శిశువుల రక్షణ కోసం దానంచేశారు. దీని కొత్త పేరు క్రైస్టు చర్చి. మా తండ్రిగారు చేసిన మేలును గుర్తుంచుకొని వీళ్లు

నన్ను ఆదరించకపోరు. అందులో ముఖ్యంగా తమ అన్నదాత కొడుకు ఇంత నిరుపేద స్థితిలో ఉన్నప్పుడు తప్పకుండా సహాయ పడతారు,'' అని అతనికి ఆలోచనలు పోయినై. ఈ ఆలోచనల్లో పడి అతడు కొందరు పిల్లల సమూహం లోకి వచ్చాడు. వాళ్లు దాగుడుమూతలు, బంతాట ఆడుతూ, ఆ సందర్భంలో పరిగెత్తుతున్నారు, ఎగురుతున్నారు, దూకుతున్నారు. వాళ్ళందరూ ఒకటే మోస్తరు దుస్తుల్లో వున్నారు; తలకి ఎటూ సరిపోని నల్లటి టోపీ, మెడకి ఓ చిన్న రుమాల లాంటిది, బిగుతుగావుండి మోకాళ్ళకిందికి వచ్చే నీలంచొక్కా, పొడుగు చేతులు, నడుముకు వెడల్పాటి ఎర్రనిబెల్టు, పసుప్పచ్చ మేజోళ్లు, బెల్టుచెప్పులు-ఇవీ వాళ్ల దుస్తులు. అవి ఎంత అసహ్యంగా వుండాలో అంత అసహ్యంగా వున్నాయి.

పిల్లలు ఆటలాపి యువరాజు చుట్టూ మూగారు. అతడు తన సహజ రాజఠీవితో ఇలాగన్నాడు.

''మీరు మంచి పిల్లల్లా కనిపిస్తున్నారు. వేల్సు యువరాజు, ఎడ్వర్డు మాట్లాడ గోరుతున్నాడని మీ అధికారులతో చెప్పండి.''

ఈమాటకి పిల్లలగుంపు వేళాకోళపు అరుపులతో సమాధానమిచ్చింది. ఒక పెంకిఘటం ఇలాగన్నాడు:

"ఏయ్ బిచ్చగాడా! యువరాజుగారి రాయబారివా నువ్వు?"

యువరాజు మొహంలో కోపం వల్ల రక్తం పెల్లుబికి వచ్చింది. అప్రయత్నంగా నడుము మీద చెయ్యివేశాడు; కాని అక్కడేమీ లేదు. మళ్లీ ఉప్పెనగా నవ్వు మొదలైంది. ఓకాడీకుర్రా డన్నాడు:

"చూశారా, అది? నడుముకు కత్తి ఉన్నట్లు నటించాడు-అచ్చు యువరాజు మల్లేనే." మళ్లీ ఓనవ్వు ఉప్పెన.

"నేను నిజంగా యువరాజుని. మా తండ్రి గారైన మహారాజు ఉప్పుతిని బతుకుతూ, ఆయన కుమారుడికిచ్చే గౌరవమిదేనా?" అన్నాడు.

ఈమాటలువిని పిల్లలు చాలా ఆనందించారు. నటనానికి నిదర్శనంగా సముద్రపుహోరులాంటి మరోనవ్వు కెరటాలుగా పొర్లి వచ్చింది. మొదట్లో మాట్లాడిన పెంకి ఘటం తోటి వాళ్లతో ఇలా అన్నాడు.

"ఒరేయ్, పందుల్లారా! బానిసల్లారా! మహారాజు ఉప్పుతిని బతుకుతూ, మీకా మాత్రం గౌరవ మర్యాదలు తెలియక్కర్లే దట్రా. పడండి, సాష్టాంగపడి నమస్కారాలు పెట్టండి. ఎదురుగా చిరుగుల మహారాజు నుంచునుంటే, సాష్టాంగ పడకుండా చూస్తారే మర్రా."

పిల్లలందరూ ఒక్క సారిగా సాష్టాంగపడి, తమచేతిలో చిక్కిన పిట్టకి నమస్కారం చేశారు. పెంకి ఘటంగాణ్ణి యువరాజు చాచి కాలి కొద్దీతన్ని భయంకరంగాఉరిమాడు.

"ఇదుగో దెబ్బ. రేపొద్దునే నిన్ను ఉరికంబ మెక్కిస్తాను."

ఓ, ఇదేదో వేళాకోళ మనుకుంటే, వ్యవహారం ముదిరిందే... వెంటనే నవ్వు శాంతించింది. దాని స్థానాన్ని కోపం ఆక్రమించుకుంది. ఓ డజనుమంది అరిచారు·

"తోలండి వాణ్ణి, గుర్రాల గొయ్యికి. కుక్కలెక్కడ? హా, జాక్, బ్లాకీ ఉస్కో."

అప్పుడు ఇంగ్లీషు చరిత్రలో ఎవ్వరూకని విని ఎరగని సంఘటన జరిగింది. ఇంగ్లీషు సింహాసనానికి వారసుడైన వేల్సుయువరాజు పవిత్ర శరీరాన్ని డజన్లకొద్దీ కుక్కలు కొరకడం, పీకడం, రక్కడం ప్రారంభించాయి. వాటికి మనుష్యులు శక్తివంచన లేకుండా తోడ్పడ్డారు.

సూర్యాస్తమయమైంది. చీకటి నలుదిశలా కమ్ముకుంటోంది. యువరాజు నడిచి, నడిచి నగరంలో అలగా జనం కాపురముండే ప్రాంతం చేరుకున్నాడు. శరీర మంతా

పచ్చి పుళ్ళయింది; చేతులకీ, కాళ్ళకీ నెత్తురు కారుతోంది; వంటికీ, బట్టలకీ మట్టి పేరుకుంది. ఎటుపోయేదీ తెలియక, ఎటుపోవాలో తెలియక విభ్రాంతుడై, అలిసి, నీరసంగా తిరుగాడాడు. అడుగుతీసి అడుగు వెయ్యడం కూడా కష్టమై పోతోంది. మొదట్లో మాదిరిగా ఇప్పుడెవరినీ ప్రశ్నలడగటం లేదు; ఎందుకంటే సమాధానాలకు బదులు అవమానం ఎదురవుతోంది.

"ఆఫల్ కోర్టు-అదీదాని పేరు. నాకాళ్ళలో బలంపూర్తిగా చచ్చిపోకముందు అక్కడికి చేరుకో గలిగానంటే, బతికానన్న మాటే. టామ్ తలిదండ్రులు నన్ను కోటకి తీసుకుపోతారు; నేను బిచ్చగాణ్ణి కాదనీ, నిజమైన యువరాజు ననీ ఋజువుచేస్తారు." అనుకున్నాడు. క్రైస్టు చర్చిలోని పిల్లలు తన్ను అవమానించిన విధానమంతా కళ్ళకుకట్టింది.

"నేను రాజునయ్యాక ఆ పిల్లలకి తిండి, బట్ట ఇవ్వడమే కాకుండా చదువుకూడా నేర్పిస్తాను. మనస్సు, [illegible]యం సరిగ్గా లేకపోయిన తర్వాత కడుపునిండా తిండివుండి మాత్రం లాభమేమిటి? ఇది జాగ్రత్తగా జ్ఞాపకముంచుకోవాలి. చదువువల్ల హృదయం మృదువౌతుంది," అనికూడా అనుకున్నాడు.

వీధుల్లో దీపాలు వెలిగాయి. వాన తుప్పర ప్రారంభమైంది. హోరుగాలి సాగింది. తల దాచుకొనటానికైనా దిక్కులేని వేల్సు యువరాజు దారిద్ర్యం, మాలిన్యం గడ్డకట్టిన సందులగుండా తిరుగాడుతున్నాడు. ఇంతలో ఓ తాగుబోతు మెడ పట్టుకున్నాడు.

"ఇంతరాత్రిదాకా ఇంటికి రాకుండా ఏం చేస్తున్నావురా? ఏమన్నా డబ్బులు సంపాదించావా లేదా? చెప్పు. ఇవ్వాళ నీ బొమికలన్నీ విరిచి పొయ్యిలో పెట్టకపోతే నా పేరు జాన్ కాంటీ కాదు."

యువరాజు పట్టు విడిపించుకుని, అప్రయత్నంగా బుజాలు దులుపుకున్నాడు, పవిత్రమైన తన శరీరం మలినమైందనే చింతతో.

"నువ్వు అతని తండ్రివా? అయితే బతికిపోయానన్నమాటే. నన్ను అక్కడికి తీసుకపోయి, అతన్నిక్కడకు తీసుకరా," అని ఆదుర్దాగా అన్నాడు.

"అతని తండ్రినా? అతనెవరో నాకు తెలియదు. నేను నీ అబ్బనని మాత్రం తెలుసు. నీకా సంగతి ఇంకా తెలియకపోతే రెండు నిమిషాల్లో తెలుస్తుంది; ఇంటికి పద."

"ఇదుగో, ఇది వేళాకోళానికి సమయంకాదు. ఆలస్యం చెయ్యకు. నే నిప్పటికే చాలా బాధ అనుభవించాను, చాలా గాయాలు తగిలాయి. నాతండ్రిగారైన మహారాజు దగ్గిరికి తీసుకుపో. ఆయన నిన్ను ఐశ్వర్యాలలో ముంచెత్తుతాడు. నా మాటనమ్ము. నే నబద్ధమాడటం లేదు; ఇది ముమ్మాటికి నిజం. నీ చెయ్యిజాచు; నన్ను ఈ కష్టదశ నుండి రక్షించు. నేను వేల్సు యువరాజుని."

జాన్ కాంటీ మంచులో ఇరుక్కుపోయిన వాడిలా ఆశ్చర్యంతో కొరడుకట్టి, నుంచుండి పోయాడు. ఎడ్వర్డుకేసి కొంతసేపు తేరిచూశాడు; తల అటూ ఇటూ ఊగించి ఇలా గొణిగాడు:

"పిచ్చెక్కిందీ, వెధవకి?" మళ్ళీ మెడబట్టుకుని, బూతులవాన కురిపించాడు. "నీకు పిచ్చెక్కితే ఎవడికావాలి; పిచ్చెక్కకపోతే ఎవడికావాలి. నీ బొమికల్లో ఏది గట్టిదో, ఏది మెత్తదో ఇవ్వాళ పరీక్ష చెయ్యాలి. పద మీ బామ్మ దగ్గిరికి, అదికూడా పరీక్షచేస్తుంది," అంటూ ఆ తాగుబోతు తప్పించుకోవాలని పెనగులాడుతున్న యువరాజుని బరబర లాక్కుపోయాడు. వెనక తాచుపాముల్లాగా విషపు నవ్వులు కక్కుతూ బిచ్చగాళ్ళ గుంపు అనుసరించింది. (ఇంకావుంది)

సవరణ

గత సంచికలో మార్క్ ట్వేన్ జనన సంవత్సరం 1884 అని ప్రకటించబడినది. దానిని 1835 గా గ్రహించ ప్రార్థన.

—సంపాదకుడు.

తీర్పు

అనగా అనగా ఓ ఊళ్లో నాగన్న అనే వాడుండేవాడు. న్యాయమూ, ధర్మమూ చెప్పడంలో నాగన్నను మించినవారు ఆ వూళ్లో యింకెవ్వరూ లేరు.

ఆవూరికి నల్గురు మనుష్యులు వచ్చి ఓ ముసలమ్మ యింట్లో బస చేసిరి. ఆ ముసలమ్మకు వారొక సీలు వేసిన రూపాయిల సంచి నిచ్చి "మళ్ళీమేము నల్గురము కలసి అడిగినప్పుడు మాత్రమీయవలెను సుమా!" అని చెప్పిరి. ఆముసలమ్మకు వారేమిపనిమీద వచ్చినది తెలియదు. వారేవో వ్యాపార విషయములు మాత్రము ముసలమ్మ వద్ద మాట్లాడు చుండిరి. అందులో చిన్నవాడికి రూపాయిల సంచిని ముసలమ్మను మస్కాకొట్టి తీసుకొందామని బుద్ధి పుట్టింది. తగిన అవకాశము కొరకు చూచుచుండెను.

వారము రోజులయిన తర్వాత వారు వూరువదలి వెళ్ళి పోవుటకు నిశ్చయించుకొనిరి. ముసలమ్మ యింటికెదురుగానున్న మైదానములో చెట్టుక్రింద కూర్చొని తమ కార్యక్రమమునాలోచించిరి. ముసలమ్మ సాధారణముగ రాత్రివంటను ఆలస్యముగ చేయు చుండెడిది. అందుచేత వారు ముసలమ్మను త్వరగవంటచేయమని కబురు చిన్నవానిచేత పంపిరి. అప్పుడు చిన్నవాడు మిగిలిన వారితో "నాకు తలనొప్పిగయున్నది. అందుచేత ముసలమ్మ యింటి వద్ద ఈ కబురు చెప్పేసి పండుకొంటా" నని చెప్పెను. వారు సరేననిరి. తగిన అవకాశం దొరికింది కదా అని చిన్నవాడు సంతోషముతో ముసలమ్మ వద్దకు వెళ్ళి

రచన:

శ్రీ కట్టోజు సత్యానందం

రూపాయిల సంచిని వారడుగుచున్నారని చెప్పెను. ముసలమ్మ "నల్గురు వస్తేగాని యివ్వ" నని చెప్పెను. అప్పుడు చిన్నవాడు ముసలమ్మకు నమ్మకము తోచునట్లుగా "నిన్ను నేను మోసము చేయుటకు రాలేదు. మేము ఈ రోజు యీవూరువదలివెళ్తున్నాము. వారు నీడబ్బు నీకిచ్చి మిగత డబ్బును తెమ్మని చెప్తేనే వచ్చేనని" చెప్పెను.

ముసలమ్మ కసలు చెవుడు. చిన్నవాడు వృథంగా చెప్తున్నాడని కాస్తనమ్మకముకల్గింది. దస్తి బయటకు వచ్చి చూచింది. చూచేసరికి మైదానములో చెట్టుక్రింద ముగ్గురూ ఉన్నారు. ఈ విషయం యిరుగు పొరుగుల వారికి వినిపిస్తుందేమో అని "మూటనుచిన్నవాడడుగుచున్నాడు. యీయనా?" అని సంజ్ఞ చేసింది. దానికి వారు వంట విషయం ఏదో అడుగుచున్నదేమో "సరే" అన్నట్లు సంజ్ఞ చేసిరి. ముసలమ్మ డబ్బు సంచి చిన్నవాడి కిచ్చింది. చిన్నవాడు



ముసలమ్మడబ్బు ముసలమ్మకిచ్చి ఉడాయింపు చేశాడు.

సాయంకాలము చిన్నవాడు కాకమిగిలిన ముగ్గురు ముసలమ్మను త్వరగ అన్నము వడ్డించమని వచ్చిరి. అప్పుడు ముసలమ్మ ఆశ్చర్యముతో "మీరు మధ్యాహ్నము వెళ్తున్నాం అని కబురు చేసియిప్పుడన్న మడుగుతా రేం నాయనా?'' అని అడిగెను. అయితేమావాడు తల నొప్పిగా నున్నది ఇక్కడ పడుకొంటా నన్నాడు. వాడేమి చెప్పలేదా అని వారడిగిరి. ముసలమ్మ "మీవాడి సంగతి నాకు తెలియదు. మీరు కబురుచేసినప్పుడు నేను రూపాయిల సంచినిచ్చి వేస్తినని" చెప్పెను. ముసలమ్మను వారు గట్టిగా "మా రూపాయిల సంచికే మోసము చేస్తున్నావేమిటి? మా రూపాయిల సంచిని మాకిచ్చి మాట్లాడుమని చెప్పిరి. ముసలమ్మ రూపాయిలసంచి నాదగ్గర లేదు బాబోయ్ అంటూ ఏడవటం మొదలు పెట్టింది. రూపాయిల సంచి కొరకు ఆరాత్రంతా వారు తగవులాడిరి.

ఉదయాన్నే నాగన్న దగ్గరకు వెళ్లి "తాము దాచిన సొమ్ము లేదని చెప్పచున్నదని" ఫిర్యాదు చేసిరి. నాగన్న వారు చెప్పినది జాగ్రత్తగా వినెను. అందరూ ముసలమ్మను శిక్షిస్తాడేమో అనుకొన్నారు. అప్పుడు నాగన్న "రూపాయిలసంచి నిచ్చినప్పుడు ముగ్గురా? లేక నల్గురున్నారా?" అని అడిగెను. ముసలమ్మ నల్గురున్నారని చెప్పెను.

రూపాయిల మూట నిచ్చినప్పుడు నల్గురున్నారు. గాన రూపాయిల మూటను తీసికొనుటకు కూడా మీ షరతు ప్రకారము నల్గురు వచ్చి తీరవలెను. యిప్పుడు ముగ్గురే వచ్చి అడుగు చున్నారు. గాన ముసలమ్మ రూపాయిలమూట నీయ నవసరం లేదని నాగన్న తీర్పు చెప్పెను. (నాల్గవవాడు ఎలాగైనా రాడు. వచ్చినా ముసలమ్మ అడుగుతుంది. అప్పుడు రహస్యం బయలుపడుతుందనే ఉద్దేశంపై నాగన్న ఆవిధంగా తీర్పు చెప్పేడు)

ముసలమ్మయింటికి సంతోషముతో వెళ్లిపోయెను. వారు తెల్లమొగము వేసుకొని పోయిరి.

చూశారా పాఠలూ! నాగన్న తీర్పు. నాగన్న సరిగ్గా తీర్పు చెప్పక పోతే ముసలమ్మ డబ్బు మోసగించెననే నిందపాలయ్యేదే!

★

"అయ్యా, నాకు తమతో కొంచెం మాట్లాడవలసి ఉన్నది. తమకు తెలుసో లేదో, నేను చచ్చినవాళ్లతో మాట్లాడగలను—"

"మాట్లాడుతూ ఉండండి. ఓ పావుగంటలో నాపని అయిపోతుంది.

* * *


"అయిదేళ్ళయింది కొని, ఈ కుట్టుమిషను మరమ్మతు కింద ఒక్క దమ్మిడీ ఇవ్వలేదు."

"అవునుట. మరమ్మతు చేసినవాడు ఆ మాటే అన్నాడు నాతో."

* * *

తల్లి : నిద్రపోయేటప్పుడు దీపం దేనికే? ఇంటిదగ్గిర చీకట్లోనే నిద్రపోతావే.

బిడ్డ : అది మన చీకటిగా, అమ్మా?



అనగనగా పూర్వం మగధ దేశాన్ని సిద్ధోదనుడనే ఒక రాజు పరిపాలిస్తుండేవాడు. ఆయనకు లేక లేక ఒక కొడుకు పుట్టాడు. ఆ కొడుక్కి సుద్ధార్థుడని రాజు పేరు పెట్టాడు. సుద్ధార్థుడు పుట్టిన సమయంలో జ్యోతిష్కులు జాతకం చూసి "రాజా! నీ కొడుకు నీకు దక్కాలంటే బయటి ప్రపంచాన్ని చూడనివ్వకు." అని చెప్పారు.

రాజు తనకు లేక లేక పుట్టిన కొడుకు ఎక్కడ తనకు దక్కకుండా పోతాడో అని అతి జాగ్రత్తగా, గారాబంగా పెంచాడు. చంద్రభవనమనే పాలరాతి మేడ కట్టించి అందులోనే శుద్ధార్థుడిని ఉంచాడు. అతనికి సమస్త విద్యలూ, శాస్త్రాలు నేర్పించాడు. బయటికి మాత్రం వెళ్ళనీకుండా ఎప్పుడూ మేడ బయట భటులను కాపలా వుంచాడు.

చంద్రభవనం చాల అందమైన మేడ. సూర్యుడు నడి ఆకాశాన ఉన్నప్పుడు ఆ మేడ తళ తళ లాడుతూ కళ్లు మిరుమిట్లు గొలిపేది. వెన్నెలవేళ పాలరాతి గోడలు నిగ నిగ లాడుతూ, వెన్నెల అనే సముద్రంలో తేలుతూ ఊగుతూ పోయే

రచన:

పండిపడవలాగా ఉండేది. ఆ మేడలో రాజకుమారుడికి సమస్త భోగాలూ, భాగ్యాలూ ఉన్నాయి. మేడచుట్టూ విశాలమైన తోటలు, వాటిల్లో హంసలు యీదే సరస్సులు, పాటలుపాడే కోకిలలు, చెట్లు, పుష్పాలు, ఉండేవి. రాజకుమారుడికి ఎటు చూసినా ఆనందం, అందం కనిపించేది.

ఇంత సుఖమైన ప్రదేశంలో శుద్ధార్థుడు 20 ఏళ్ళపాటు పెరిగాడు. ఇన్నేళ్ళలోనూ అతడు తన చంద్రభవనమూ, దానానుకుని తన తల్లిదండ్రులు ఉండే ఇంద్రభవనమూ తప్ప మరొక చోటికి పోలేదు. ఎప్పు

డైనా నౌకర్లని పిలిచి "దీనికవతల ఏముంది?" అని అడిగితే, "ఇదే ప్రపంచమంతా. ఇంతకంటే వేరేమీ లేదు." అని చెప్పేవారు.

కాని శుద్ధార్థుడికి అనుమానం వేసింది. "నిజంగా ఈ అందమైన తోటల కవతల ఏదో మరోరకమైన ప్రపంచం ఉండి ఉండాలి. నేను చదివినపుస్తకాలన్నీ మరో ప్రపంచాన్ని గూర్చి చెబుతున్నాయి. అదేదో కనుక్కోవాలి." అనుకున్నాడు.

అడవుల్లో హాయిగా, స్వేచ్ఛగా తిరిగే చిలకని పట్టుకొని పంజరంలో పెడతారనుకోండి. ఆపంజరం బంగారంతో చేసింది కావచ్చు. అందులో చాలా సుఖంగానే ఉండచ్చు. అయినా ఆచిలకకెల్లా ఉంటుంది? పంజరంనుండిపారిపోయి, విశాలమైన ఆకాశంలో పచ్చని రెక్కలువిప్పి పల్టీలుకొడుతూ ఎగరాలని, తనంతటతనుజామపళ్లు వెతుక్కొని తినాలనీ ఉండదూ దానికి?

అల్లాగే అయింది రాజకుమారుడిపని. ఎప్పుడూ సుఖంగా ఇంట్లో కూచ్చుంటే విసుగుపుట్టదూ? బయటికి పోవాలనిపించింది. కాని ఎల్లాపోవటం. తండ్రి ఆజ్ఞలవల్ల సేవకులెవరూ అతన్ని బయటికి పోనివ్వరు అందుకని ఒక రోజు అర్థ రాత్రి శుద్ధార్థుడేం చేశాడంటే, మాసిన బట్టలు కట్టుకుని, నౌకరు లాగా వేషం వేసుకుని, ఎవ్వరూ చూడకుండా ఇంట్లోనుంచి బయలుదేరి పోయాడు.

అల్లా పోగా, పోగా, కోటలు, తోటలు, వాగులు, పొలాలు దాటి తెల్లవారేసరికి ఒక పల్లెటూరు చేరుకున్నాడు. రాజకుమారుడికి అంతా కొత్తగా కనిపించింది. తను మామూలుగా చూసే మనుషులు మాదిరిగా లేరు ఆ వూరి వాళ్లు. వాళ్లబట్టలు తను కట్టుకునే వాటి మాదిరిగా లేవు. వాళ్ల యిళ్లు తన చంద్రభవనంలాగా లేవు.

ఆ వూళ్లో ఎక్కడ చూసినా కూలి పోతున్న పూరి గుడిసెలు; ముఖానకళా, కాంతీ, సంతోషమూ లేని మనుషులు; మడ్డిఓడుతూ చిరిగిన బట్టలు కట్టుకుని మట్టిలో పొర్లాడే పిల్లలు; ఊరంతా పేడ, చెత్త, నానాఅసహ్యం.

శుద్ధార్థుడు ఒక గ్రామస్థుడిని పిలిచి అడిగాడు.

"ఏ వూరిది?"

"ఆనందపురం"

"ఆనంద పురమా? ఈ ఊళ్లో ఎక్కడా ఆనందమే కనిపించటం లేదేం?" అన్నాడు రాజకుమారుడు.

"కనిపించకేం. ఈఊళ్లో కల్లా బాగా ధనవంతుడైన ఆ వైశ్యుని యింట్లో అంతా ఆనందమే" అన్నాడు గ్రామస్థుడు.

శుద్ధార్థుడు ఆ గ్రామస్థుడి నడిగి ఇంకా బోలెడు విషయాలు తెలుసుకున్నాడు. ఆ గ్రామం తన తండ్రి పాలించేమగధ రాజ్యంలోదే. అల్లాంటి గ్రామాలు ఇంకా బోలెడున్నాయి. మగధరాజ్యం లాంటి రాజ్యాలు ప్రపంచంలో అనేకమున్నాయి. రాజులు, మంత్రులు, సేనాపతులు, సామంతులు, వైశ్యులు, పురోహితులు ఇల్లాంటి వారంతా ధనధాన్యాలతో తులతూగుతూ వుంటారు. ప్రజలు పొలాలుదున్ని పంట పండిస్తారు. బట్టలు నేస్తారు. ఏడంతస్తులమేడలు కడతారు. గనుల్లోంచి బంగారం, సముద్రాల్లోంచి రత్నాలు ఏరితెస్తారు. కాని అవన్నీ అనుభవించేది రాజులు, రాణులు, సామంతులు మొదలైనవాళ్లు. పాపం ఇంత కష్టపడి పనిచేసిన బీదవాళ్లకి తింటానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉంటానికి యిల్లు వుండవు. వాళ్ళ పిల్లలకి మంచిమంచి బట్టలు కట్టుకోవాలని, మిఠాయి, లడ్డూలు తినాలని, పెద్దచదువు చదువుకోవాలని ఉంటుంది. కాని బీదవాళ్ళకి ఇవన్నీ ఎక్కడినించి వస్తాయి? పైగా వేదాలు అవీ చదువుకున్న పండితులు వాళ్లూ ఏమంటారంటే "ఇదంతా వాళ్ళఖర్మ. పూర్వజన్మలో ఏం పాపం చేసుకున్నారో యీ జన్మలో బీదవాళ్లయ్యారు" అంటారు.

రాజకుమారుడు చాలా తెలివైనవాడు, మంచివాడు. కనక రాజులుచేసే అన్యాయాన్ని, ప్రజలు పడే బాధలని అర్థంచేసుకున్నాడు. "ఇదంతా ఖర్మ" అని పండితులు చెప్పే మాటలు పచ్చిమోసం అనుకున్నాడు. ఏమో పూర్వజన్మలో ఎవరేం చేశారో ఎవరికి తెలుస్తుంది? అసలు పూర్వజన్మ అనేది వుందని ఈపండితులకెల్లా తెలుసు? వీళ్లంతా రాజుల సొమ్ముతిని, ప్రజలని మోసం చెయ్యటానికి ఈ స్వర్గం, నరకం, దేవుడు, ఖర్మ యిల్లాంటివన్నీ కల్పించారు. ప్రజలని బీదవాళ్లుగాను, రాజుల్ని ధనవంతులుగాను ఉంచటానికి పండితులు కల్పించారివన్నీ అనుకున్నాడు మన శుద్ధార్థుడు.

అప్పుడు శుద్ధార్థుడికెంతో దుఃఖం కలిగింది. అయ్యో, ప్రపంచంలో ఎంతో మంది కష్టాలు, అన్యాయాలు పడుతున్నారే. వీళ్లని ఎల్లా ఉద్ధరించటం, అని విచారించాడు.

ఇక అప్పటినుంచీ పదేళ్లపాటు ప్రపంచమంతా తిరిగాడు. ఎన్నో దేశాలు, రాజ్యాలు చూశాడు. ఎక్కడ చూసినా తన తండ్రి రాజ్యంలోలాగే దుఃఖం, బీదతనము అన్యాయము కనిపించింది.

చివరికి శుద్ధార్థుడు మళ్ళీ మగధ దేశం వచ్చాడు. ఊరూరా తిరిగి ప్రజలందరికీ ధైర్యం చెప్పాడు.

"మీరు భయపడకండి. మీరు పడేకష్టాలకు, దరిద్రానికి కారణం మీ పాపాలు కాదు, రాజులు చేసే పాపాలు. మీరు కష్టపడి పంటలు పండిస్తుంటే రాజులు అనుభవిస్తున్నారు. ఈ అన్యాయాన్ని ఎదిరించండి. దేవుడిపేరు చెప్పి రాజులు మిమ్మల్ని బీదవాళ్లని చేశారు. మీకష్టాలకన్నిటికీ కారణం మీ బీదతనమే. ఆ బీదతనాన్ని పోగొట్టాలంటే మీరు రాజులమీద ఎదురు తిరగండి" అని ఉపన్యాసాలిచ్చాడు శుద్ధార్థుడు.

ప్రజలందరూ ఈ ఉపన్యాసాలు విన్నారు. అంతకుముందు వాళ్లేమనుకున్నారంటే తమ దుఃఖాలకి కారణం తమ పాపాలని. శుద్ధార్థుడు చెప్పిన మాటలతో వాళ్లు ధైర్యం తెచ్చుకున్నారు. వాళ్లకా మాటలు నచ్చాయి. దుఃఖానికి కారణం బీదతనమని అంతకు ముందెవ్వరూ చెప్పలేదు. మొదటిసారిగా శుద్ధార్థుడే ఈసత్యం కనిపెట్టాడు.

అందుచేత దేశంలోని ప్రజలంతా అతన్ని "బుద్ధుడు" అని పిలవటం ప్రారంభించారు.

శుద్ధార్థుడు, కాదు, ఇకనుంచీ ఆయన్ని బుద్ధుడని పిలుద్దాం. బుద్ధుడు మగధదేశంలో ఊరూరా తిరిగి ప్రజలకి తను కనుక్కున్న సత్యం తెలియజేశాడు. ప్రజలు బుద్ధుని శిష్యులయ్యారు. ఆయన ఉపదేశాలని ఆచరణలో పెట్టటానికి సిద్ధపడ్డారు.

మగధ దేశపురాజు సిద్ధోదనుడికి ఈసంగతి తెలిసింది. ఎవరో బుద్ధుడట, ప్రజలనందరినీ రాజు మీద ఎదురు తిరగమని చెబుతున్నాడట, అని ఆయన విన్నాడు. అంతేకాని ఆ బుద్ధుడు తను గారాబంగా పెంచిన కొడుకేనని ఆయనకి తెలియలేదు. ఆ బుద్ధుడిని, అతనికి శిష్యులుగా తయారై తనమీద కత్తులు నూరుతున్న ప్రజలని, చంపివెయ్యాలని సిద్ధోదనుడనుకున్నాడు.

చివరికి పెద్ద యుద్ధం జరిగింది. కష్టపడి పనిచేసే ప్రజలు, మిగతా బీదవాళ్లు అంతా బుద్ధుడివైపు చేరారు. డబ్బుగలవాళ్లు అంతా సిద్ధోదనుడివైపు చేరారు. ఆ యుద్ధంలో అటు బుద్ధుడు, ఇటు సిద్ధోదనుడు స్వయంగా వచ్చి పోట్లాడారు. బుద్ధుడు మారువేషంలో ఉండటంవల్ల సిద్ధోదనుడు అతన్ని తన కొడుకేనని గ్రహించలేకపోయాడు. సిద్ధోదనుడు వేసిన బాణం ఒకటి బుద్ధుడి గుండెలో గుచ్చుకుంది. బుద్ధుడు పడిపోయాడు.

అప్పుడు రాజు సైనికులు బుద్ధుడిని సిద్ధోదనుడి వద్దకు తీసుకువచ్చారు. కొనవూపిరితో వున్న బుద్ధుడు రాజుతో ఇల్లా చెప్పాడు.

"రాజా! నేనెవరో గుర్తుపట్టావా? పదేళ్లకిందట నీయిల్లువిడిచి పోయాను. నువ్వు ఎంతో గారాబంగా పెంచిన నీకుమారుణ్ణి నేను. నీ ఇంటిని నాకు ఖైదులాగా చేశావు. అందుకనే వెళ్లిపోయాను. నేను ప్రపంచంలోకి వెళ్లిచూశాను. ఆ ప్రపంచాన్ని నువ్వు, నీలాంటి రాజులు అంతకంటే పెద్ద ఖైదుగా చేశారు. ఆ ఖైదులో బాధపడుతున్న ప్రజలని ఉద్ధరించటానికి నేను కంకణం కట్టుకున్నాను. అందుకే తండ్రివైన నీతో కూడా నేను యుద్ధం చేశాను. యుద్ధంలో గెలవకుండా చనిపోతున్నాననే నా బెంగ." అని చెప్పి బుద్ధుడు ప్రాణాలు విడిచాడు.

బుద్ధుడు తన కొడుకేనని తెలిసి రాజు వలవల ఏడ్చాడు. ప్రజలు తమ నాయకుడైన బుద్ధుడు రాజు కొడుకేనని తెలిసి ఎంతో ఆశ్చర్యం ఆయన చనిపోయినందుకు ఎంతో దుఃఖం పొందారు.

అప్పుడు సిద్ధోదనుడికి జ్ఞానోదయమైంది. తన రాజరికాన్ని వదిలివేశాడు. ప్రజలందరికీ తను కూడబెట్టిన డబ్బు పంచియిచ్చాడు. అందరికీ పొలాలు పంచిపెట్టాడు. తను కూడా ప్రజల్లో ఒకడై, తను కష్టపడి పండించినదే అనుభవిస్తూ జీవించాడు.

ఇక ఆరాజ్యంలో ఎవరూ ఏచీకు చింత లేకుండా కష్టపడి పని చేస్తూ ఎక్కువతక్కువలు లేకుండా సమానంగా అనుభవిస్తూ ఒకళ్ల కష్టసుఖాలను ఒకళ్లు పంచుకుంటూ జీవించారు. ★

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(7-వ పేజీ తరువాయి)

"అభూతకల్పన కాదండి. అది నిజం. సెంట్ ఫెర్నాండ్ ఓడ పైలట్ కామా ఒకసారి వెళ్లి చూశాడండి. అతను ఆశ్చర్యంలో మునిగిపోయాడు. తిరిగి వచ్చి అటువంటి అద్భుతైశ్వర్యాన్ని పుక్కిటికథల్లో తప్ప ఎరగనన్నాడు."

"అయితే వెళ్లమనే నీ ఉద్దేశమా ?"

"అది తమ ఇష్టం. నే నెలాటి సలహా ఇవ్వలేను."

ఫ్రాంజ్ కొంతసేపు ఆలోచించాడు ఇంతటి ఐశ్వర్యవంతుడికి తనమీద కుట్ర పన్నవలసిన అవసరం ఉండదనుకున్నాడు. తన దగ్గిరున్నది కొన్ని వేల ఫ్రాంకులే. భోజనంమాట తల్చుకుని ఫ్రాంజ్ ఒప్పుకున్నాడు. గేతానో వెళ్లి ఈ కబురు చెప్పాడు. ఈలోగా ఫ్రాంజ్ ఒక నావికుని పిలిచాడు. దగ్గరలో ఒక్క బోటుకూడా కనపడ్డంలేదు. వీళ్లందరూ ఇక్కడి కెలా వచ్చి ఉంటారని ప్రశ్నించాడు.

"అదేముందండి ?" అన్నాడు నావికుడు. "వాళ్ళ బోటు నాకు తెలుసునండి. అది చాలా చక్కగా ఉంటుంది. ఇంగ్లీషు దేశస్థుల యాట్ పోలిక నుంటుంది. అది ఎలాటి గాలిలో నైనా సరే ప్రయాణం చెయ్యగలదు."

"అదెక్కడ నిర్మించారో ?"

"నాకు తెలియదండి. కాని జినోవాలో నిర్మించి ఉంటారనుకుంటాను"

"కాని అక్రమవ్యాపారం చేసేవాళ్ల నాయకుడు అటువంటి బోటు నిర్మించాలని జినోవా నిర్మాతలకి ఆజ్ఞ ఎలా ఇవ్వగలడు ?"

"ఈ బోటుయజమాని అక్రమవ్యాపారుల నాయకుడని నేను చెప్పలేదే ?"

"మరెవరతను?"

"పెద్ద భాగ్యవంతుడండి. కేవలం వినోదంకోసం ప్రయాణాలు చేస్తాడు."

"అతనిపేరు ?"

"అతన్ని పేరడిగితే సింద్ బాద్ అని చెప్తాడు."

"మీకోసం ఆయన వేచిఉన్నారండి" అన్నారొకరు ఫ్రాంజ్ వెనకనించి. గొంతుకనుబట్టి ఒడ్డుపై నిలబడిన పహరా వాడిదని ఫ్రాంజ్ కనిపెట్టాడు. అతనివెనక మరిద్దరున్నారు.

ఫ్రాంజ్ వెనక్కి తిరిగి మాట్లాడకుండా చేరుమాలు తీసి అందించాడు. వాళ్లుకూడా మాట్లాడకుండా అది అతని కళ్లకి కట్టారు. చూపుకి ఎక్కడా సందులేకుండా అతిజాగ్రత్తగా కట్టారు. ఇంత జాగ్రత్తచూస్తే ఇతనే అఘాయిత్యం చేసిపోతాడో నని వాళ్లు అనుమానించినట్లున్నారు. కళ్ళకి కట్టిన గుడ్డని విప్పనని అతనిచేత ప్రమాణం చేయించారు. తరవాత ఇద్దరు అతని చేతులు రెండూ పట్టుకుని నడిపించుకుని వెళ్లారు. పహరా ముందు నడిచాడు.

కొద్దిఅడుగులు వేసినతరవాత ఫ్రాంజ్ కి కాలిన మాంసం వాసన దట్టంగా తగిలింది. మంటపక్కగా నడుస్తున్నట్లు అతను గ్రహించాడు. ఏభై అడుగులు వెళ్లినతరవాత మొదట వెళ్ళవద్దని వాళ్లు వారించినదారిని ఇప్పుడువెడుతున్నట్లు ఊహించాడు. కొంత సేపైనతరవాత వాతావరణం మారిపోయినట్లు అతనికి తోచింది. ఒక గుహప్రవేశించినట్లు అత నూహించాడు. తరవాత మెత్తని తివాసీలమీద నడుస్తున్నట్లు గ్రహించాడు. హఠాత్తుగా అతని చేతులు రెండూ విడిచిపెట్టబడ్డాయి. క్షణంసేపు అంతా నిశ్శబ్దంగా ఉంది. తరవాత విదేశీ ఉచ్చారణలో ఫ్రెంచిభాషలో ఒకరన్న మాటలు వినపడ్డాయి. "నమస్కారం. కళ్ళకికట్టుకున్న రుమాలు తియ్యండి."

వెంటనే రుమాలు తీసేశాడు ఫ్రాంజ్. దాదాపు నలభై యేళ్ల పురుషు డతని సమక్షంలో ఉన్నాడు. అతను ట్యూనిస్ దుస్తులు ధరించాడు. బంగారు నగిషీకల నల్లనికోటు ధరించాడు. ముఖం పాలిపోయిన తెలుపురంగులో ఉన్నప్పటికీ, ఒక వింత అందం గోచరిస్తుంది. కన్నులు కాంతివంతంగా చురుగ్గా ఉన్నాయి. లోతులు చూడగల వనిపిస్తుంది. వాలు నుదుటితోపాటు తిన్నని ముక్కు గ్రీక్ విశిష్టతను శోభింపచేస్తుంది. పళ్లు తెల్లగా ముత్యాలవలె ఉన్నాయి. నల్లని చిన్నమీసా లున్నాయి. అన్నిటిలోకీ అతని పాలిపోయిన ముఖం వింతగా కనపడింది. గోరీలో పాతిపెట్టబడినవాడు మళ్ళీ బతికి కొంత కాలానికి పైకి వచ్చినట్లే ఉంది అతని ముఖం. మరీ పొడగరి కాకపోయినా ఎత్తైన మనిషేనని చెప్పవచ్చు. దక్షిణప్రాంతవాసుల మాదిరిగా కాళ్లు, చేతులు పొట్టివి. కాని అన్నిటికంటె, పరిసరాలను చూసి ఫ్రాంజ్ అబ్బురపడ్డాడు. గేతానో చెప్పినది భ్రమా కల్పితమనుకున్నాడు కాని ఇప్పు డిది అంతకంటె అద్భుతంగా కనపడింది. అంతటా టర్కీ ఫలినెక్ పరచబడి ఉంది. గోడలపైన బంగారు నగిషీపని ఉంది. ఒకపక్క చక్కని సోఫా, దానిపక్క గోడను వేలాడదీసి రత్నాలు తాపిన పిడులతో అరబ్బీఆయుధా లున్నాయి. పైకప్పునుంచి వెనీషియన్ గాజుదీపాలు వేలాడుతున్నాయి. దీపాలలో రంగురంగులగాజు బుడ్లున్నాయి. నేలంతటా చక్కని టర్కీ ఫతివాసీ పరిచిఉంది. ద్వారాలకు పట్టుతెర లున్నాయి. గదులు దీపకాంతులతో ఉజ్వలంగా ప్రకాశిస్తున్నాయి. ఫ్రాంజ్ నిఇదంతా చూడనిస్తూనూతన వ్యక్తి జాగ్రత్తగా అతన్ని పరికించాడు. చివరి కిలా అన్నాడు: "క్షమించాలి, మిమ్మల్ని తీసుకురావడంలో పెట్టిన ఇబ్బందికి క్షమించాలని వేడుకుంటున్నాను. ఈ ద్వీపం సామాన్యంగా నిర్జనంగా ఉంటుంది. నా రహస్యనివాసం తెలిసిపోయినట్లయితే నేను వెళ్లి తిరిగి వచ్చేలోగా జనంవచ్చి పాడుచెయ్యవచ్చు. అది నేను సహించలేను."

"బాగా చెప్పారు! మీరు క్షమార్పణ కోరవలసిన అవసరం లేదు. ఏదో కథలో జరిగినట్టు, ఇటువంటి అద్భుత గృహాలకి వెళ్లేవాళ్లు కళ్లకి గంతలుకట్టుకునే వెడతారు. అది నాకు తెలుసును. మీరు చేసినదానిలో తప్పేమీ లేదని ఇక్కడ ఈ అద్భుతాలు చూస్తేనే తెలుస్తోంది. ఇదంతా చూస్తుంటే అరేబియన్ నైట్స్ కథల్ని తలదన్నినట్లుంది."

సరిగ్గా అప్పుడే వనకద్వారం తెర తొలగింది. తెల్లని దుస్తులు ధరించిన నల్లని ఒక నీగ్రో వచ్చి యజమానికి సలాంపెట్టి లోపలి గదిలోకి రావచ్చునని సంజ్ఞచేశాడు.

నూతన వ్యక్తి ఇలా అన్నాడు: "ఒకరిపే రొకరికి తెలియకుండా గంటలకొద్ది లోకాభిరామాయణం మాట్లాడుకోడం కష్టం. మీరు కూడా అలా అనుకుంటున్నారో లేదో నాకు తెలియదు. కాని ఆతిథ్యమిస్తున్నాను కదా అని మీ పేరు, ఊరు అడగడం నా కిష్టంలేదు. మిమ్మల్ని నేను ఎలా పిలవాలో మాత్రం చెప్పండి. నన్నైతే, సింద్ బాద్ అని తెలిసినవాళ్లు పిలుస్తారు."

"నా సంగతి మనవిచేస్తాను. మంత్రప్రదీపం మినహాగా అరేబియన్ నైట్స్ కథలో అల్లాఉద్దీన్ మాదిరిగా ఉన్నాను నేను. అందువల్ల నన్ను అల్లాఉద్దీన్ అనెందుకు పిలవకూడదు ?"

"సరే అలాగే పిలుస్తాను. భోజనం సిద్ధంగా ఉంది. దయ చెయ్యండి."

ఫ్రెంచి యువకుడు ఒక అద్భుతదృశ్యం గడిచి, మరొక అద్భుతదృశ్యం చూశాడు. రెండో సావడిలో పెద్దమేజా ఆహార వస్తువులతో నిండిఉంది. ఫ్రాంజ్ చుట్టూ చూశాడు. పొడుగైన ఈ సావడిఅంతా చలువరాతితో నిర్మించబడింది. గోడలపైన చక్కని శిల్పాలు చెక్కబడినాయి. గది నాలుగుమూలలా రెండేసి శిలాప్రతిమ లున్నాయి. ప్రతిమల శిరస్సులపైన ఫలాలతో నిండిన పళ్లెరా లున్నాయి. దూరదేశాలనుంచికూడా తెచ్చిన రకరకాల ఫలాలు కనపడ్డాయి. మేజాపైన పళ్ళెరాలలో మధుర, మాంసాది భక్ష్యాలనేకం అమర్చిఉన్నాయి.

ఫ్రాంజ్ కలకంటున్న అనుమానంతో కన్నులు నులుముకుని చూశాడు. నీగ్రో ఒక్కడే ఆహారవస్తువులు చకచకా అమర్చుతున్నాడు. అతని చాకచక్యాన్ని ఫ్రాంజ్ మెచ్చుకున్నాడు. అపరిచిత వ్యక్తి భోజనాని కుపక్రమిస్తూ ఇలా అన్నాడు: "అవును పాపం అతనికి నేనంటే భక్తి ఎక్కువ. శక్తివంచనలేకుండా సేవ చేస్తాడు. అతని ప్రాణాన్ని నేను కాపాడినమాట ఎప్పుడూ మరిచిపోడు."

"అతని ప్రాణాన్ని ఎలా కాపాడారో చెప్పడానికి మీకు అభ్యంతర ముంటుందా ?"

"లేదు లేదు. అదేమంత పెద్దవిషయం కాదు. ట్యూనిస్ రాజు జనానా అంతఃపురందగ్గిర తచ్చాడుతుండగా ఇతన్ని పట్టుకున్నారుట. అటువంటిచోట, అందులోనూ నీగ్రో అయినవాడు తిరగడం అంటే, అది సామాన్య నేరం కాదు. అందువల్ల మొదటిరోజుని అతని నాలుక, రెండో రోజుని చేతులు, మూడోరోజుని తల తెగెయ్యమని రాజు ఆజ్ఞ ఇచ్చాడుట. నాకు సేవ చెయ్యడానికి మూగవాడొకడు కావాలని ఎప్పుడూ అనుకునేవాడిని. అందువల్ల అతని నాలుక కోసేవరకూ ఊరుకుని, ఆ తరవాత నా రెండు బారుల తుపాకీ రాజు కిచ్చి, అతన్ని నా కిమ్మని అడిగాను. ఆ తుపాకీమీద రాజు అంతకు ముందే కన్నేశాడు. కాని అతన్ని ఎలాగైనా హత మార్చాలని పట్టుదలతో ఉన్నాడేమో, ముందు సందేహించాడు. అప్పుడు తుపాకీతోపాటు ఇంగ్లీషు వేటకత్తికూడా ఇచ్చాను. అది చాలా మంచికత్తి. దాంతో ఒక్క దెబ్బకొట్టేసరికి రాజు కత్తి ముక్క ముక్కలయింది. అప్పుడొప్పుకున్నాడు నా మాటకి. అయితే అతను మళ్ళీ ట్యూనిస్ దేశం తిరిగి చూడకూడదని ఆంక్ష పెట్టాడు."

ఫ్రాంజ్ కొంతసేపు యోచించాడు. ఈ అపరిచిత వ్యక్తి రవ్వంత కూడా దాక్షిణ్యం చూపక, కొంత హాస్యధోరణిలో చెప్పిన ఈకథ విని, అతనికి ఆశ్చర్యం కలిగింది. చిట్టచివరికి విషయం మార్చి ఇలా అన్నాడు: "అయితే మీరు పెట్టుకున్న పేరు సార్థకపరిచి, నిత్యం సముద్రప్రయాణాలు చేస్తున్నారన్న మాట."

"అవును. నేను సాధించగలనని కలలోకూడా అనుకోని క్షణంలో తీసుకున్న ప్రతిజ్ఞను ఇప్పుడు పాలిస్తున్నాను. ఇదొక్కటే కాదు. మరికొన్ని విషయాల్లోకూడా ప్రతిజ్ఞ తీసుకున్నాను. అవికూడా పాలించగలననే ఆశ పడుతున్నాను."

ఎంత ప్రశాంతంగా ఈ మాటలు మాట్లాడుతున్నా, అతని కళ్లలోమాత్రం చిత్రమైన క్రౌర్యం ఉట్టిపడుతోంది.

"మీరు చాలా కష్టాలు పడ్డట్టున్నారు" అన్నాడు ఫ్రాంజ్.

సిందబాద్ ఉలిక్కిపడ్డాడు. ఫ్రాంజ్ వంక నిదానంగా చూసి, "ఎల్లా అనుకున్నారు?" అన్నాడు.

"మీ కంఠస్వరాన్నిబట్టి" అన్నాడు ఫ్రాంజ్. "మీ ముఖంలోని భావం, పాలిపోయిన మీ ముఖవర్ణం, మీ చిత్రమైన ఈ జీవనం, వీటినిబట్టి చెప్పవచ్చును."

"నిజంగా ? అబ్బే! నాకేం ? నేను స్వర్గసుఖాలు అనుభవిస్తున్నాను. పాదుషాలాగున్నాను. సృష్టికర్త నాకు అన్నివరాలూ ఇచ్చినట్లున్నాడు. నాకే చోటు నచ్చితే అక్కడుండగలను. నచ్చకపోతే వెళ్లిపోగలను. నాకున్న స్వేచ్ఛ మరెవరికీ లేదు. విహంగాలకే ఉంటుంది. నాకూ విహంగాలమాదిరిగా నే రెక్కలున్నాయి. నా చుట్టూఉండేవాళ్లందరూ నా చేసంజ్ఞలు గమనించి ఆజ్ఞలు పాలిస్తారు. నేననుభవిస్తున్న జీవితాన్ని మీ రొక్కసారి చవిచూసినట్లయితే ఇంక విడిచిపెట్టరు. ఎన్నడూ మళ్లీ ప్రపంచంలో నలుగురిమధ్యా ఉండాలనుకోరు—ఇతరత్రా ఏదో గొప్ప ఆశ లుంటే తప్ప."

"ఏం ? ఎందు కుండకూడదు? మాటవరసకి చెప్తున్నాను. పగ తీర్చుకోవలసివస్తే ఇవన్నీ వొదిలెయ్యవచ్చును." అన్నాడు ఫ్రాంజ్.

"అసలు పగ తీసుకోడం అనే దెందు కుంటుంది?"

"ఎందుకంటే, మిమ్మల్ని చూస్తే, సమాజం పీడించగా పగ తీసుకోడానికి చూస్తున్న మనిషిలా కనిపిస్తున్నారు."

సిందబాద్ నవ్వాడు. అతని నవ్వు వింతగా ఉం...

"అబ్బే! మీరు పొరబడుతున్నారు. నిజానికి నేను ఒక తరహదానశీలుణ్ని. ఎప్పుడో ఒకరోజు పారిస్ వెళ్లి దానధర్మాలు చెయ్యడంలో ఆపర్ట్‌తో పోటీ చెయ్యగలనుకూడా."

"ఆ సమయానికి నేను పారిస్‌లో తప్పకుండా ఉంటాను. ఇక్కడ మీరు చూపుతున్న ఆదరానికి అప్పుడు ఋణం తీర్చుకుంటాను."

"మీ ఆహ్వానాన్ని ఎప్పుడో తప్పకుండా స్వీకరిస్తాను. కాని దురదృష్టవశాత్తు, ఇప్పుడు పారిస్ రావాలంటే మారుపేరు పెట్టుకుని రావలసివస్తుంది."

భోజనం ముగిసింది. కాని అపరిచితవ్యక్తి ఒక్కవస్తువునైనా ముట్టలేదు. ఫ్రాంజ్ పుష్టిగా తిని త్రేన్చాడు.

ఆలీ (నీగ్రో) పండ్ల పళ్లెరాలు రెండు తెచ్చి మేజాపైన పెట్టాడు. రెండింటిమధ్యనూ చిన్న వెండి భరిణె ఒకటి ఉంచాడు. ఆలీ భరిణె ఎంత పదిలంగా తెచ్చిపెట్టాడో చూసేసరికి ఫ్రాంజ్ కి కుతూహలం కలిగింది. భరిణె మూత తీసి చూశాడు. అందులో ఆకుపచ్చని చిక్కని లేహ్యం కనపడింది. అదేమిటో అతని ఊహకి అందలేదు. మూత వేసేశాడు. అపరిచితవ్యక్తి వంక చూశాడు. అతను నవ్వుతున్నాడు.

"మీ రూహించలేకుండా ఉన్నారుకాదూ ?"

"అవును"

"ఇదొక దివ్యమైన మధుర ఖాద్యం. దీన్నే గ్రీక్ దేవతలలో ముఖ్యుడైన జుపిటర్ కి, హీబి తినబెట్టింది."

"కాని ఈ దేవతల ఖాద్యంమనుష్యుల చేతుల్లో పడగానే పేరు మార్చుకోలేదా ? దీన్ని చూస్తే ఆ ట్టే తినబుద్ధి కావడం లేదు. కాని, స్పష్టంగా చెప్పండి, దీన్ని ఏమంటారు ?"

"అబ్బే" అన్నాడు సిందబాద్. "మీరు వ్యవహారనీతి తెలిసినవారైతే, కాంచనం మీ ఆరాధ్యదేవతైతే, దీన్ని రుచి చూడండి. రుచి చూసి, గుజరాత్, గోల్కొండ, పెరూ బంగారుగనుల్ని మీ కళ్ళముందు సాక్షాత్కరింపచేసుకోండి. మీరు భావాలకు ఉద్రూతలూగే విశిష్టవ్యక్తులేనా ? మీరు కవులేనా ? అయితే, ఇది రుచిచూడండి. రుచి చూసేసరికి మిమ్మల్ని ఈ వాస్తవజగత్తుకి బంధించిఉంచిన

బంధాలు తెగిపోతాయి. మీకు ఆశలున్నాయా? ప్రాపంచికోన్నతి మీకు కావాలా? ఇది రుచిచూడండి. విశ్వానికంతకీ అధిపతులౌతారు. మారుమూల సరిహద్దులమధ్య ఒదిగిన ఫ్రాన్స్, స్పెయిన్, ఇంగ్లండ్ రాజ్యాలరాజుల మాదిరి కూడా కాదు. ప్రపంచానికంతకీ సార్వభౌములౌతారు. సృష్టికంతటికీ కర్తలౌతారు. ఇది చాలదా?— ఈ కాస్త రుచిచూడ్డానికి? చూడండి."

ఈమాటలంటూ సింద్‌బాద్ భరిణి మూత తెరిచి, ఒక చెంచానిండా ఆ అద్భుతలేహ్యం తీసి, మెల్లిగా చప్పరించాడు. తల వెనక్కి వాల్చి, కన్నులు మూసుకున్నాడు.

"ఇది గంజాయితో చేసిందికాదూ?" అన్నాడు ఫ్రాంజ్.

"అదేనండి."

"కాని మీరు పొగిడినదంతా స్వయంగా అనుభవించికాని నమ్మలేను."

"తప్పకుండా, కాని ఒక్కసారి రుచిచూసి తేల్చివెయ్యకండి. ఏదైనాసరే క్రమంగా అలవాటు చేసుకుని తరవాత నిర్ధారణకి రావాలి. ఈ దివ్యమధురపదార్థాన్ని సులువుగా నెత్తుకోర్చదు. అసలు మన ప్రకృతి ఆనందాన్ని సహించదు. ఎప్పుడూ బాధనే అంటిపెట్టుకుంటుంది."

దీనికి సమాధానంగా నన్నట్లు ఫ్రాంజ్ ఒక చెంచా లేహ్యం తీసుకుని చప్పరించాడు.

"అబ్బ!" అన్నాడు, హితవు లేనట్లు. అది మింగి "అబ్బ! ఇదెక్కడి ఖాద్యం? చూస్తే మీరు చెప్పినంత మధురంగా లేదే?" అన్నాడు.

"ఎందువల్లనంటే, దీని రుచి తెలుసుకోడానికి అవసరమైన రసస్ఫూర్తి మీకింకా సిద్ధించలేదు. మీరే చెప్పండి. మొట్టమొదటిసారిగా రుచి చూసినప్పుడు మీకు టీకాని, ధూమపానం కాని హితవయిందా? రోమన్లు మాంసాన్ని వండేటప్పుడు ఇంగువ వాడతారు. చీనాదేశస్థులు పిచ్చుకగూళ్లు తింటారు. అవి వాళ్లకెలా రుచిస్తాయో మీకు ఎలా అర్థమౌతుంది? అలాగే గంజాయి కూడా. వారం రోజులు రోజూ దీన్ని పుచ్చుకోండి. ఇప్పుడు చేదుగా, నాలుకపై పెట్టుకోడానికికూడా హితవు లేని ఈ లేహ్యాన్ని పోలిన అద్భుత ఖాద్యం ప్రపంచంలో మరొకటి లేదని మీరే అంటారు. అది సరే లెండి. పక్క గదిలో కూర్చుందాం ర "

ఇద్దరూ లేచారు. రెండో గదిలో అంత ఆడంబరం, అలంకారం లేకపోయినా చక్కగా అమర్చి ఉంది. ఈ గది గుండ్రంగా ఉంది. చుట్టూ పెద్ద సోఫా ఒకటి అమర్చిఉంది. సోఫాలోనూ, గోడలపైనా, నేలపైనా ఉన్నిగుడ్డలు పరిచిఉన్నాయి.

ఇద్దరూ సోఫాలో చేరగిలపడ్డారు. సమీపంలో పొగాకు పీల్చే గొట్టాలు నింపబడిఉన్నాయి. ఇద్దరూ చెరొకటీ తీసుకున్నారు. ఆలీ వచ్చి నిప్పు ముట్టించి వెళ్లిపోయాడు.

"మీరు కాఫీ ఎలా తీసుకుంటారు? ఫ్రెంచితరహాలోనా? టర్కిష్ తరహాలోనా?" అని అడిగాడు సింద్‌బాద్.

"టర్కిష్ తరహా చూస్తాను."

"అదే బాగుంది. అంటే ప్రాచ్యదేశాలవారి పద్ధతులంటే మీకు నచ్చుతాయన్న మాట. అసలు జీవితంలో ఆనందించడం అంటే ప్రాచ్యదేశాలవాళ్లకే తెలుసును. నేను పారిస్‌లో వ్యవహారాలన్నీ పరిష్కరించుకోగానే, ఆ దేశాలకే వెళ్లిపోతాను. అప్పుడు మీరు నన్ను చూడాలనుకుంటే, కైరో, బాగ్దాద్, ఇస్పహాన్ నగరాలు వెతకవలసిఉంటుంది."

"ఓ! నేను నిజం చెప్తున్నాను. దానంత సులువైనపని అదే కాని మరొకటి లేదు. నాకిప్పుడు రెక్కలొచ్చి ఆకాశంలో విహరిస్తున్నట్లుంది. ఈ రెక్కల్తో ఎగిరి ఇరవైనాలుగ్గంటల్లో ప్రపంచాన్ని చుట్టి రాగల ననిపిస్తోంది."

"ఆ! అయితే గంజాయి ఇప్పుడు పనిచేస్తోందన్నమాట బాగుంది. బయలుదేరండి, రెక్కలు విప్పి ఆకాశవీధుల్లో విహరించండి."

ఇలా అని ఆ అపరిచితవ్యక్తి అరబ్బీభాషలో ఆలీకి ఏవో చెప్పాడు. ఆలీ సలాంపెట్టి కొద్దిదూరంలోకి వెళ్లి నిలిచాడు.

ఫ్రాంజ్‌కి లోలోపల అద్భుత పరివర్తనం అనుభవమౌతోంది. శరీరం తేలికైపోతున్నట్లుంది. మెదడులో జాజ్వల్యమానమైనదృశ్యాలు మెదల నారంభించాయి. జ్ఞానేంద్రియాలు రెండింతలు చురుగ్గా పనిచెయ్య నారంభించాయి. దిఙ్మండలం విరిసి విశాలంగా విచ్చుకుంటున్నట్లుంది. కాని ఈ ఆకాశం వేరు. స్పృహ తప్పిపోతున్న సమయంలో కనపడిన భయోత్పాతమైన దృశ్యం కాదిది. ఇది పల్చని నీలితెరలాఉంది. సముద్రంలోని నీలివర్ణాన్ని సూర్యునికాంతిని తెచ్చి కలబోసినట్లుంది. మెల్లని వాయువులు అపూర్వసుగంధాలను మోసితెస్తున్నాయి. నావికుల గీతాలు స్పష్టంగా, బిగ్గరగా వినపడుతున్నాయి. ఈ గీతాలు మాయ అని భావించడానికి వీలులేదు. క్రమంగా అతని దృష్టికి మాంట్‌క్రిస్టో ద్వీప స్వరూపం గోచరించింది. అది ఈ మారు తరంగాల తాకిడికి కోపించిన రౌద్రాకారం కాదు. ఎడారిమధ్యలో ఉద్యానవనంవలె ఉంది. నౌక ద్వీపాన్ని సమీపిస్తోంది. గీతం మరింత బిగ్గరగా వినపడుతోంది. కైలాసంవలె ఉన్న ఈ ద్వీపం సమీపమౌతున్నకొద్దీ, సుస్పష్టమైన గీతం వెనుక అవ్యక్తమైన రాగాలాపన వినపడింది. హృదయాన్ని ఆకర్షించే దివ్యసంగీతం వినవచ్చింది.

నౌక చల్లగా, మెల్లిగా తీరం చేరి దానంతటదే నిలిచిపోయింది. దివ్య సంగీతం ఆలకిస్తూ అతను గుహాప్రవేశం చేశాడు. కొన్ని మెట్లు దిగాడు. అద్భుత సుషుప్తికి ముందు ఏవేవి చూశాడో, అవన్నీ మళ్లీ కనపడ్డాయి. సింద్‌బాద్ కనపడ్డాడు. ఆలీ ఉన్నాడు. తరవాత అంతా కన్నుల ఒక్కసారిగా ముందు చెరిగిపోయింది. ఆపైన ఒక సావడిలో శిలాప్రతిమల మధ్యనున్నట్లు అతనికి తోచింది. ఆ శిల్పమూర్తులు ఇప్పుడు అద్భుతంగా ఉన్నాయి. ఒంటి వొంపులలో కవిత్వం ఉంది. కన్నులలో మంత్రశక్తి ఉంది. నవ్వులలో విశృంఖలత కనపడింది. శిరోజాలు కెరటాలవలె లేచి కవ్విస్తున్నాయి. ఆ మూర్తులలో అప్సరఃకాంతలు, త్రిలోకసుందరులు ఉన్నారు. పరులచూపులకు వెరవని స్వేచ్ఛతో, అందాలు రూపింపచేసుకునే ముగ్గురు ప్రౌఢల మధ్య, నీరెండ బంగారుకిరణంవలె, యౌవనం అప్పుడే మొలకెత్తగా ఒక కన్య సిగ్గులు విరజిమ్ముకుంటోంది. చలువరాతిబొమ్మల స్వైరవిన్యాసాల మధ్య, ఈ మధురదృశ్యం అతన్ని పరవశుని చేసింది.

తరవాత ప్రౌఢలు ముగ్గురూ తనని చూసి ఆకర్షింపబడినట్లు తోచింది. రెండవ నిద్రలో శయనిస్తున్న అతని తల్పంవద్దకు ముగ్గురూ వచ్చారు. వారి పాదాలు అంబరాలలో దాగిఉన్నాయి. శంఖసన్నిభాలయిన కంఠాలను అప్పుడప్పుడు దీర్ఘ శిరోజాలు స్పృశిస్తున్నాయి. ఈ ఆకర్షణకు పూర్వం దేవతలు వీగిపోయారు. విరాగులు మాత్రం చలించలేదు.

శిలాప్రతిమలకు చైతన్యంతోపాటు వాణి సిద్ధించింది. హృదయాలకు నెత్తుటి వెచ్చదనం వచ్చింది. గంజాయిప్రభావంలో ఫ్రాంజ్‌కి మొట్టమొదటిసారిగా మధురరసభావన కలిగింది. అతని ఒళ్లు పరవశమైపోతోంది. పరవశంలో దుర్భర వేదన ఇమిడిఉంది.

ప్రౌఢసుందరుల అధరాలు తాకినంతలో అతని అధారాలు వేడిమిలో వేగిపోయాయి. అధరాలు అధరాల నంటినంతలోనే సర్పాల చలిపడగలు సోకినట్లయింది. తెలియరాని ఈ ప్రేమని విదల్చుకోడానికి అతను చేతులతో ఎంత గెంటివేసినా నా, ఈ మాయా స్వప్నానుభవం అతని ఇంద్రియాలను లోబరుచుకుంటోంది. స్వప్నంతో పెనగులాడి పెనగులాడి చివరికి నిస్సహాయుడై నిద్రలో వొరిగిపోయాడు.

32

ఫ్రాంజ్‌కి మెలకువ రాగానే, చుట్టూ చూసి, ఇంకా కలలోని దృశ్యాలే చూస్తున్నట్లు భ్రమించాడు. సూర్యరశ్మి చొరనేరని సమాధిగృహంలో తానున్నట్లు భావించాడు. ఒక చెయ్యి చాచాడు. ఒక రాయి తగిలింది. లేచి తిన్నగా కూర్చున్నాడు. మెత్తని గడ్డిపైన పడున్నట్లు తెలిసింది.

కలంతా మాయమయింది. మెలకువ వచ్చిరాగానే, శిలాప్రతిమలు అంతర్ధానమైనాయి.

పగటివెలుగు కనపడుతున్నవైపు రెండడుగులు వేశాడు. కలలోని కల్లోలం అంతా పోయి వాస్తవప్రపంచ ప్రశాంత వాతావరణంలో పడ్డాడు. అతనొక గుహలో ఉన్నాడు. సగం తెరిచినద్వారంగుండా నీలాకాశం, నీలిసముద్రం కనపడ్డాయి. ఆకాశంలోనూ, సముద్రంపైనా సూర్యుని ప్రభాతకిరణాలు వ్యాపించాయి. సముద్రతీరాన నావికులు నవ్వుతూ పేలుతూ కూర్చుని గడుపుతున్నారు. ఒడ్డుకి పదిగజాల దూరంలో బోటు నీటిపై తేలుతోంది.

కొంతసేపు శుభ్రవాయువులు పీల్చి ఆనందించాడు. తరంగాల అవ్యక్తఘోష ఆలకించాడు. చుట్టూ దృశ్యాన్ని క్షణకాలం తిలకించి, గ్రహింపుకి తెచ్చుకున్నాడు. అద్భుత స్వప్నాన్నీ, ప్రకృతి అపూర్వ సౌందర్యాన్ని క్షణంకాలం మరిచి, వాస్తవంగా తాను చూస్తున్న దేమిటని పరిశీలించాడు. క్రమంగా అతనికి బోధపడింది. కలలో కన్నదెంత బూటకమో తెలిసి వచ్చింది. తరవాత అతనికా కలలోని సంగతులు జ్ఞప్తికి రాసాగినాయి.

ద్వీపానికి రావడం, అక్కడ అక్రమవ్యాపారుల నాయకునితో పరిచయం, భూగర్భాంతర మందిరం, మృష్టాన్నం, గంజాయితో చేసిన లేహ్యం అన్నీ జ్ఞప్తికి వచ్చాయి.

ఇప్పుడీ పగటివెలుగులో వాస్తవపరిసరాలమధ్య నున్నందువల్ల ఇవన్నీ ఏడాదికిందటి విషయాలైనట్లు తోచింది. కాని కలలోని విషయాలన్నీ వాస్తవంగా జరిగినట్లున్నందువల్ల అవి అతని హృదయంలో గాఢంగా ముద్రితాలైనాయి. మాటిమాటికీ రాత్రి కలలో కనపడిన నీడలు కళ్లముందు కదులుతున్నట్లుంది. ఇది మినహా అతని మనస్సు ప్రశాంతంగా ఉంది. అలసట తీరినట్లు శరీరంలో కొత్తఉత్సాహం, చురుకు కనపడ్డాయి. పరిసరాలను మరింత తమకంతో చూడగలుగుతున్నాడు.

నావికు లున్నచోటికి చకచకా నడిచివెళ్లాడు. అతన్ని చూసీచూడగానే అందరూ లేచి నిలిచారు. కెప్టెన్ గేతానో ముందుకు వచ్చాడు. "స్వయంగా తమకు వీడ్కోలు ఇవ్వలేకపోయినందుకు క్షమించవలసిందని సింద్‌బాద్ తమతో చెప్పమని ఆజ్ఞ ఇచ్చారు. అత్యవసరకార్యంవల్ల ఆయన మలాకా వెళ్లిపోతున్నారు."

"అయితే, అదంతా నిజమేనా గేతానో? నన్నీ ద్వీపంలో ఆహ్వానించిన ఆ వ్యక్తి నిజంగా ఉన్నాడా? రాజమర్యాదలతో నన్నాదరించి నేను నిద్రలో ఉండగా మాయమైన అతను నిజమైన వ్యక్తేనా?"

"నిజంగానే ఉన్నారు. అదుగో—ఆవెడుతున్న బోటులో ఉన్నారు. మీ అద్దాలు (దూరదర్శినీయంత్రం) తీసి చూసినట్లయితే, ఆ బోటుమీద కనపడవచ్చును."

ఫ్రాంజ్ అద్దాలు తీశాడు. గేతానో చెప్పింది నిజమే. బోటులో ఒక చివర నిలబడి ఆ అపరిచితవ్యక్తి తనవంకనే అటువంటి టెలిస్కోప్‌తోనే చూస్తున్నాడు. రాత్రి ఏ దుస్తులు ధరించి కనపడ్డాడో, ఇప్పుడూ ఆ దుస్తులే ధరించి ఉన్నాడు. వీడ్కోలుసూచనగా చేరుమాలు తీసి ఆడించాడు.

మరుచటి క్షణంలోనే బోటులో ఒక చిన్న సన్నటి పొగ లేచింది. మెల్లిగా అది లేచి బోటుపక్కగా తేలిపోయింది. తరవాత అస్పష్టంగా తుపాకిమోత వినపడింది.

"అదిగో విన్నారా? అది మీకు వీడ్కోలుసంకేతం." అన్నాడు గేతానో." ఇంక ఇప్పుడేం చెయ్యమని తమ ఆజ్ఞ?"

"ముందుగా ఒక కాగడా వెలిగించి నాకియ్యి."

"ఓ! తెలిసింది. ఆ అద్భుతమందిరం వెతకడానికి కాదూ? తప్పకుండా ఇస్తామండి. నేనూ ఒకప్పుడిలాగే అనుకున్నా నాలుగైదుసార్లు వెతికాను. కాని విసుగెత్తి చివరికి మానేశాను," అన్నాడు. అని ఒక నావికుని పిలిచి కాగడా తెమ్మని ఆజ్ఞ ఇచ్చాడు.

కాగడా తేగానే ఫ్రాంజ్ అది చేత పుచ్చుకుని వచ్చిన ద్వారంవైపు వెళ్లాడు. అతని వెనుక గేతానో అనుసరించాడు.

అతను పడుకున్న మెత్తని గడ్డిపడక కనపడింది. ఆ గుహంతటినీ కాగడా సహాయంతో వెతికాడు. గోడలు తడిమిచూశాడు. ఏమీ కనపడలేదు. అక్కడక్కడ పొగమూరిన మసిమాత్రం కనపడింది. తనకి ముందు అనేకమంది కాగడాలతో వెతికిఉంటారని గ్రహించాడు.

అయినాసరే, అక్కడంతటా అంగుళంమేరకూడా విడిచిపెట్టకుండా పరిశీలించాడు. నల్లని కటికరాయి తప్ప మరేదీ కనపడలేదు. కనపడిన ప్రతి నెరదలోనూ వేటకత్తి చొనిపి రాయి తియ్యడానికి ప్రయత్నించాడు. ఎక్కడ కాస్త రాయికొన లేగట్టిగా దట్టించక విడిచిపెట్టలేదు. కాని అంతా నిరర్థకమయింది. రెండు గంటలసేపు వెతికి నిరాశచెందాడు. తరవాత తన యత్నం మానుకున్నాడు.

ఫ్రాంజ్ వచ్చినపని నిప్పుడు గేతానో గుర్తుకి తెచ్చాడు. కొండగొర్రెల్ని వేటాడాలి. ఫ్రాంజ్ ఆ విషయమే పూర్తిగామరిచిపోయాడు. ఇప్పుడు తుపాకి తీసుకుని ద్వీపంఅంతటా తిరగనారంభించాడు. ఒక పెద్దగొర్రెని, రెండు పిల్లల్ని కొట్టితెచ్చాడు. కాని ఈవేట అతని కంత తృప్తి కలిగించలేదు.

అదీకాక అతనికి అనేక ఇతరవిషయాలు జ్ఞప్తికి వచ్చాయి గుహ అతన్నింకా బలంగా ఆకర్షిస్తూనే ఉంది. ఒకసారి విఫలమైనా రెండోసారి వెతకడానికి వెళ్లాడు. గొర్రెల్ని వండమని గేతానోకి ఒప్పచెప్పి పంపివేశాడు. రెండోసారి చాలసేపు వెతికాడు. తిరిగి వచ్చేసరికి మాంసం వండి సిద్ధపరచబడింది.

గడిచిన రాత్రి ఆహ్వానం రాక ముందెక్కడ కూర్చున్నాడో ఇప్పుడక్కడికి చేరాడు ఫ్రాంజ్. ఇంకా అపరిచితుని బోటు కార్సికావైపు కనపడుతూనే ఉంది. కెప్టెన్‌ని పిలిచాడు: "సింద్‌బాద్ మలాకా వెడుతున్నట్లు చెప్పావ్? కాని ఆ బోటు చూడు, వెఖియావైపు వెడుతోందే?"

"ఆయనబలగంలో ఇద్దరు కార్సికన్ దొంగలున్నారని కూడా చెప్పానండి తమతో. వాళ్ళని అక్కడ దింపేస్తాడు. దేవుడయ్యేది, దెయ్యమయ్యేది ఆయన జంకడండి. పేదవాళ్లకి సహాయం చెయ్యడానికైతే నూరుమైళ్ళు దారితప్పి వెళ్ళవలసినా వెడతాడండి."

"ఇటువంటి సహాయాలు చేస్తే, అధికారుల చేతిలో పడితే?"

"అధికారులంటే ఆయనకి భయ మెందుకు? వాళ్లని చూసి నవ్వుతాడు. అతన్ని వెంటాడనివ్వండి. చూదాం? అతని బోటు మామూలురకం కాదు. పక్షిలా ఎగిరిపోగలదు. అసలదీ అక్కర లేదు. తీరం ఎక్కితే చాలు, అతని కందరూ మిత్రులే."

ఇంక మాంట్ క్రిస్టోద్వీపంలో ఉండవలసినపని లేదనుకున్నాడు ఫ్రాంజ్. రహస్యమందిరం కనుక్కునే ఆశ పూర్తిగా అంతరించింది. భోజనంచేసి బోటు సిద్ధపరచమని కెప్టెన్‌కి ఆజ్ఞ ఇచ్చాడు.

అరగంటలో ఫ్రాంజ్ బోటెక్కాడు. ఆఖరుసారి దూరాన ఉన్న బోటు చూశాడు. పఖియోరేవులోకి అది అంతర్ధానం కాబోతోంది.

ఫ్రాంజ్ ఆజ్ఞ అందుకుని నావికులు లంగరెత్తారు. ఆవలి బోటుతోపాటు, అతనికి రాత్రి స్మృతులుకూడా మాయమైనాయి. తవేందు, సింద్‌బాద్, గంజాయిలేహ్యం, శిలాప్రతిమలు అన్నీ కలమాదిరిగా మరుపులో పడిపోయినాయి.

ఆరోజూ, రాత్రీ బోటు ప్రయాణంచేసింది. మరునాటి ఉదయానికి మాంట్ క్రిస్టో ద్వీపం కనపడకుండా దూరమైపోయింది.

ఫ్రాంజ్ మళ్లీ తీరంపైన అడుగుపెట్టిన తరవాత అంతా మరిచిపోయాడు. ఫ్లారెన్స్‌లో మిగిలిన కార్యాలు నెరవేర్చుకున్నాడు. తరవాత తన మిత్రుని కలుసుకోడానికి రోమ్ నగరానికి ప్రయాణమైనాడు.

శనివారం సాయంకాలానికి ఇటలీ చేరాడు. బస ముందే ఏర్పాటయింది. అక్కడికి వెళ్లడమే తరవాయి. అయితే అక్కడికి వెళ్లడం మాటలు కాదు. వీధులనిండా జనసమ్మర్దం అత్యధికంగా ఉంది. అప్పటికే రోమ్‌నగరంలో ఉత్సవాల రద్దీ కనపడుతోంది. ప్రతి సంవత్సరం ఈ నగరంలో నాలుగు పెద్ద ఉత్సవాలు జరుగుతాయి. క్షణక్షణానికీ వృద్ధవుతున్న రద్దీలో ఎలాగో ఒకలాగ దారిచేసుకుని ఫ్రాంజ్ హోటల్ చేరాడు. చేరి వాకబు చెయ్యగా సే లండ్రా హోటల్లో ఖాళీ లేదని తెలిసింది. అప్పుడు తనపేరు, విలాసంకల కార్డు ఒకటి యజమానికి పంపాడు. ఆల్బర్ట్‌ని రావలసిందని కబురుపంపాడు. ఈమారిది పనిచేసింది. యజమాని స్వయంగా పరుగెత్తుకుంటూ వచ్చాడు. నిలబెట్టినందుకు క్షమార్పణ కోరి, స్వయంగా ఆల్బర్ట్ వద్దకు తీసుకు వెళ్లాడు. ఏర్పాటయిన బసలో రెండు చిన్నగదులు, ఒక లోగది ఉన్నాయి. గదులలోనుంచి వీధిలోకి చూడవచ్చును. ఈ వీలు అన్నిగదులికీ లేదని యజమాని పదేపదే చెప్పుకున్నాడు. ఆ అంతస్థులో మిగతా గదులన్నిటినీ ధనాఢ్యుడైన ఒక వ్యక్తి అద్దికి తీసుకున్నాడు. అతను సిసిలీకో మాల్టాకో చెందినవాడని అనుకుంటారు.

"బాగానే ఉందండి. అయితే మాకు ముందుగా భోజనం ఏర్పాటు కావాలి. రేపటికి,ఆ మైరోజులికీ మాకొక బండి కావాలి." అన్నాడు ఫ్రాంజ్ హోటల్ యజమానితో.

"భోజనమైతే వెంటనే వస్తుందండి" అన్నాడు హోటల్ యజమాని. "బండిమాట మేం చెయ్యదగినంతా ప్రయత్నం చేస్తామండి. కాని ఇప్పుడు బంగారం రాసిపోసినా దొరకదని నా భయం."

"పోనివ్వండి. నా బండికి గుర్రాలు మాసి పెడితే చాలు. అది ఎంత బాధైనా, ఏదీ లేనిదానికంటె మేలు."

"గుర్రా లసలు లేవండి. ఈ పదిహేను రోజులికీ ముందే అన్నిటినీ అద్దికిచ్చేశారు. ఇప్పుడొక్కటీ మిగల్లేదు."

"ఇంక ఇప్పుడేం చెప్పేది?" అన్నాడు ఫ్రాంజ్.

"ఒకటి మన చేతుల్లో లేదని తెలిసిపోయినప్పుడు, నే నింక దాన్నిగురించి ఆలోచించను. మిగతా విషయాలు చూసుకుంటాను. భోజనం సిద్ధంగా ఉందా?" అన్నాడు ఆల్బర్ట్.

"సిద్ధంగా ఉందండి."

"సరే ముందు భోజనం కానివ్వాలి పద" అన్నాడు ఆల్బర్ట్.

"మరి బండీ, గుర్రాల మాటో?" అన్నాడు ఫ్రాంజ్.

"ఇప్పుడు బెంగపెట్టుకోకు" అన్నాడు ఆల్బర్ట్. "ఆ సమయానికి అదే వస్తుంది. తేల్చుకోవలసిందల్లా ఏమిటంటే, వాటికెంత చెల్లించగలం, అని."

ధనం వెచ్చిస్తే సమకూడనిదుండదనే విశ్వాసంతో ఆల్బర్ట్ భోజనానికి బయలుదేరాడు. రాత్రి నిశ్చింతగా నిద్రపోయాడు. ఆరు గుర్రాల బండిలో ఉత్సవాలు చూస్తూ రోమ్‌నగరం అంతా తిరుగుతున్నట్లు కలలుకన్నాడు. ★

డైరీ

(4-వ పేజీ తరువాయి)

—కాశ్మీర్‌లో రాజ్యాంగ పరిషత్తు స్థాపించడానికి జరుగుతున్న యత్నాలను వారించవలసిందని పాకిస్తాన్ ప్రభుత్వం భద్రతామండలిని కోరింది.

—కాశ్మీర్ గురించి భద్రతామండలి తీర్మానాన్ని భారతప్రభుత్వం నిరాకరించినందుకు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆమోదం ప్రకటించింది.

—1948 - 49 లో భారతదేశంలో రు 8710 కోట్ల రూపాయల విలువగల సామగ్రి ఉత్పత్తయిందని, (అనగా తలకి రు 255 విలువగల సామగ్రి) నేషనల్ ఇన్కమ్ కమిటీ నివేదించింది.

ఆదివారం, మే 6 :

—తెలంగాణా కమ్యూనిస్టులు పన్నెండుగురికి విధించబడిన మరణశిక్షను తప్పించి, రిపబ్లిక్ అధ్యక్షులు ఆ జన్మ కారాగారవాసశిక్షకు మార్చారు.

—ఆలిండియా ముస్లిం కన్వెన్షన్ (కలకత్తా) కాశ్మీర్ గురించి పండిట్ నెహ్రూ విధానాన్ని బలపరిచింది.

—మధ్య భారతదేశంలో 80 లక్షల ఎకరాల భూమిని సాగులోకి తెచ్చే ఏడేళ్ల ప్రణాళిక సవ్యంగా సాగడం లేదని ప్రపంచ బాంక్ అభిప్రాయం తెలిపినట్లు తెలియవచ్చింది.

—ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సెంట్రల్ ఎలెక్షన్ కమిటీ సభ్యులుగా పండిట్ పంత్, డా॥ బి. సి. రాయ్ మురార్జీదేశాయ్, నిజలింగప్ప, కామరాజ నాడార్ గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

—వస్త్రంపైనా, పంచదార పైనా కంట్రోల్ తొలగించాలనే తీర్మానాన్ని ఆలిండియా కాంగ్రెస్ కమిటీ నిరాకరించింది.

—1948 - 49 లో భారత రిపబ్లిక్ ప్రజలపై పడిన పన్నుల భారం మొత్తం రు 710 కోట్లు అని నేషనల్ ఇన్కమ్ కమిటీ నివేదించింది.

—ఒరిస్సా గవర్నర్‌గా శ్రీ వి. పి. మీనన్ ప్రమాణం స్వీకరించారు.

—జస్టిస్‌పార్టీ 17 వ సమావేశం (మద్రాసు) కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కులవిచక్షణ విధానంపట్ల ఆమోదం ప్రకటించింది. ★

బరువెక్కిన గుండె

(18-వ పేజీ తరువాయి)

మోహనరావుమాటలు విని సుధ మరీ వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది. సుశీల, మోహనరావు కూడా కారణం తెలియక ఆదుర్దాగా వున్నారు. ఐదునిముషాలైన తరువాత సుశీల—

"సుధా! ఎందుకమ్మా ఏడుస్తావు? చెప్పు." అన్నది. మోహనరావు కూడా-

"మీ అత్తతో చెప్పటానికి జంకుతావేమమ్మా చెప్పు మీ అమ్మ......"

మోహనరావుమాట విని సుధ కంపిత స్వరంతో—

"మా అమ్మ.... మా అమ్మ వుంటే నేనెందుకిక్కడ వుంటాను..."

"ఏమైంది? చనిపోయిందా?"

"అవును... అయ్యో..."

సుధ నోటివెంట నిర్మల చనిపోయిందనే మాట విని సుశీల దుఃఖంతో—

"అయ్యో! మీ అమ్మ... చనిపోయిందా? పాపం. ఏం జబ్బు?"

"ఏమీ జబ్బులేదు... మా నాన్న చేసిన ఘనకార్యం..."

"మీ నాన్నే... నిర్మలని చంపింది?"

"కేవలం మా నాన్నే కాదు-పోలీసులు-"

"పోలీసులా? పోలీసులకేం పని?"

"ఒక రోజున మా నాన్న కోసం - పోలీసులు మా యింటికి వచ్చారు-"

ఈ మాటలు సుధ చెపుతూవుండగానే మోహనరావు ఉలిక్కిపడి—

"మీ నాన్న కమ్యూనిస్టులో చేరాడా?"

"అదే మాకువచ్చిబాధ - మా నాన్న మూడేళ్లనుంచీ కమ్యూనిస్టు పార్టీతో సంబంధం పెట్టుకున్నాడు. పార్టీలో పెద్ద లీడరు. అబ్బ - వినగూడదు - చెప్పకూడదు కాని- ఆయన ఎన్ని హత్యలు - ఎన్ని దోపిళ్లు..."

ఇలా అని సుధ కంపించిపోయింది. సుశీల నిశ్చేష్టురాలైంది - మోహనరావు సుధకేసి చురచుర చూస్తూ—

"అవును. అతడికోసం మీ యింటికి పోలీసులు వచ్చారు గాబోలు-"

"అవును. మా నాన్నకోసం మాయింటికి పోలీసులు వచ్చారు. ఆయన పోలీసులు రావటం కనిపెట్టి తలుపుచాటున దాక్కున్నాడు. పోలీసులు మా నాన్న తలుపుచాటున వున్నట్లు తెలుసుకొని పిస్తోలు పేల్చబోయారు. సరిగా ఆసమయానికే మా అమ్మ మా నాన్నముందుకు ఆ దెబ్బ తప్పించటానికి వచ్చింది... దురదృష్టవశాత్తూ దెబ్బఅడ్డంవచ్చిన మాఅమ్మకు తగిలింది... ఇంకేముంది అప్పుడే మాఅమ్మ నేలమీద కూలింది... పోలీసులు మాఅమ్మ చనిపోయిందని విచారంతో ఆమెను లేవదీస్తుంటే మా నాన్న నెమ్మదిగా గోడదాటి వీధిలోపడి తప్పించుకుపోయాడు. మొదటినుంచీ నేనూ మా అమ్మా కమ్యూనిస్టు పార్టీ సంబంధం వద్దని చెప్పతూనే వున్నాం. మా పొలం, ఇల్లు అంతా అమ్మి పార్టీకోసం ఖర్చుపెట్టేశాడు..."

ఇలా అని సుధ బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టింది. నిదానంగా వింటున్న మోహనరావు ఒక దీర్ఘనిశ్వాసం వదిలాడు. సుశీలకళ్ళ వెంట నీళ్లు కారుతున్నాయి. గోపాలరావు తండ్రికేసి చూస్తున్నాడు. కొంచెంసేపు అంతా మాట్లాడకుండా వూరుకున్నారు - మోహనరావు నెమ్మదిగా సుధతో - ఆలోచనతో—

"సుధా! నువ్వు కమ్యూనిస్టు లీడరు కూతురవన్న మాట - అవునా?"

"అవును...నాకు కమ్యూనిస్టుపార్టీతో సంబంధం లేదు."

"అలాగా— మీ నాయన ద్రోహి. మీ కుటుంబం నాశనం చేసింది కాక మా యింట్లో కూడా నిప్పుపెట్ట దలచుకున్నాడు. కనుకనే నిన్ను తీసుకువచ్చి ఇక్కడ వదలిపెట్టాడు."

గోపాలరావు తండ్రిమాట కడ్డంవచ్చి—

"సుధ ఏం చేస్తుంది నాన్నగారూ?"

ఇందులో నీ విషయం లేదు. హంతకులైన కమ్యూనిస్టులను - కమ్యూనిస్టుల బంధువులను—సంబంధీకులను ఎవరినైనా సరే దయ తలచరాదు - ఇదుగో నేను చెపుతున్నాను. రేపు సాయంత్రంలోగా మాయింట్లోనుంచి నువ్వు—"

సుశీల మోహనరావు పూర్తిగా మాట్లాడక పూర్వమే అందుకొని—

"మీరు సుధనుకూడా అనుమానిస్తున్నారా?"

"మీకు వ్యవహారం ముందు వెనుకలు తెలియవు. గోపీ! నువ్వూ మీ అమ్మా కూడా నా మాటకు అడ్డుచెప్పకండి... బాగా ఆలోచించండి......"

ఇట్లా చెప్పి మోహనరావు చరాలున లేచి గదిలోకి పోయి పడుకున్నాడు.

సుశీలా, సుధ ఇంట్లోకి పోయినారు. గోపాలరావు బైట గదిలో పడుకున్నాడు.

ఆ రాత్రి ఇంట్లో ఎవ్వరూ కూడా నిద్రపోలేదు. ఎల్లాగో తెల్లవారింది. ఎవరి పనులు వారు ఎట్లాగో చేసుకుంటున్నారు. పదకొండు గంటలకు సగం భోజనంచేసి కలత చెందే మనస్సుతో మోహనరావు కోర్టుకు వెళ్లేడు. మోహనరావు మనస్సులో పెద్ద తుఫాను బయలుదేరింది. కృష్ణమూర్తి తన బాల్యస్నేహితుడు. తప్పుడు త్రోవలో పడ్డాడు. సుధ అతని కుమార్తె. ఆయన ఆశయాలకు కేవలం వ్యతిరేకంగా నడిచేది. తల్లిలేని పిల్ల. ఆమెను తన ఇంట్లో వుంచితే ప్రభుత్వానికి అపచారం చేసినట్లవుతుందేమో! ఆశ్రయమీయవలసినదని తన యింట్లో తనపైన నమ్మకంకొద్దీ విడిచిన అనాధబాలికను ఇంట్లోంచి వెళ్ళగొడితే భగవంతుని దృష్టిలో అపచారం చేసినట్లవుతుందేమో- ఈ విధంగా ద్వైధీభావంతో, బరువెత్తిన గుండెతో, మోహనరావు కోర్టులో తన ఆసనంమీద కూర్చున్నాడు.

ఆయన కూర్చోవటంతోటే - తెలంగాణాలో అనేకహత్యలకు, గృహదహనాలకూ పేరుపడ్డ కృష్ణమోహన్ అనే కమ్యూనిస్టును విచారణ నిమిత్తం కోర్టుకు హాజరు పర్చారు. చేతులకు, కాళ్లకు సంకెళ్లు వేసి కృష్ణమోహన్‌ను బోనులో నుంచోపెట్టేరు.

మోహన్‌రావు ఖైదీకేసి చూశాడు. ఒక్కసారిగా అతని కళ్లు మూసుకుపోయి కృష్ణమూర్తిని ఆ స్థితిలో బోనులో తను చూడాల్సివస్తుందని అనుకోలేదు. కొన్ని నిముషాలు గడిచినై. పోలీసు సర్కిల్ ఇనస్పెక్టరు కృష్ణమోహన్ చేసిన హత్యలు, దోపిడులు ఏకరువుపెట్టాడు. తనదగ్గర వున్న సాక్ష్యం వ్రాతపూర్వకంగా వున్నదాన్ని మోహనరావుఎదుట పెట్టాడు.

మోహనరావు తొట్రుపాటు లేకుండా పోలీసు ఉద్యోగి చెప్పేదంతా విన్నాడు. ఖైదీకేసి చూసి-

"నీ పై మోపబడ్డ ఈ నేరాలకు నీ వేమి చెపుతావు?" అని ధైర్యం చిక్కబట్టుకుని ప్రశ్నించాడు. వెంటనే కృష్ణమూర్తి—

"పోలీసులు చెప్పే నేరాలు నేను చేసినవే - ఇంకా అనేకములు కూడా చేశాను. ఆ చేయుటంలో నేను నమ్మిన మార్గాలు నాకు ధైర్యం చేకూర్చినై. కోర్టువారు ఇష్టంవచ్చినట్లు చెయవచ్చు" అన్నాడు.

మోహనరావు తన రెండుకళ్ళతోనూ బాల్యస్నేహితుడైన కృష్ణమూర్తిని ఒకసారి సాభిప్రాయంగా ఎగాదిగా చూశాడు. మోహనరావుచూపులు కృష్ణమూర్తి చూపులలోకి చొచ్చుకుపోయినై.

వెంటనే మోహనరావు చెమర్చిన తన కంట్లను కళ్లద్దాలమాటున దాచుకున్నాడు. తల వంచుకుని వ్రాసిన "కృష్ణమూర్తిమరణ దండన" కోర్టులో అసహజమైన కంఠంతో వినిపించి కుర్చీమీదనుంచి దిగాడు.

సాయంత్రం గుండెబరువుతో ఇంటికి చేరిన మోహనరావుకు సుధా గోపాలరావులు ఇంట్లోనుంచి వెళ్లిపోవడం ఒక ఆఘాతంలా తగిలింది. ★


అతి త్వరలో!
టి.యన్.టి వారి
నవ్వితే నవరత్నాలు
కృష్ణకుమారి...రామశర్మ...
నిర్మలాదేవి... అడ్డాల...సీత...వంగర... లలిత...పద్మిని
వెంకటేశ్వరరావు...భూదేవి...
డైరెక్టర్...యస్.సౌందరరాజన్
N44

Regd. No. M. 4479